www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
గురువారం
29-08-2024
సంపుటి : 01 | సంచిక : 117 | పేజీలు : 12 | వెల : 5/-  తెలంగాణ / ఆంధ్రప్రదేశ్

V3 NEWS


డా॥ కాచం సత్యనారాయణ
CMD

చెరువులు,కుంటలు, నాలాలను ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాల విషయంలో ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. చివరికి నా కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరైనా అక్రమ నిర్మాణాలకు పాల్పడి ఉన్నారని రుజువు చేస్తే నేనే దగ్గరుండి కూల్చేయిస్తా. మల్లారెడ్డి, పల్లా, రాజశేఖర్ రెడ్డి, ఎంఐఎం, కాంగ్రెస్ నేతలు ఎవరైనా హైడ్రా కు సమానమే. విద్యా సంవత్సరం నష్టపోకూడదనే ఉద్దేశంతోనే ఓవైసీ కాలేజీ విషయంలో సమయం ఇచ్చాం. అక్రమ నిర్మాణాల తొలగింపు పై ఎవరికి ఎలాంటి అపోహలు అవసరం లేదు. అవసరమైతే ప్రజా కోర్టు పెడదాం. నిజనిర్ధారణ కమిటీ వేసేందుకూ సిద్ధంగా ఉన్నాం. నిజాన్ని నిరూపించుకునేందుకు బీఆర్ ఎస్‌కు ఇది మంచి అవకాశం. గతంలో నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న హరీశ్‌రావు ఆ కమిటీకి అధ్యక్షులుగా వ్యవహరించవచ్చు. -ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



# ఎవరిదైనా సరే.. కూల్చేయండి

## అక్రమ నిర్మాణాలపై ఎంతటి వారినైనా వదిలిపెట్టం

- నా కుటుంబ సభ్యులైనా దగ్గరుండి కూల్చేయిస్తా
- ఆక్రమణలపై నిజ నిర్ధారణ కమిటీకి మేం సిద్ధం
- కమిటీకి హరీశ్ రావు నేతృత్వం వహించిన పర్వాలేదు
- కేటీఆర్ ఫామ్ హౌస్ ముమ్మాటికి అక్రమ నిర్మాణమే
- అక్రమ నిర్మాణాలపై అవసరమైతే ప్రజా కోర్టు ఏర్పాటు చేస్తాం
- విద్యాసంవత్సరం నష్టపోవద్దనే ఓవైసీ కాలేజీకి సమయమిచ్చాం
- హైడ్రా చర్యలపై మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి


2


3

## రాష్ట్రానికి ప్రయోజనం కలిగించేలా అలైన్‌మెంట్

- ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## మర్రి రాజశేఖర్ రెడ్డి కళాశాలకు నోటీసులు

- పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన అనురాగ్ యూనివర్సిటీకి కూడా
- జన్వాడ ఫాంహౌస్‌లో కొనసాగుతున్న సర్వే
- అక్రమార్కుల గుండెల్లో దడ

2

# కవితకు ఘన స్వాగతం

### భర్త, సోదరుడు, తనయుడితో కలిసి హైదరాబాద్‌కు రాక

- ఘనంగా స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు
- భారీ ర్యాలీతో నివాసానికి
- ఇంటివద్ద బాణాసంచా పేల్చి సంబురాలు
- ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని వ్యాఖ్య

2






2

## మిలియన్ మార్చ్ తరహాలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ మహోత్సవం

## గాంధీ విగ్రహాన్ని గాడ్సే పెట్టినట్లుంది

- తెలంగాణ తల్లి గుండెల్లో గునపాలు దించి విగ్రహం పెట్టినా అవమానమే
- తెలంగాణకు అక్కరకు రానివాళ్ల బొమ్మలను తొలగిస్తాం: కేటీఆర్

2





## వేములవాడలో నిత్యాన్నదాన సత్రం

### తిరుమల తరహాలో ఏర్పాటు చేస్తాం.. మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**విశ్వంభర, కరీంనగర్:** తిరుమలలో వెంగమాంబ అన్నదాన సత్రం మాదిరిగానే వేములవాడలో రాజేరాజేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన సత్రం నిర్మాణానికి కృషి చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాబోవు కార్తిక మాసం నాటికి వేముల వాడ మిగతా2లో...

## సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్‌లకు కొత్త చీఫ్‌ల నియామకం

### ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం





**ఢిల్లీ:** దేశంలో కీలక భద్రతా సంస్థలైన సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్‌లకు కొత్త చీఫ్‌లను నియమించింది. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ మిగతా2లో...

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 109 | రిటైల్ ₹ 131 |
| స్కిన్ ₹ 190 | స్కిన్ లెస్ ₹ 216 |



## అంగన్‌వాడీలో కుమార్తెను చేర్పించిన కలెక్టర్

**విశ్వంభర, కుమ్రంభీం ఆసిఫాబాద్:** తన కుమార్తెను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదర్శంగా నిలిచారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ సముదాయంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. దీంతో ఆయన కేంద్రాన్ని పరిశీలించేందుకు వచ్చారని అందరూ భావించారు. అయితే, ఆయన వచ్చింది తన నాలుగేళ్ల కుమార్తె స్వర్ణను అందులో మిగతా2లో...





## కవితకు ఘన స్వాగతం

**(మొదటి పేజీ తరువాయి)**

విశ్వంభర, హైదరాబాద్: అయిదున్నర నెలల తర్వాత హైదరాబాద్ లో అడుగుపెట్టిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు అపూర్వ స్వాగతం లభించింది. మంగళవారం జైలు నుంచి విడుదలైన ఎమ్మెల్సీ కవిత.... బుధవారం మధ్యాహ్నం తన సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్, ఆమె భర్త అనీల్, కుమారుడు ఆదిత్య, ఇతర బీఆర్ఎస్ నాయకులతో కలిసి హైదరాబాద్ కు వచ్చారు. సాయంత్రం 5 గంటల 30 నిమిషాలకు హైదరాబాద్ కు చేరుకున్న ఎమ్మెల్సీ కవితకు శంషాబాద్ విమానాశ్రయంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా " కేసీఆర్ జిందాబాద్ ... బీఆర్ఎస్ జిందాబాద్... జై తెలంగాణ " నినాదాలు మార్మోగాయి. అనంతరం భారీ ర్యాలీతో బంజారాహిల్స్ లోని తన నివాసానికి చేరుకున్నారు. అక్కడ కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు చేశారు. కవిత తన నివాసం వద్ద కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేశారు.

**తల్లికి పాదాభివందనం.. కేటీఆర్‌కు రాఖీ**

ఇంటికి చేరుకున్న ఎమ్మెల్సీ కవిత తన తల్లి శోభమ్మకు పాదాభివందనం చేసి ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. ఈ క్రమంలో వారు భావోద్వేగానికి లోనయ్యారు. అదే సమయంలో తన సోదరుడు కేటీఆర్ కు ఎమ్మెల్సీ కవిత రాఖీ కట్టారు.

**నా పోరాటం ఆగదు...ప్రజా క్షేత్రంలో బలంగా పనిచేస్తా: కవిత**

ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ.... నిజం గెలిచిందని, ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని స్పష్టం చేశారు. ఈ కష్టసమయంలో కేసీఆర్ కు, తనకు, తన కుటుంబానికి అండగా ఉన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎటువంటి తప్పు చేయని తాను కడిగిన ముత్యంలా బయటికి వస్తానన్న విశ్వాసం మొదటి నుంచి తనకు ఉందని తెలిపారు. "నేను ఏ తప్పూ చేయలేదు. ఎప్పటికైనా న్యాయం గెలిచి తీరుతుంది. నేను ఎలాంటి తప్పు చేయలేదు కాబట్టి ఏదో ఒక రోజు నిజమేంటనేది తెలుస్తుంది. ఆ రోజు వరకు నా పోరాటం ఆగదు. కేసీఆర్ నాయకత్వంలో పోరాడతా. ప్రజా క్షేత్రంలో ఇంకా బలంగా పనిచేస్తా. ఇక నుంచి బీఆర్ఎస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటా. ఈ కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటపడతా అనే నమ్మకం, విశ్వాసం నాకు ఉన్నాయి." అని ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యానించారు. తాను తెలంగాణకు, తన ఇంటికి రావడం సంతోషంగా ఉందని ఆమె అన్నారు.

## సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్‌లకు కొత్త చీఫ్‌ల నియామకం

**(మొదటి పేజీ తరువాయి)**

ఫోర్స్ డైరెక్టర్ జనరల్ రాజ్విందర్ సింగ్ భట్టి నియమితులయ్యారు. సీనియర్ ఐపీఎస్ అధికారి అయిన రాజ్విందర్ సింగ్.. వచ్చే ఏడాది సెప్టెంబర్ 30వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు. అలాగే, బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ దల్జిత్ సింగ్ చౌధరి నియమితులయ్యారు. ఆయన 1990 ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం ఆయన ఎస్ఎస్బీ డీజీగా కొనసాగుతున్నారు. బీఎస్ఎఫ్ చీఫ్ గా ఆయన వచ్చే ఏడాది నవంబర్ 30వరకు లేదా తదుపరి ఆదేశాలు వచ్చే వరకు కొనసాగుతారని కేంద్రం తెలిపింది.

## వేములవాడలో నిత్యాన్నదాన సత్రం

**(మొదటి పేజీ తరువాయి)**

ఆలయంలో నిత్యాన్నదాన సత్రం ప్రారంభిస్తామని ఆయన వివరించారు. శ్రావణమాసం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం వేములవాడ రాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చిన మంత్రికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఆలయ ఈవోలు స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారికి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడుతూ .. రాజరాజేశ్వర స్వామి భక్తుడిగా శ్రావణమాసం సం దర్భంగా వేములవాడ రాజన్నను దర్శనం చేసుకున్నట్లు చెప్పారు. ఆలయం మరింత అభివృద్ధి జరగాల్సిన అవసరముందన్నారు. తెలంగాణ ప్రభుత్వ పక్షాన దేవాలయానికి వచ్చే భక్తుల సౌకర్యానికి అనుగుణంగా శాస్త్రోక్తంగా వేదపండితులు, శృంగేరి పీఠాధిపతి సలహాలుసూచనల మేరకు ఆలయ విస్తరణ చేస్తామని తెలిపారు.

**అన్నదాన సత్రానికి భక్తులు, దాతల సహకరించాలి**

తిరుమలలో ఉన్న నిత్యాన్నదాన కార్యక్రమం మాదిరిగానే వేములవాడలో కూడా నిత్యాన్నదాన సత్రం ఏర్పాటు చేసేందుకు శివుని అశీర్వాదం కోరుతున్నామని అన్నారు. నిత్యాన్నదాన సత్రం ఏర్పాటుకు సంబంధించి భక్తులు, దాతల సహకారం కూడా అవసరమని తెలిపారు. తిరుమలలో అన్నదాన సత్రం ప్రారంభించిన దివంగత ఎన్టీఆర్‌ను ప్రజలు ఇప్పటికీ జ్ఞాపకం ఉంచుకుంటున్నట్లు వెల్లడించారు. అన్న దాన సత్రంలో సేవ చేయడానికి స్వచ్ఛంద సంస్థలు, భక్తులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. నిత్యాన్నదాన సత్రం భవన నిర్మాణాన్ని ప్రభుత్వం తరఫున నిర్మిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో గోశాలలో కోడెలు ఇబ్బందులు కలగడంతో ముఖ్యమంత్రి సూచనలతో అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. భక్తులు ఇచ్చిన కోడె లు పక్కదారి పట్టకూడదని రైతులకు ఉచితంగా ఇప్పటివరకు 1500 కోడెలను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఆలయ అభివృద్ధిలో ప్రజలందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుంటామని,పొరపాట్లు ఉంటే బహిరంగంగా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## అంగన్‌వాడీలో కుమార్తెను చేర్పించిన కలెక్టర్

**(మొదటి పేజీ తరువాయి)**

చేర్చేందుకు వచ్చారని తెలిసి అందరూ ఆశ్చర్యపోయారు. ఈ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారని, ఆటపాటలు కూడా నేర్పుతున్నారని, అందుకే తన కుమార్తెను అందులో చేర్చినట్టు కలెక్టర్ తెలిపారు.

# మిలియన్ మార్చ్ తరహాలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ మహోత్సవం

- డిసెంబరు 9న లక్షల మంది సమక్షంలో వేడుక
- పదేళ్లు అధికారంలో ఉన్నా గత పాలకులకు తెలంగాణ తల్లి గుర్తుకురాలేదు...
- మేధావుల సూచన మేరకే సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం
- తెలంగాణ తల్లి విగ్రహ భూమి పూజ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** పరిపాలనకు గుండెకాయ వంటి సచివాలయ ప్రాంగణంలో డిసెంబరు 9వ తేదీన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన మిలియన్ మార్చ్ తరహాలో లక్షలాది మంది తెలంగాణ బిడ్డల సమక్షంలో ఆ రోజు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని ఆయన తెలిపారు. రాష్ట్ర సచివాలయం ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ఉదయం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమి పూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించాలనుకున్నామని, వేద పండితులను సంప్రదిస్తే ఈ రోజు మినహా దసరా వరకు మంచి రోజులు లేవని చెప్పారన్నారు. ముందుగా నిర్ణయించిన మేరకు ఉప ముఖ్యమంత్రి కేరళ పర్యటనకు వెళ్లడం, మంత్రుల ఇతర కార్యక్రమాల్లో బిజీగా ఉండడంతో హడావుడిగా కార్యక్రమాన్ని నిర్వహించాల్సి వచ్చిందన్నారు. సంకల్పం, పట్టుదల ఉంటే సాధ్యం కానిది లేదని తెలంగాణ ఉద్యమకారులు నిరూపించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో ఇచ్చిన మాట మేరకు సోనియా గాంధీ 60 ఏళ్ల తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చారని ముఖ్యమంత్రి కొనియాడారు. 2014లో తెలంగాణ ఏర్పాటు కావడం సువర్ణాక్షరాలతో లిఖించదగిన అంశమన్నారు. 2014 నుంచి 2024 వరకు పదేళ్లు తెలంగాణను పాలించిన వారు ఎన్నెన్నో నిర్మించామని, ప్రపంచానికి ఆదర్శంగా నిలిచామని గొప్పలు చెప్పుకున్నారని, కానీ తెలంగాణ తల్లిని తెరమరుగు చేసే ప్రయత్నం చేశారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. తామే తెలంగాణకు సర్వస్వమని భావించారని, తానే తెలంగాణ... తెలంగాణే తాను అనే విధంగా విధంగా గత పాలకులు వ్యవహరించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అలాంటి విధానాలకు విరుద్ధమన్నారు. ప్రగతి భవన్ పేరిట గడీ నిర్మించుకొని, భారీ కంచెలు ఏర్పాటు చేసుకొని వందలాది మంది పోలీసు పహారా పెట్టుకొని తెలంగాణ ప్రజలను అందులోకి రాకుండా నిషేధించారని, తాము అధికారంలో వచ్చాక ప్రగతి భవన్ పేరును ప్రజా భవన్‌గా మార్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. గడీగా మారిన ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చి దేశానికి ఆదర్శంగా నిలిచామని, ఇప్పుడు ఎవరైనా ప్రజా భవన్‌లో స్వేచ్ఛగా వెళ్లవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. పాలనకు గుండెకాయ లాంటి సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని తాము నిర్ణయించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర పాలనకు సంబంధించిన నిర్ణయాలన్నీ ఇక్కడ జరుగుతాయని, ప్రజలు తమ సమస్యలను తెలుపుకొనే అవకాశం ఇక్కడే ఉందని ముఖ్యమంత్రి అన్నారు. పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా, మంత్రులుగా ఉన్న వారు సచివాలయంలోకి ప్రజలకు ప్రవేశం కల్పించలేదని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో రూ.22.50 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టిన వారికి రూ.కోటి పెట్టి సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసేందుకు మనసు రాలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. నెక్లెస్ రోడ్, ట్యాంక్ బండ్ చుట్టుపక్కల ఈ దేశం, రాష్ట్రం కోసం ఎంతో చేసిన అంబేద్కర్, ఇందిరా గాంధీ, అంజయ్య, పి.వి.నరసింహారావు, కాకా వెంకటస్వామి విగ్రహాలు, జైపాల్ రెడ్డి సమాధి ఉన్నాయని, వీటి మధ్య రాజీవ్ గాంధీ విగ్రహం లేని లోటుగా కనిపించిందని ముఖ్యమంత్రి అన్నారు. సచివాలయం ఎదుట ప్రదేశాన్ని తమ స్వార్థ ప్రయోజనాల కోసం కొందరు ఉంచుకోవాలని భావించారని, కానీ మేధావుల సూచన మేరకే తాము అక్కడ రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. దేశం కోసం ఎంతో చేసిన రాజీవ్ గాంధీ విగ్రహం పెడితే తెలంగాణ తల్లి విగ్రహంతో ముడిపెట్టి దానిని వివాదం చేసేందుకు ప్రయత్నించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**జూన్ రెండో తేదీనే చెప్పా..**

పదేళ్లు అధికారంలో ఉండి గత పాలకులు తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయలేదని, సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామని జూన్ రెండో తేదీనే తాను ప్రకటించానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కన్నతల్లిని తలపించేలా, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలనేది తమ అభిమతమని ముఖ్యమంత్రి అన్నారు. దొరల గడీల ఆనవాళ్లు విగ్రహంలో ఉండకూడదని, అందుకే తెలంగాణ ప్రజల అభిమతానికి తగినట్లు తెలంగాణ తల్లి విగ్రహం రూపొందించే బాధ్యతను తెలంగాణ బిడ్డ, జేఎన్ టీయూ ఫైన్ ఆర్ట్స్ విభాగం కళాశాల ప్రిన్సిపల్‌కు అప్పగించామని ముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని 2009, డిసెంబరు 9న మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం ప్రకటించిందని, అదే రోజు తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ జన్మదినం కావడంతో తెలంగాణ తల్లి విగ్రహాన్ని డిసెంబర్ 9న ఆవిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజలకు డిసెంబర్ 9 ఒక పండగ రోజు అని ముఖ్యమంత్రి అన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఇది అరుదైన అవకాశం... ఇటువంటి అరుదైన అవకాశం అందరికీ రాదని, ఈ కార్యక్రమంలో పాల్గొనే అదృష్టం తనకు దక్కిందని ముఖ్యమంత్రి అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పలువురు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఎంపీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

# ఎవరిదైనా సరే.. కూల్చేయండి

**విశ్వంభర, హైదరాబాద్:** చెరువులు,కుంటలు, నాలాలను ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాల విషయంలో ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. చివరికి తన కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరైనా అక్రమ నిర్మాణాలకు పాల్పడి ఉన్నారని రుజువు చేస్తే తానే దగ్గరుండి కూల్చేయిస్తానని వ్యాఖ్యానించారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతలు, రైతు రుణమాఫీ, పార్టీలోకి చేరికలు, కవిత బెయిల్ మంజూరు వంటి ఇతర అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి బుధవారం ఆయన మీడియాతో సంచలనాత్మక వ్యాఖ్యలు చేశారు. జన్వాడలో నిర్మించిన కేటీఆర్ ఫామ్ హౌస్ ముమ్మాటికి అక్రమ నిర్మాణమైనందుకే తాను గతంలో కోర్టుకెళ్ళానని ఆయన వివరించారు. స్నేహితుడి ఫామ్ హౌస్ లీజుకు తీసుకున్నానని చెబుతున్న కేటీఆర్ మరి ఆ విషయాన్ని ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎందుకు అఫిడవిట్ లో పొందుపరచలేదని ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాలపై అవసరమైతే ప్రజా కోర్టు పెడదామని, బీఆర్ఎస్ కు నిజాన్ని నిరూపించుకునేందుకు మంచి అవకా శవని రేవంత్ సూచించారు. అక్రమ నిర్మాణాల తొలగింపు పై ఎవరికి ఎలాంటి అపోహలు అవసరం లేదని, అవసరమైతే నిజనిర్ధారణ కమిటీ వేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, గతంలో నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న హరీశ్‌రావు అవసరమైతే ఆ కమిటీకి అధ్యక్షులుగా వ్యవహరించవచ్చునని సీఎం రేవంత్ సంచల వ్యాఖ్యలు చేశారు. శాసన సభ్యునిగా ఎలాగూ జీతం తీసుకుంటున్నారు కదా మరి పని చేయాల్సిన అవసరం లేదా అని కామెంట్ చేశారు. మల్లారెడ్డి, పల్లా, రాజశేఖర్ రెడ్డి, ఎంఐఎం, కాంగ్రెస్ నేతలు ఎవరైనా హైడ్రా కు సమానమేనని సీఎం క్లారిటీ ఇచ్చారు. ఓవైసీ కాలేజీ విషయంలో విద్యాసంవత్సరం నష్టపోతుందని సమయం ఇచ్చామని తెలిపారు.

**నేను రేవంత రెడ్డిని...కేసీఆర్ ను కాను**

అక్రమ కట్టడాల కూల్చివేతపై కేసీఆర్ ప్రభుత్వం ఎలా వ్యవహరించిందో అందరికీ తెలుసునని, గతంలో స్వార్థం కోసం నిర్మాణల కూల్చివేతలు జరిగాయని, వెంటనే ఆగాయని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కానీ నేను రేవంత్ రెడ్డిని, కేసీఆర్‌ను కాననీ, అసలు ఆయనతో పోలికే ఉండదనీ స్పష్టం చేశారు. ప్రజల ప్రయోజనం కోసమే హైడ్రా తెచ్చా మనీ, చెరువులో నిర్మాణాలు చేస్తే ఎంతటి వారైనా ఒకటేనని, అది అక్రమ నిర్మాణం అని తేలిన మరుసటి క్షణమే యుద్ధ ప్రాతిపాదికన కూల్చి వేస్తామని సీఎం తెలిపారు. లీడర్లు, హీరోలు ప్రజలకు రోల్ మోడల్ గా ఉండాలని సూచించారు. ఎవరినీ వదిలిపెట్టేది లేదని, హైడ్రా తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు. ఓఆర్ఆర్ అవతల ఉన్న గ్రామ పంచాయతీలు హైడ్రా పరిధిలో ఉన్నాయనీ, ఫామ్‌హౌస్‌లు కట్టుకున్న చాలా మంది సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు మురుగునీటిని ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లోకి వదులుతున్నారని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రభుత్వ పనులకు ... చేరికలకు సంబంధం లేదు**

ప్రభుత్వం చేస్తున్న పనులకు, చేరికలకు సంబంధం లేదని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎవరినో భయపెట్టి చేర్చుకోవాల్సిన అవసరం తమకు లేద లేదని మరోసారి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వానికి పూర్తి మెజారిటీ ఉందని, ప్రభుత్వ విధానాలు నచ్చి వస్తే పార్టీలో చేర్చుకుంటామని వివరించారు. వర్తమాన పరిస్థితులపై ప్రతిపక్ష నేతగా కేసీఆర్ మాట్లాడాలనే తాను కోరుకుంటున్నానని తెలిపారు.

**రుణమాఫీ కాని వారి వివరాలిచ్చి పాప ప్రక్షాళన చేసుకండి**

కేసీఆర్ ప్రభుత్వం 2018-24 వరకు రుణమాఫీ చేసింది కేవలం రూ.13,329 కోట్లు మాత్రమేనని, మా ప్రభుత్వం 27 రోజుల్లో 18 వేలకోట్లు రుణమాఫీ చేసిందని, రైతుకు రుణవిముక్తి కల్పించటమే తమ లక్ష్యమనీ సీఎం రేవంత్ పేర్కొన్నారు. టెక్నికల్ అంశాలతో రుణమాఫీ జరగని వారు కలెక్టర్ కు వివరాలు ఇవ్వాలని, రుణమాఫీ కానీ వారి వివరాలు కేటీఆర్,హరీశ్‌లు కూడా ఇవ్వవచ్చునని సీఎం సూచించారు. కనీసం ఇప్పటికైనా రుణమాఫీ కానీ రైతుల వివరాలు ఇచ్చి వారు చేసిన పాపాలను కడుక్కోవాలని సీఎం సూచించారు.

**బీఆరెస్ ..బీజేపీ ఒప్పందంలో భాగంగానే కవితకు బెయిల్**

కవిత బెయిల్ కోసం ఎంపీ సీట్లను బీఆర్ఎస్ త్యాగం చేసింది నిజమని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ , బీజేపీ ఒప్పందంలో భాగంగానే కవితకు బెయిల్ వచ్చినట్లు సీఎం పేర్కొన్నారు. సిసోడియా, కేజ్రీవాల్ కు రానీ బెయిల్ ఐదు నెలల్లోనే కవితకు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. మెదక్, సిరిసిల్లలో ,సిద్దిపేట, గజ్వేల్‌లో బీజేపీ కి మెజారిటీ ఇచ్చింది నిజం కాదా? అంటూ ఎద్దేవా చేశారు. ఏడు చోట్ల డిపాజిట్ కోల్పోయి, 15 చోట్ల మూడవ స్థానం వచ్చేంత బలహీనంగా బీఆర్ఎస్ ఉందా? అంటూ అనుమానం వ్యక్తం చేశారు.

# గాంధీ విగ్రహాన్ని గాడ్సే పెట్టినట్లుంది

**విశ్వంభర , తెలంగాణ బ్యూరో :** తెలంగాణ ఉద్యమం గుండెల్లో గునపాలు దించిన చేతులతో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టినా అది అవమానమే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇది గాంధీ విగ్రహాన్ని గాడ్సే పెట్టినట్లుందని ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఘాటైన విమర్శలు చేశారు. సోనియాగాంధీని దయ్యం, పిశాచి, బలి దేవత అని అన్న నువ్వా రాజీవ్ గాంధీ మీద ప్రేమ ఒలకబోసేది అని విమర్శించారు. రేవంత్ దొడ్డి దారిన పీసీసీ ప్రెసిడెంట్ అయ్యి ఇవాళ రాజీవ్‌గాంధీ మీద ఒలకబోస్తున్న కపట ప్రేమ అసలు రంగు అందరికీ తెలుసని అన్నారు. నీ ఆలోచనల్లో కుసంస్కారం.. నీ మాటలు అష్ట వికారం అని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి కోసం నిర్ణయించిన స్థలంలో కాంగ్రెస్ నాయకుల విగ్రహాలు ఏంటని అడిగితే కారుకూతలు కూస్తావా అంటూ నిలదీశారు. తెలంగాణకు అక్కరకు రాని వాళ్ల బొమ్మలను తొలగిస్తాం అని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని మళ్లీ చెబుతున్నాం.. రాసి పెట్టుకో అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తెలంగాణ తల్లిని సమున్నతంగా ప్రతిష్టిస్తామని స్పష్టం చేశారు.

**విమర్శించే ముందు ఇవి గుర్తు పెట్టుకోండి**

బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతున్నందుకే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఇచ్చారని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలపైనా కేటీఆర్ మండిపడ్డారు. "ఈడీ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇద్దరూ కూడా 2015 డిసెంబర్‌లో బెయిల్ పొందారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇండియా కూటమిలో ఆమ్ ఆద్మీ పార్టీ చేరింది. ఆ పార్టీ నాయకుడు మనీశ్ సిసోది యా వారం కిందట బెయిల్‌కొచ్చారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా ఓటుకు నోటు కేసులో 2015 నుంచి బెయిల్ మీదే తిరుగుతున్నారు.ఇవన్నీ కూడా కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచే జరిగాయి. కవిత బెయిల్‌పై విమర్శించే ముందు ఈ అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి" అని కేటీఆర్ సూచించారు.

# మర్రి రాజశేఖర్ రెడ్డి కళాశాలలకు నోటీసులు



**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో అక్రమ నిర్మాణాలపై హైడ్రా కొరడా ఝుళిపిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డికి చెదిన ఇంజినీరింగ్ కాలేజీలకు రెవెన్యూ అధికారులు బుధవారం నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశమైంది. దీంతో, కాలేజీలను కూల్చివేస్తారా? అనేది ఆసక్తికరంగా మారింది. తెలంగాణలో అక్రమ నిర్మాణాలపై 'హైడ్రా' దృష్టి పెట్టడంతో పలువురు అక్రమార్కుల గుండెల్లో టెన్షన్ మొదలైంది. ఇప్పటికే పలు అక్రమ నిర్మాణాలను హైడ్రా తొలగించిన విషయం తెలిసిందే. ఇక, తాజాగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలకు రెవెన్యూ అ ధికారులు నోటీసులు ఇవ్వడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వీటితోపాటు దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కాలేజీ సహా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ కాలేజీలకు నోటీసులు అందాయి. చిన్న దామెరచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నిర్మించినందుకు రెవెన్యూ శాఖ అధికారులు నోటీసులు ఇచ్చారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర రెడ్డికి చెందిన అనురాగ్ యూనివర్సిటీకి కూడా రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. అంతేగాక ఇరిగేషన్ అధికారులు కూడా పోలీస్ స్టేషన్లో ఆయనపై కేసు నమోదు చేయించినట్లు తెలిసింది. ఇక, మొత్తం 8 ఎకరాల 24 గుంటల చెరువు ఆక్రమించారని అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఏడు రోజుల్లో నిర్మాణాలు తొలగించాలని.. లేకపోతే మేమే చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు నోటీసుల్లో వెల్లడించారు. 489, 485, 458, 484, 492, 489 సర్వే నెంబర్లలో బిల్డింగ్స్, షెడ్స్, వెహికిల్ పార్కింగ్‌తో పాటు కాలేజీ రోడ్లు వేశారని రెవెన్యూ అధికారులు తెలిపారు. దీంతో, మరోసారి హైడ్రా కూల్చివేతల అంశంలో హాట్ టాపిక్ మారింది. మరోవైపు.. హైకోర్టులో దాఖలైన పిటిషన్‌లో భాగంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరిలోని 13 చెరువుల్లో కబ్జాల వివరాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్లను కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో కలెక్టర్.. రెవెన్యూ అధికారులతో సర్వే చేయించారు. మరోవైపు హైదరాబాద్ నగరంలో చెరువులు, కుంటల ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదులు భారీ సంఖ్యలో వస్తున్నాయి. వాటన్నింటినీ స్వీకరిస్తున్న కార్యాలయ సిబ్బంది అందులోని వివరాలను నమోదు చేసుకుంటున్నారు. పలు అక్రమ నిర్మాణాలపై దృష్టిసారిస్తున్నారు. ఇక, హైడ్రా ఆఫీసుకు ఫిర్యాదుదారుల తాకిడి పెరగడంతో కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు కూడా సెక్యూరిటీని పెంచారు.

**జన్వాడ ఫామ్ హౌస్ వద్ద మరోసారి అధికారుల సర్వే**

రంగారెడ్డి జిల్లా శంకరపల్లి మండలం జన్వాడ గ్రామంలో ఉన్న ఫామ్ హౌస్ వద్ద అధికారులు బుధవారం మరోసారి సర్వే నిర్వహిస్తున్నారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా ఈ సర్వేను చేపట్టారు. మొత్తం ఆరుగురు సభ్యులు బృందం.. నక్ష, డీజీపీఎస్ యంత్రాలతో సర్వే చేస్తున్నారు. అయితే, జన్వాడ ఫామ్ హౌస్ పక్క నుంచి ఫిరంగి నాలా ప్రవహిస్తుంటుంది. కాగా, ఈ నాలాలోనే ఫామ్ హౌస్ ప్రహరీగోడ, గేటు నిర్మించారంటూ ఆరోపణలు ఉన్నాయి. ఈ ఫామ్ హౌస్ ఎఫ్టీఎల్ పరిధిలో ఉందన్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. అధికారులు సర్వే నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న స్థానిక ప్రజలు .. జన్వాడ ఫామ్ హౌస్ పై వస్తున్న ఆరోపణలు నిజమేనా..? అధికారుల సర్వేలో ఏం తేలిందంటూ తెలుసుకునేందుకు తెగ ఆసక్తి చూపిస్తున్నారు.

# రాష్ట్రానికి ప్రయోజనం కలిగించేలా అలైన్‌మెంట్

**విశ్వంభర, హైదరాబాద్:** రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం అలైన్‌మెంట్ తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించే విధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నూతనంగా ఏర్పడనున్న ఫోర్త్ సిటీలో నెలకొల్పనున్న పరిశ్రమలు, వాటిలో పని చేసే అధికారులు, సిబ్బందికి వారి కుటుంబాలకు విద్యా, వైద్య, ఇతర వసతులు అందుబాటులో ఉండేలా అలైన్‌మెంట్ ఉండాలని సూచించారు. జూబ్లీ హిల్స్‌లోని తన నివాసంలో ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం, రేడియల్ రోడ్ల నిర్మాణం, డ్రైపోర్ట్‌ను సీ పోర్ట్‌కు అనుసంధానించే గ్రీన్ ఫీల్డ్ రహదారిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. గత వారం జరిగిన సమీక్షలో ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం అలైన్‌మెంట్‌లో ముఖ్యమంత్రి పలు మార్పులు సూచించారు. దానికి అనుగుణంగా అధికారులు అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పులు చేశారు. అందులో కొన్ని తేడాలు ఉండడంతో మరిన్ని మార్పులను ముఖ్యమంత్రి సూచించారు. ఆ మార్పులకు అనుగుణంగా అలైన్‌మెంట్ మార్చాలని... అది ఫైనల్ అయిపోతే తర్వాత కార్యాచరణ వెంటనే చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

**సానుభూతితో వ్యవహరించండి..**

ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు నిర్మించనున్న రేడియల్ రోడ్ల ప్రగతిపైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. ప్రతిపాదిత రేడియల్ రోడ్ల ప్రాంతంలో ముందుగానే భూ సమీకరణ, భూ సేకరణ చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఏ రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు భూ సేకరణ చేసేటప్పుడు మానవీయ కోణంతో ఆలోచించాలని, భూ నిర్వాసితులతో సానుభూతితో వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. సాధ్యమైనంత ఎక్కువ పరిహారం ఇవ్వడంతో పాటు ప్రభుత్వ పరంగా అదనంగా ఏవిధమైన సహాయం చేయగలమో చూసి అలా చేయాలన్నారు. డ్రైపోర్ట్ నిర్మాణం విషయంలో మచిలీపట్నం, కాకినాడ రేవులను పరిగణనలోకి తీసుకోవాలని, దూరంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏ మార్గానికి సుముఖంగా ఉంది, తెలంగాణ ప్రయోజనాలకు ఏరకంగా మేలు జరుగుతుందనే విషయం ప్రాధాన్యతలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇవన్నీ అధ్యయనం చేశాకే గ్రీన్ ఫీల్డ్ హైవేకు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అంశం సమావేశంలో చర్చకు వచ్చింది. రైలు, జల మార్గంతో కూడిన ఇన్‌ల్యాండ్ వాటర్ వే లకు కేంద్రం ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు తెలపగా.. ఇప్పటి వరకు దేశంలో ఎక్కడైనా అలాంటిది ఉందా...? సక్సెస్ రేట్ ఎలా ఉంది.. ప్రతిపాదనలేనా... వాస్తవ రూపం దాల్చే అవకాశం ఉందా అనే దానిపై అధ్యయనం చేసి సాధ్యమైనంత త్వరగా తనకు నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

ఓఆర్ఆర్ ఆర్ఆర్ఆర్ మధ్య రావిర్యాల నుంచి అమన్‌గల్ వరకు నిర్మించనున్న రహదారిలో మూడు చోట్ల ఉన్న అటవీ ప్రాంతాలను నైట్ సఫారీలుగా మార్చే అంశంపై కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. అంతర్జాతీయ విమానాశ్రయం, నగరం, అటవీ ప్రాంతం సమీపంలోనే ఉండడం అరుదని, ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. బెంగళూర్‌లో జిందాల్ నేచర్ కేర్ పెట్టారని, మనకు ఉన్న అటవీ ప్రాంతం, అనుకూలతలు తెలియజేస్తే అటువంటివి ఎన్నో వస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. ఫోర్త్ సిటీలోని పరిశ్రమలకు అటవీ ప్రాంతాలను అనుసంధానిస్తే అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందంటూ అమెరికాలో యాపిల్ పరిశ్రమ అక్కడ యాపిల్ తోటలోనే ఉన్న అంశాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఈ సందర్భంగా రాచకొండ పరిధిలోని లోయలు... ప్రకృతి సౌందర్యం సినీ పరిశ్రమను ఆకర్షించడానికి ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి వివరించారు.

ఆర్ఆర్ఆర్, రేడియల్ రోడ్లు, ఫోర్త్ సిటీలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూ సమీకరణ, భూ సేకరణ విషయంలో అన్ని శాఖల అధికారులు కలిసి పని చేయాలని, ఫలితాలే లక్ష్యంగా పని తీరు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతి సమీక్షకు ప్రగతి కనపడాలని అలా లేకుంటే కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడనని ముఖ్యమంత్రి హెచ్చరించారు. సమీక్షలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) శ్రీనివాసరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆర్ అండ్ బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఆర్ అండ్ బీ స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందన, పీసీసీఎఫ్ డొబ్రియల్, టీజీఐసీసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యదర్శి షానవాజ్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



రామంతపూర్ ఎస్వీఎం బ్యాంకెట్ హాల్లో బుధవారం ప్రముఖ దినపత్రిక సంపాదకుడు రఘుతిరుపతి కూతురు వివాహానికి హాజరై వధూ-వరులను ఆశీర్వదిస్తున్న వీ3 న్యూస్ ఛానల్, విశ్వంభర దిన పత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ, డైరెక్టర్ కాచం సాయి, న్యాయవాది పవన్‌కుమార్ శర్మ, నరేశ్, నాయక్ తదితరులు

- విశ్వంభర, రామంతపూర్

# ఆకట్టుకుంటున్న సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ ఎక్స్‌పో

**విశ్వంభర, హైదరాబాద్ :** బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 కళింగ కల్చరల్ సెంటర్లో సెప్టెంబర్ 4 వరకు కొనసాగుతున్న సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో చూపరులను ఆకట్టుకుంటుంది. ఈ ఎక్స్‌పో దేశవ్యాప్తంగా ఉన్న నేత కార్మికులు, డిజైనర్లు, చేనేత ఔత్సాహికులను ఒకచోట చేర్చి చేనేత యొక్క గొప్ప సంప్రదాయాలను జరుపుకోవడానికి, మద్దతు ఇవ్వడానికి ఒక ప్రత్యేక వేదికగా నితుస్తోంది. క్లాసిక్ మిసెస్ ఇండియా రత్న మెహెరా, టాలీవుడ్ అప్‌కమింగ్ నటి సహృదా ఫ్రూటీతో పాటు నిర్వాహకులు సోమ్‌నాథ్ బౌమిక్, అభిజిత్ షాతో కలిసి ఎక్స్‌పోను ప్రారంభించారు. ఈ సందర్భంగా మిసెస్ ఇండియా రత్న మెహెరా మాట్లాడుతూ.. హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో భాగస్వామి అవగం ఆనందంగా ఉందన్నారు. కళాత్మకత, నైపుణ్యం కలిగిన కళాకారులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. తరతరాలుగా ఈ పురాతన పద్ధతులను భద్రపరిచిన మన హస్తకళాకారుల శాశ్వత వారసత్వానికి ఇది నిదర్శనం అన్నారు. సహ్రుదా ఫ్రూటీ మాట్లాడుతూ.. చేనేత నేయడం కేవలం క్రాఫ్ట్ కంటే ఎక్కువని, ఇది మన సంస్కృతి, మన చరిత్రను చెప్పే జీవన సంప్రదాయం అన్నారు. అనంతరం నిర్వాహకులు సోమ్‌నాథ్, అభిజిత్ మాట్లాడారు. బెంగాల్ హ్యాండ్లూమ్ ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించే సిల్క్ ఆఫ్ ఇండియా, శతాబ్దాలుగా చేనేత సంప్రదాయాన్ని సజీవంగా ఉంచిన కళాకారులకు సాధికారత కల్పించాలనే దాని నిబద్ధత అని, ఈ ఎక్స్‌పోలో సాంప్రదాయ పద్ధతులను ఉపయోగించి నైపుణ్యం కలిగిన నేత కార్మికులు రూపొందించిన చీరలు, స్కార్ఫ్‌లు, బట్టలు, గృహ వస్త్రాలు, మరిన్నింటితో సహా అనేక రకాల చేనేత ఉత్పత్తులను అన్వేషించినట్లు తెలిపారు. సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్‌లూమ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం ప్రతిభావంతులైన నేత కార్మికులను ప్రోత్సహించడానికి ఉద్దేశించబడిందని తెలిపారు. ఈ ఎక్స్‌పోలో బనారసి చీర, భాగల్‌పురి సిల్క్, బెంగుళూరు సిల్క్, చెన్నై సిల్క్, మైసూర్ సిల్క్, ధర్మవరం, పోచంపల్లి, జమ్దానీ, లెనిన్ కాటన్, టస్సార్, విష్ణుపురి సిల్క్, డ్రెస్ మెటీరియల్, చందేరి మొదలైనవి ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు.



# బడ్జెట్‌లో రైతు సంక్షేమానికి పెద్ద పీట వేశాం

- యూపీ వ్యవసాయ శాఖ మంత్రి సూర్య ప్రతాప్‌తో మంత్రి తుమ్మల
- వ్యవసాయ పరిస్థితులపై చర్చించిన ఉభయ రాష్ట్రాల మంత్రులు
- యూపీకి రావాలని తుమ్మలకు మంత్రి ఆహ్వానం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్లో ఈసారి రైతు సంక్షేమానికి పెద్దపీట వేశామని, సింహభాగం కేటాయింపులు ఆ శాఖకే జరిపామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఉత్తరప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సూర్యప్రతాప్ షాహినిని మంత్రి తుమ్మల నాగే.శ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులపై ఇరు రాష్ట్రాల మంత్రులు చర్చించుకున్నారు. తెలంగాణలో రైతుల సంక్షేమం కోసం తీసుకొంటున్న చర్యలను మంత్రి తుమ్మల యూపీ మంత్రికి వివరించారు.రైతు రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు కేటాయించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని వివరించారు .

అంతేకాకుండా తమ ప్రభుత్వం ప్రైవేట్, పబ్లిక్ రంగంలో విత్తనోత్పత్తి సంస్థలను భారీగా ప్రోత్సహిస్తోందని, తద్వారా రైతుల నికర ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అలాగే రాష్ట్రంలో భారీ ఎత్తున ఆయిల్ పామ్ ను ప్రోత్సహిస్తున్నామని, త్వరలో ఆయిల్ పామ్ ను ఉత్పత్తి చేసే రాష్ట్రాలలో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటిస్థానంలో నిలబెడుతామని మంత్రి తుమ్మల వివరించారు.

**తెలంగాణలో రైతు సంక్షేమం భేష్**
**యూపీ వ్యవసాయ శాఖ మంత్రి**

ఉత్తరప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి సూర్యప్రతాప్ షాహిని మాట్లాడుతూ తెలంగాణ వ్యవసాయరంగంలో, రైతుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలను అభినందించారు. తమ రాష్ట్రంలో వ్యవసాయ పరంగా 9 జోన్లు ఉన్నాయన్నారు. చెరకు పంటలో యాంత్రికరణ తీసుకురావడం, చక్కెర కర్మాగారాలను భారీ ఎత్తున ఆధునికీకరించడం ద్వారా రైతుల నికర ఆదాయాన్ని పెంచామన్నారు. కానీ చెరకు సాగులో తమ ప్రభుత్వానికి నీటి నిర్వహణ ఖర్చు ఎక్కువ కావటం విద్యుత్ ను అధిక మొత్తంలో వినియోగించటం చేత పంట మార్పిడి దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అదే విధంగా ఉత్తర ప్రదేశ్ లో తమ రైతులు వాడే వరి విత్తనాలు ఎక్కువ శాతం తెలంగాణ రాష్ట్రం నుంచే వస్తాయని తెలియచేశారు. అందుకని తమ పర్యటనలో భాగంగా విత్తన కంపెనీ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మలను తమ రాష్ట్రానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందర్, కమిషనర్ గోపి, ఉత్తరప్రదేశ్ సీఎం సలహాదారు అవనీష్ కే అవస్తి, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రవీందర్ పాల్గొన్నారు.

# తెలంగాణలో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ ప్రకటించింది. తూర్పుమధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఈ ప్రభావంతో ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 2 వరకు తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని బుధవారం ప్రకటించింది. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 30న మోస్తరు నుంచి అత్యంత భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. కొమురంభీం, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో కూడా భారీ వర్షాలు పడతాయని స్పష్టం చేసింది. 31న కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హనుమకొండ, సిద్దిపేట జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని చెప్పింది. సెప్టెంబర్ 1న ఆదిలాబాద్, కొమురంభీం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో వర్షాలు పడతాయన్నారు. 2న రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.










# ప్రమాదంలో తెలుగు భాష మనుగడ

*అమృత నిష్యందివల్లకీహ్లాదమునకు*
*రాగిణీ దివ్య సమ్మోద రాగమునకు*
*తేనె తేటల నవకంపు సోనలకును*
*సాటియగును మా తెలుగు భాషామ తల్లి*

**-సురవరం ప్రతాప రెడ్డి**

## మాతృభాష పరిరక్షణకు ప్రభుత్వం పౌరసమాజం కృషి చేయాలి

సుమారు రెండు వేల యేండ్లకు పూర్వమే మూల ద్రావిడ భాషనుండి క్రమేణా స్వతంత్ర భాషగా ఎదిగి విలసిల్లుతున్న ప్రాచీన భాష తెలుగు. త్రిలింగ దేశంలో(శ్రీశైలం, ద్రాక్షారామం, కాళేశ్వరం మధ్య ప్రాంతం) మాట్లాడే భాష తెలుగు. అనాదిగా రాజ సన్మానాలందుకొన్న భాష. విదేశీయులచే ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని కీర్తించబడిన భాష. సుందర తెలుంగు అని తమిళ సోదరులతో కొనియాడ బడిన భాష. ఎంతో ఘన చరిత్ర గలిగిన మన భాష ఇప్పుడు అంపశయ్య పై ఉందనే కొందరు భాషాభిమానుల ఆందోళనలో కొంతైనా నిజం లేకపోలేదు. ఈ నేపథ్యంలో భాషల ఉనికి, వికాసం, భాషాభివృద్ధిలో సమాజం,పాలకుల పాత్రలను పునరావలోకనం చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

భాష భావ వాహకం. భావ గ్రహణానికి, భావ వ్యక్తీకరణకు మానవుడు ఏర్పరచుకొన్న వాగ్రూప సంకేతాలే భాష. ఈ సంకేతాలు ప్రాంతాల దూరం పెరిగిన కొద్దీ మారినవి. వేరు వేరు భాషలుగా ఎదిగినాయి. ఇది భాష పుట్టుక నేపథ్యం. నేడు శాస్త్ర సాంకేతికత పెరిగింది. ప్రపంచమే కుగ్రామమైంది. ఈతరుణంలో ప్రపంచంలోని అనేక భాషలు ఒక కుదుపుకు లోనైనాయని చెప్పవచ్చు. ఒక భాష ప్రభావం మరొక భాషపై పడింది. దీని వలన కొంత మేలుతో పాటు కీడు కూడా జరిగిందని చెప్పక తప్పదు. ఆ క్రమంలో తెలుగు భాషకు ఒన గూరిన ప్రయోజనము, నష్టమూ సమీక్షించుకోవాలి. తెలుగు పై ఆంగ్ల భాష ప్రభావం వలన అనేక నూతన ప్రక్రియలు పురుడు పోసుకున్నాయి. కథ, నవల, ప్రహసనం, నాటిక ఇత్యాది ప్రక్రియలు పాశ్చాత్య భాషల ప్రభావంతోనే వేళ్లూనుకున్నాయి. అరబీ, ఫారసీ భాషల ప్రభావ ఫలితంగా గజల్, రుబాయి వంటి ప్రక్రియలు రూపుదిద్దుకున్నాయి. విదేశీ సాహిత్యం తెలుగులో అనేక సాహిత్య ఉద్యమాలకు కేంద్ర బిందువైంది. పాశ్చాత్య భాషల ప్రభావ ఫలితంగా తెలుగులో ప్రాచీన ప్రక్రియలైన పద్యం, ప్రబంధం, వంటి ప్రక్రియలు కొంత నిరాదరణకు గురైనాయి. ఆంగ్ల ప్రభావ ఫలితంగా నేడు.తెలుగు భాషకు ఎదురవుతున్న పెను సవాల్ ఏమిటంటే నేటి తరం పిల్లలు కనీసం ప్రాథమిక స్థాయి వరకైనా తెలుగు భాషను అభ్యసించడం లేదు. ఒక వేళ ఒక సబ్జెక్టుగా చదివినా మొక్కుబడి తంతుగా కొన సాగుతుంది. ఈపరిస్థితి ఇలాగే కొనసాగితే ఇంకో రెండు మూడు దశాబ్దాల అనంతరం తెలుగు భాష అంపశయ్య పై నిలువడం ఖాయం.



నేడు అనేక భాషలుఅంతర్థానమయ్యే స్థితిలో వున్నాయి. ఆంగ్లభాష పదఘట్టనలో ఇప్పటికే బక్కచిక్కిన మాతృభాషలెన్నో నలిగి కనుమరుగైపోయాయని ఇటీవలి యునెస్కో సర్వే తేల్చింది. ప్రపంచంలో సుమారు 230 భాషలు అంతరించాయి. ఇంకా 3 వేల భాషలు అంతరించే దశలో ఉన్నాయని యునెస్కో వెల్లడించింది. ఈ భాషల జాబితాలో తెలుగు భాష ఉందని యునెస్కో ప్రకటించింది. ఒక భాషను మాట్లాడే జనాభాలో ముప్పై శాతం మంది ఆ భాషను చదవకుండా, తల్లి భాషకు దూరమైతే ఆ భాష కాలక్రమంలో మృతభాషగా మారుతుందని యునెస్కో సూత్రీకరించి, తెలుగుకు ఆ పరిస్థితి రాబోతుందని ప్రకటించింది. ఇది తెలుగు భాషాభిమానులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నది.

ప్రపంచవ్యాప్తంగా ప్రతి రెండు వారాలకు ఒక భాష కనుమరుగవుతున్నదనడం కలవరపాటు కలిగిస్తుంది. భారత్‌లో నలభైకి పైగా భాషలు, మాండలికాలు అదే ప్రమాదాన్ని ఎదుర్కోబోతున్నాయి. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన గదబ, నైకీ అనే గిరిజనతెగల భాషలున్నాయి. పదివేల మంది కంటే తక్కువగా మాట్లాడే భాషలు క్రమంగా కాలగర్భంలో కలిసి పోతాయని పరిశోధకులు చెబుతున్నారు.

మనదేశంలో 780 భాషలకు పైగా ఉనికిలో ఉండగా, గత 50 ఏళ్లలోనే అనేక భాషలు కనబడకుండా పోయాయి. దీనిని బట్టి భారతీయ భాషలు ఎంత వేగంగా అంతరించే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయన్నది స్పష్టమవుతోంది.

జనగణన డైరెక్టరేట్ నివేదిక ప్రకారం.. మనదేశంలో 22 షెడ్యూల్డ్ భాషలతో పాటు, లక్షకు పైగా మంది మాట్లాడే వంద నాన్–షెడ్యూల్డ్ భాషలున్నాయి. అయితే యునెస్కో రూపొందించిన కనుమరుగయ్యే ప్రమాదమున్న భాషలు, మాండలికాల జాబితాలో 40 భారతీయ భాషలున్నాయి. ఈ భాషలను పదివేల మంది కంటే తక్కువ మాట్లాడుతున్నారు. అందువల్ల ఈ భాషలు అంతరించే ప్రమాదముందని భాషావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మనుగడ కోసం పరభాషలను నేర్చుకోవడంలో తప్పులేదు. అయితే వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాలి. మాతృభాషను పరిరక్షించుకోవాలి. ఈ కర్తవ్యాన్ని గుర్తుచేసేందుకే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఏటా ఫిబ్రవరి 21న నిర్వహిస్తున్న విషయం విదితమే.

ప్రపంచ భాషలలో 16వ స్థానం, భారత దేశంలో 3వ స్థానంలో ఉన్న తెలుగును కాపాడుకోవడం ప్రతి తెలుగువాడి బాధ్యత. దీనికి ప్రభుత్వాలూ కొంత మేర కృషి సల్పినాయని చెప్పవచ్చు. తెలుగు అకాడమీ , అధికార భాషా సంఘం , తెలుగు విశ్వ విద్యాలయం, సాహిత్య అకాడమీ, ఆంధ్ర సారస్వత పరిషత్ తదితర సంస్థల ద్వారా తెలుగు పరిరక్షణకై కొంత కృషి జరిగింది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో నాలుగు, తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తరువాత ఒక ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించారు. ఇంకాజరగ వలసిన కృషి ఎంతో ఉంది.

తెలుగు భాష మనుగడకు నేడు ప్రమాదం ఏర్పడింది. అందువల్ల భాష పరిరక్షణకు ప్రభుత్వంతోపాటు పౌరసమాజం కూడా కృషి చేయాల్సిన అవసరముంది. భాష అంతరిస్తే దానితోపాటు సంస్కృతి, విలువలు, విజ్ఞానం కనుమరుగవుతాయి. ఆంగ్లభాషపై మోజుతో మాతృభాషలను నిర్లక్ష్యం చేయవద్దు. పది వేల కంటే తక్కువ మంది మాట్లాడే భారతీయ భాషలపై దృష్టి కేంద్రీకరించి వాటి పురాతన గ్రంథాలను డిజిటలైజ్ చేయాలి.పెరుగుతున్న శాస్త్ర సాంకేతికతను భాషాభివృద్ధికి వినియోగించాలి. భాషల పరిరక్షణకు ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకోవడమే కాదు వాటి అమలుకు కృషి జరగాలి.

విధిగా అన్ని యాజమాన్య పాఠశాలలో ప్రాథమిక విద్య తెలుగులోనే కొనసాగేటట్టు చట్టం చేయాలి. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఒక తెలుగు భాషోపాధ్యాయుడిని నియమించాలి. ఇంజనీరింగ్ ,మెడిసిన్ తదితర వృత్తి విద్యాకోర్సులను కూడా తెలుగులో అధ్యయనం చేసేలా ఆయా సిలబస్ తెలుగులోనికి అనువాదం జరగాలి. సంబంధిత పారిభాషికా పదజాలం తెలుగులో అభివృద్ధి పరచాలి. విద్యార్థులలో మాతృభాషపై మమకారం పెంచేలా, వారిలోని సృజనను వెలికి తీసేలా పాఠశాల స్థాయిలో నిపుణులతో కార్యశాలలు నిర్వహించాలి. మరీ ముఖ్యంగా మాతృభాషలో అభ్యసించిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలి.అంతే గాని ఆచరణ లేని హామీల వల్ల తెలుగు పరిఢవిల్లుతుందనుకోవడం అత్యాశే అవుతుంది.



**-సాగర్ల సత్తయ్య**
**7989117415**

# భారత హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్

## నేడు ఆయన జయంతి

ధ్యాన్ చంద్ సాటిలేని భారతీయ హాకీ ఆటగాడు. హాకీ క్రీడలో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో ఒకడు. గోల్స్ చేయడంలో అద్భుత ప్రతిభ కనబరిచేవారు. హాకీలో భారత్‌కు చారిత్రాత్మక విజయాలు అందిం చడంతో పాటు, ఎన్నో అరుదైన ఘనతలు సొంతం చేసుకున్నారు. భారత్ అసలు సిసలు క్రీడా దిగ్గజంగా ధ్యాన్ చంద్‌కు పేరుంది. భారత దేశానికి హాకీలో స్వర్ణ యుగంగా పరిగణించదగిన 1928, 1932, 1936 ఒలంపిక్ క్రీడల్లో వరుసగా బంగారు పతకాలు సాధించి పెట్టారు. క్రీడారంగంలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన వారికి ఖేల్ రత్న అవార్డు ఇస్తారని చాలా మందికి తెలుసు. ఈ ఖేల్ రత్న అవార్డు నిన్నటి దాకా రాజీవ్ ఖేల్ రత్నగా పిలవబడగా.. ధ్యాన్ చంద్ సేవలకు, దేశ భక్తికి గుర్తింపుగా దాని పేరు ధ్యాన్ చంద్ ఖేల్ రత్నగా కేంద్ర ప్రభుత్వం ఇటీవలే మార్చింది.హాకీ దిగ్గజం ధ్యాన్ చంద్ పుట్టిన రోజునే దేశంలో జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపు కుంటున్నారు. దేశానికి మూడు ఒలంపిక్స్ పతకాలు అందించిన ధ్యాన్ చంద్ గురించి నేటి తరానికి పెద్దగా తెలియక పోవచ్చు.

హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి 1905 ఆగస్టు 29న ధ్యాన్‌చంద్ జన్మించారు. మెరుపు వేగంతో గేల్స్ చేయగల మాంత్రికుడిగా ఆయన క్రీడా చరిత్రలో సుస్థిర స్థానం సాధించారు. మైదానంలో పాదరసంలా కదిలిపోతూ బంతిని పూర్తిగా తన నియంత్రణలో ఉంచుకోవడంలో ఆయనకు ఎవరూ సాటిరారు. హాకీలో భారత్‌కు చారిత్రాత్మక విజయాలు అందించడంతో పాటు,ఎన్నో అరుదైన ఘనతలు సొంతం చేసుకున్నారు. భారత్ అసలు సిసలు క్రీడా దిగ్గజంగా ధ్యాన్ చంద్‌కు పేరుంది. 29 ఆగస్ట్ 1922న తన 17వ పుట్టినరోజున చంద్ బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో సిపాయిగా చేరాడు. ధ్యాన్‌చంద్ నేతృత్వంలో భారత పురుషుల హాకీ జట్టు మూడు సార్లు ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్ పతకాలు సాధించింది. 1928 ఆమ్‌స్టర్ డామ్,1932 లాస్ ఏంజిలెస్,1936 బెర్లిన్ ఒలింపిక్ గేమ్స్‌లో భారత్‌కు బంగారు పతకాలు అందించిన ఘనత ధ్యాన్‌చంద్‌కే దక్కింది. చంద్రుడి వెలుతురు లోనూ ఆయన ప్రాక్టీస్ చేసేవారు. అందుకే ఆయన్ను ముద్దుగా చంద్‌గా పిలిచేవారు. 1936నాటి ఒలంపిక్స్ సందర్భంగా బెర్లిన్‌లో పెద్ద ఎత్తున ధ్యాన్ చంద్ పోస్టర్లు వెలిశాయి. ధ్యాన్ చంద్ ఆట చూసేందుకు స్టేడియంకు రావాలంటూ ఆయన ఫ్యాన్స్ ఈ పోస్టర్లు ఏర్పాటు చేశారు. ఆ ఒలంపిక్స్ హాకీ ఫైనల్ మ్యాచ్ లో భారత్ జర్మనీతో తలపడింది. ఆ ఫైనల్ మ్యాచ్ లో భారత్ 16-1 తేడాతో జర్మనీని మట్టి కరిపించింది. భారత్ పక్షాన ధ్యాన్ చంద్ 15 గోల్స్ చేసి చరిత్ర సృష్టించాడు. ఫైనల్స్‌లో ద్వితీయార్థంలో ధ్యాన్ చంద్..తన షూ, సాక్స్‌ను తీసేసి మ్యాచ్ ఆడారు. అయినా మూడు గోల్స్ సాధించి ఔరా అనిపించే ఆట ప్రదర్శించారు. ఆ సమయంలో స్టేడియంలో దాదాపుగా 25 వేల మంది ప్రేక్షకులతో పాటు గొప్ప నియంతగా పేరొందిన ఎడల్ఫ్ హిట్లర్ కూడా ఆ మ్యాచ్ ని తిలకించాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం ధ్యాన్ చంద్ వద్దకి వచ్చిన హిట్లర్ తన సహచరులతో "అతడి హాకీ స్టిక్ విరగ్గొట్టి చూడండి.. అందులో తప్పకుండా ఏదో అయస్కాంతం ఉండి ఉంటుంది లేకపోతే ఇలా ఎలా ఆడతాడు" అని హాకీ స్టిక్ విరగ కొట్టగా ఎలాంటి అయస్కాంతమూ దొరకలేదు. దాంతో కంగుతిన్న హిట్లర్ అదేరోజు రాత్రి ధ్యాన్ చంద్ ని తన వద్దకు పిలిపించుకొని హాకీ ఆట కాకుండా నువ్వు ఏమేమి చేస్తావని ధ్యాన్ చంద్ ని అడగగా "నేను ఆర్మీలో సుబేదార్ గా పని చేస్తున్నానని సమాధానం ఇచ్చాడు. హిట్లర్ "ధ్యాన్ చంద్, నీ దేశము నీకేమిచ్చింది..? ఈరోజుకు నువ్వు కేవలం సుబేదార్ వి. జర్మనీ హాకీ జట్టు తరపున ఆడితే తక్షణమే నిన్ను ఎయిర్ ఫీల్డ్ మార్షల్ గా నియమిస్తానని చెపుతుండగా... తమరు ఎన్ని పదవులు ఇచ్చినా, ఎంత డబ్బు ఇచ్చిన నేను నా దేశానికి మాత్రమే ఆడుతాను. పరాయి దేశాలకోసం ఆడను.." అని తెగేసి చెప్పగానే హిట్లర్ నిర్ఘాంతపోయి తలదించు కున్నట్లు చెపుతారు. ఒకసారి తను గోల్ వేసిన తరువాత అది పడకపోతే తను గోల్ వేసిన విధానం చూసి గోల్పోస్ట్ కొలతలు సరిచూడ వలసిందిగా అంపైర్ ను కోరగా అది సరియైన గుర్తింపుగా అందరి మన్ననలు పొందారు.

ఓ మ్యాచ్ సందర్భంగా ధ్యాన్ చంద్ ప్రత్యర్థులపై ఒక్క గోల్ కూడా చేయలేక పోయారు. గోల్ పోస్ట్ విషయంలో రిఫరీకి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత పరిశీలనలో గోల్ పోస్ట్ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా లేనట్లు రుజువు అయింది. 1926 నుండి ఆయన 185 మ్యాచ్ ల్లో 570 గోల్స్ చేసి 1949 వరకు అంతర్జా తీయంగా ఆడారు. 2002లో ఢిల్లీలోని నేషనల్ స్టేడియంకు ధ్యాన్ చంద్ నేషనల్ స్టేడియంగా నామకరణం చేశారు. అలాగే అలిఘడ్ ముస్లిం యూని వర్సిటీలోని ఓ హాస్టల్‌కు ఆయన పేరు పెట్టారు. లండన్‌లోని ఇండియన్ జింకానా క్లబ్‌కు ధ్యాన్ చంద్ పేరు పెట్టారు. ధ్యాన్ చంద్ పేరిట పోస్టల్ స్టాంప్ విడుదల చేసి భారత ప్రభుత్వం గౌరవించింది. ఇప్పటి వరకు ఆ గౌరవాన్ని పొందిన ఏకైక భారత హాకీ క్రీడాకారుడు ఆయనే. 34 సంవత్సరాల సేవ తర్వాత, ఆయన 29 ఆగస్టు 1956న భారత సైన్యం నుండి లెఫ్టినెంట్ (యాక్టింగ్ కెప్టెన్ ) గా పదవీ విరమణ చేశారు . భారత ప్రభుత్వం అదే సంవత్సరం ధ్యాన్ చంద్ కు భారతదేశ మూడవ అత్యున్నత పౌర పురస్కారమైన పద్మ భూషణ్‌తో సత్కరించింది. 1979, డిసెంబరు 3 న కన్నుమూశారు.

## వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

**విశ్వంభర ఎడిటోరియల్ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. ఈ కింది చిరునామాకు పోస్టులో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించగలరు. మీ వ్యాసం 1000 పదాలకు మించకుండా ఉండాలి. తెలుగు యునీకోడ్‌లో టైప్ చేసి పంపిన వాటికి ప్రాధాన్యం ఉంటుంది. రచయితలు విశ్వంభరకు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జత చేయాలి.**

**చిరునామా:**
V3 న్యూస్, విశ్వంభర తెలుగు దినప్రతిక కార్యాలయం, ప్లాట్ నంబర్ 204, రెండో అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నంబర్ 1560 ఎదురుగా, చైతన్యపురి ఎక్స్ రోడ్డు, హైదరాబాద్-500060

ఈ-మెయిల్: editpagevishwambhara@gmail.com
ఇతర వివరాలకు సెల్ నం: 9441222429 సంప్రదించగలరు.

# వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి



**తెలుగు వ్యావహారిక భాషకు పితామహుడిగా, అభినవ వాగను శాసనునిగా పేరెన్నిక గన్న గిడుగు రామమూర్తి పంతులు జన్మదినమైన ఆగస్టు 29 ను 'తెలుగు భాషా దినోత్సవము'గా తెలుగు రాష్ట్రాలు పరిగణిస్తున్నాయి. గిడుగు వెంకట రామ్మూర్తి (1863-1940) తెలుగు ప్రజలు స్మరించదగ్గ ప్రథమ స్మరణీయుడు గిడుగు రామమూర్తి. ఆధునిక విజ్ఞాన వ్యాప్తికి, వచన రచనకు కావ్యభాష పనికి రాదనీ, సామాన్య జనానికి అర్థమయ్యే సమకాలీన "శిష్టవ్యావహారికం"లో ఉండాలనీ ఆనాటి సాంప్రదాయిక పండితులతో హోరాహోరీగా యుద్ధంచేసి ఆధునిక ప్రమాణ భాషను ప్రతిష్టించటానికి మార్గదర్శకుడైన వాడు గిడుగు రామమూర్తి. గిడుగు వారి వ్యవహారిక భాషోద్యమం వల్ల ఆధునిక సాహిత్యం కొత్త సొగసులు సంతరించుకుంది. రచనావైవిధ్యం, వైశిష్ట్యంతో పుష్టి చేకూరింది. విశ్వ విద్యాలయాలలో వాడుకభాష రాజ్య మేలుతోంది. పత్రికలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. అక్షరాస్యత పెరిగింది. తెలుగు అధికార భాషగా, పరిపాలనా భాషగా కీర్తికెక్కింది. దీనికంతటికీ గిడుగు పిడుగే మూలకారకుడు.**

గ్రాంథికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారం లోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియ జెప్పిన మహనీయుడు. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూల పురుషుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది. శిష్టజన వ్యవహారిక భాషను గ్రంథరచనకు స్వీకరింప జేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చ తెలుగు చిచ్చర పిడుగు గిడుగు. గిడుగు ఉద్యమంవల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారిక భాషలో సాగి, అందరికీ అందుబాటు లోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి, సృజనాత్మకశక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైంది. తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని గిడుగు రామమూర్తి. ఈ వాడుక భాషా వాదాన్ని చేపట్టినందుకు గిడుగువారు పండితులతో యుద్ధం చేయవలసి వచ్చింది. దీన్ని గ్రామ్య వాదమనీ, గిడుగు వారు గ్రామాచార్యులనీ గ్రాంధికవాదులు హేళన చేస్తూ పద్యాలూ, వ్యాసాలు రాశారు. జయంతి రామయ్య పంతులు, కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి, వేదం వెంకటరామ శాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి మొదలైన వాళ్ళతో ఢీకొనవలసి వచ్చింది. ఆంధ్రసాహిత్య పరిషత్తు గ్రాంధిక భాషావాదానికి అండగ నిలిచింది. గిడుగువారు 'తెలుగు' పత్రిక ద్వారా గ్రాంధిక వాదాన్ని ఖండిస్తూ వ్యావహారిక వాదాన్ని బల పరిచారు. పండితులే తప్పులు లేకుండా రాయలేని గ్రాంధికం బలవంతాన రుద్దడం ఎందుకంటూ "ఆంధ్ర పండిత బిషక్కుల భాషా భేషజం" అనే పుస్తకం ప్రచురించారు. తెలుగు సాహిత్యంపై పండితుల గుత్తాధి కారాన్ని పోగొట్టాడు. ప్రజలలో ఒక్కరు కూడా నిరక్షరాస్యులు కాకూడదని, అందుకు వాడుక భాష సాధనం కానీ... గ్రాంధికమని తమకే రాని, తమకే తెలియని, భాషను పిల్లలు ఉపయోగించాలనీ అందులోనే పుస్తకాలు రాయాలనీ, దానిలోనే పాఠ్య పుస్తకాలుండాలని శాసించడం అవివేకమని ఉద్యమించారు. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి, తాతా సుబ్బరాయుడు శాస్త్రి వంటి ఉద్దండ పండితులే ఆయన వాదంలోని సబబు గుర్తించారు. బల పరచారు. కుండలాల, శాలువాల పండితుల సాహిత్యాధికారం, అసంబద్ధమైన వ్యాకరణ, ఛందశ్శాస్త్ర దండనాధికారం చెల్లదన్నాడు.

సాహిత్య ఫ్యూడల్ సంప్రదాయాన్ని ధిక్కరించి, నిరాకరించి నిర్మూలించి ప్రజాస్వామ్య పద్ధతిని తెలుగు సాహిత్యంలో ప్రతిష్ఠించాడు. తప్పు ఒప్పులు నిర్ణయించే అధికారం ఎవరికీ లేదన్నాడాయన. భాషకైనా, మనిషికైనా మార్పు కూర్పు చేర్పు సహజమని బోధించాడు, నచ్చచెప్పాడు.

**చారిత్రాత్మక మార్పుకు కారణమైన వ్యావహారిక భాషోద్యమం..**

వ్యావహారిక భాషోద్యమం తెలుగు భాషలో వచ్చిన చారిత్రాత్మకమైన మార్పుకు ప్రధాన కారణం గిడుగు రామమూర్తి సారధ్యంలో నడిచిన వ్యావహారిక భాష ఉద్యమం లేదా వ్యావహారిక భాషోద్యమం. ఇది 20వ శతాబ్దపు పూర్వార్ధంలో ప్రాచీనమైన గ్రాంథిక భాషకు మరియు వ్యావహారిక లేదా వాడుక భాషకు మధ్య జరిగిన భాషా ఉద్యమం. పూర్వం తెలుగులో పాఠ్యాంశాలు అన్నీ గ్రాంధిక బాషలోనే ఉండేవి. 1907లో ఉత్తర కోస్తా జిల్లాలకు పాఠశాలాల ఇన్స్పెక్టర్‌గా వచ్చిన జె.ఎ.యేట్స్ అనే బ్రిటీష్ అధికారి ప్రజలు వ్యవహరించే భాష, పుస్తకాల భాష మధ్య ఉన్న తేడాలు చూసి ఆవేదన చెందారు. ఆయన అదే విషయాన్ని గిడుగుతో చర్చించారు. ఆ విధంగా గిడుగు జీవిత ఉత్తరార్ధంలో ఈ విషయాన్ని గురించి గాఢంగా ఆలోచించి తెలుగు విద్యా విధానంలో అన్యాయం జరుగుతున్నదని గుర్తించాడు. గురజాడ, గిడుగులు, శ్రీనివాస అయ్యంగారు, యేట్సు — ఈ నలుగురి ఆలోచనల వల్ల వ్యావహారిక భాషోద్యమం ఆరంభమైంది. 1919-20ల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కొరకు 'తెలుగు' అనే మాసపత్రిక నడిపాడు. వ్యవహారిక భాషను ప్రతిఘటించిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభలో (1925, తణుకులో) నాలుగు గంటలపాటు ప్రసంగించి గ్రంథాల్లోని ప్రయోగాల్ని ఎత్తి చూపి తన వాదానికి అనుకూలంగా సమితిని తీర్మానింప జేసాడు "గిడుగు". సాహితీ సమితి, నవ్య సాహిత్య పరిషత్తు మొదలైన సంస్థలు కూడా గిడుగు వాదాన్ని బలపరచాయి. స్కూలు కాలేజీ పుస్తకాల్లో గ్రాంథికభాషే పాతుకు పోయింది; కొన్నిటిలో వీరేశలింగంగారు ప్రతిపాదించిన సరళ గ్రాంథికం కూడా వచ్చింది. గిడుగు రామమూర్తి ఊరూరా ఉపన్యాసలిస్తూ గ్రాంథికంలో ఏ రచయితా నిర్దిష్టంగా రాయలేదని నిరూపించాడు. 1919లో గిడుగు "తెలుగు" అనే మాసపత్రికను స్థాపించి తన శాస్త్రీయ వ్యాసాలతో, ఉపన్యాస పాఠాలతో అవిశ్రాంతంగా పోరాటం సాగించాడు. కాని ఆ పత్రిక ఒక ఏడాది మాత్రమే నడిచింది. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, తల్లావఝ్ఝల శివశంకరశాస్త్రి, కందుకూరి వీరేశలింగం, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, వఝ్ఝల చిన సీతారామశాస్త్రి మొదలైన కవులు, పండితులు వ్యావహారిక భాషావాదం వైపు మొగ్గు చూపారు. 1919 ఫిబ్రవరి 28న రాజమహేంద్ర వరంలో కందుకూరి వీరేశలింగం అధ్యక్షులుగా, గిడుగు కార్యదర్శిగా "వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం" స్థాపించారు.

1924లో కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు ఆధికారికంగా వ్యావహారిక భాషా నిషేధాన్ని ఎత్తివేసింది. 1933లో గిడుగు రామమూర్తి సప్తతి మహోత్సవం ఆయన అభిమానులు, శిష్యులు రాజమహేంద్ర వరంలో బ్రహ్మాండంగా జరిపారు. తెలికచెర్ల వెంకటరత్నం సంపాదకుడుగా ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన 46 పరిశోధక వ్యాసాలతో వ్యాస సంగ్రహం అనే ఉద్గ్రంథాన్ని ఆయనకు సమర్పించారు. 1936 లో నవ్యసాహిత్య పరిషత్తు అనే సంస్థను ఆధునికులు స్థాపించి సృజనాత్మక రచనల్లో శిష్ట వ్యావహారికాన్ని ప్రోత్సహించే "ప్రతిభ" అనే సాహిత్యపత్రికను ప్రచురించారు. 1937లో తాపీ ధర్మారావు సంపాదకులుగా "జనవాణి" అనే పత్రిక కేవలం ఆధునిక ప్రమాణ భాషలోనే వార్తలు, సంపాదకీయాలు రాయటం మొదలు పెట్టింది.

వాడుక భాష గ్రామ్యభాష కాదు. సజీవ భాష. తెలుగు భాష మారుతోంది. కాబట్టి కొత్త వ్యాకరణాలు, సవరణలు వెలువడ్డాయి. నన్నయ భాషకి, తిక్కన భాషకి, ప్రబంధ బాషకి, దక్షిణాంధ్ర యుగం నాటి భాషకి చాలా భేదాలున్నాయి. వ్యావహారిక భాషావాదం ప్రాచీన సాహిత్యానికి వ్యతిరేకంగా ఏర్పడలేదు. ప్రాచీన కావ్యాలను, వ్యాకరణాలను గౌరవిస్తూనే వాడుక భాషకి ప్రాచుర్యం కల్పించాలి.

వాడుక భాషలో కూడా ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించవచ్చును. ఉదాహరణ: గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం. గ్రాంథిక భాష పండితులకే అర్థం కాదు. గొప్ప పండితులు కూడా తప్పులు లేకుండా రాయలేరు. మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక రంగాలలో విజ్ఞానం పెంపొందించు కోవాలంటే పాఠ్య గ్రంథాలు వాడుక భాషలోనే ఉండాలి. వాడుక భాష ప్రజల భాష. గ్రాంథిక భాష పండితుల భాష. ఆ రోజుల్లోనే అతనికి దగ్గర అడవుల్లో ఉండే సవరల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగి, తెలుగు, సవర భాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని చాలా ఏళ్ళు సవర భాష నేర్చుకున్నాడు. సవర భాషలో పుస్తకాలు రాసి సొంతడబ్బుతో స్కూళ్ళు పెట్టి అధ్యాపకుల జీతాలు చెల్లించి సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశాడు. మద్రాసు ప్రభుత్వం వారు ఈ కృషికి మెచ్చి 1913లో "రావ్ బహదూర్" బిరుదు ఇచ్చారు. భాషాశాస్త్రంలో అప్పుడప్పుడే వస్తున్న పుస్తకాలు చదివి వ్యాకరణ నిర్మాణ విధానం నేర్చుకొన్నారు. ముప్ఫై అయిదేళ్ళ కృషితో 1931లో ఇంగ్లీషులో సవర భాషా వ్యాకరణాన్ని, 1936లో సవర-ఇంగ్లీషు కోశాన్ని నిర్మించారు. మద్రాసు ప్రభుత్వం వారు గిడుగు ఆంగ్లంలో తయారుచేసిన సవరభాషా వ్యాకరణాన్ని 1931లోను, సవర-ఇంగ్లీషు కోశాన్ని 1938లోను అచ్చువేశారు. 1934లో ప్రభుత్వం అతనికి 'కైజర్-ఇ-హింద్ ' అనే స్వర్ణ పతకాన్నిచ్చి గౌరవించింది.

మనదేశంలో మొట్టమొదట ఆస్ట్రో-ఏషియాటిక్ భాషా కుటుంబంలో ఒక శాఖ అయిన ముండా భాషల ఉపకుటుంబ భాషను శాస్త్రీయంగా పరిశీలించిన వాడు గిడుగు రామమూర్తి. ఆర్యభాషా వ్యవహర్తలు మన దేశానికి రాకముందు (క్రీ.పూ. 15వ శతాబ్ది) నుంచి వీళ్ళు మనదేశంలో స్థిరపడ్డారు. వీరిని "శబరు"లనే ఆదిమ జాతిగా ఐతరేయ బ్రాహ్మణం (క్రీ.పూ. 7వ శతాబ్ది) లో పేర్కొన్నారు. హైస్కూల్లో చరిత్రపాఠం చెప్పేరోజుల్లోనే దేవాలయాల్లో ఉన్న శాసనాల లిపిని స్వతంత్రంగా నేర్చుకుని చదివాడు. విషయ పరిశోధన చేసి వాటి ఆధారంగా ఎన్నో చారిత్రకాంశాలు, ముఖ్యంగా గాంగ వంశీయులను గురించి రామమూర్తి ఇంగ్లీషులో ప్రామాణిక వ్యాసాలు రాసి ప్రచురించాడు. 1911లో గిడుగు 30 ఏళ్ళ సర్వీసుతో అధ్యాపక పదవి నుంచి స్వచ్ఛందంగా రిటైరయ్యాక, ఆధునికాంధ్ర భాషాసంస్కరణ వైపు దృష్టి మరల్చాడు. గిడుగు రామమూర్తి 1940 జనవరి 15వ తేదీన ప్రజామిత్ర కార్యాలయంలో పత్రికా సంపాదకులను సంబోధిస్తూ చేసిన తన తుది విన్నపంలో వ్యావహారిక భాషా వ్యాప్తికి చాలా సంతృప్తి పొందాడు. కాని, ప్రభుత్వ విద్యాశాఖ, విశ్వ విద్యాలయాలు గ్రాంథికాన్ని వదిలిపెట్టక పోవటానికి బాధపడ్డాడు. గిడుగు జన్మదినమైన ఆగస్టు 29 ను 'తెలుగు భాషా దినోత్సవము'గా తెలుగు రాష్ట్రాలు పరిగణిస్తున్నాయి. తెలుగు వ్యావహారిక బాషకు పితామహుడిగా పరిగణించ బడే, తెలుగు బాషకు ఎనలేని సేవ చేసిన గిడుగు 1940, జనవరి 22న కన్ను మూశారు.

# రోగులకు నాణ్యమైన వైద్య సేవలు

● విష జ్వరాల దృష్ట్యా ప్రభుత్వాసుపత్రి సేవలను సద్వినియోగ చేసుకోవాలి ● రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్

**విశ్వంభర,సూర్యాపేట:** వర్షాకాలం దృష్ట్యా వచ్చే సీజనల్ వ్యా ధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ జనరల్ ఆసు పత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజ నంద్‌లాల్ పవర్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా జనరల్ ఆసుపత్రిని పరిశీలించి, వార్డు వార్డు తిరుగుతూ రోగుల తో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును తెలుసుకొని డాక్టర్లకు పలు సూచనలు చేశారు. విష జ్వరాలతో పాటు డెం గ్యూ వ్యాధి కి సంబంధించిన అన్ని రకాల మందులు పరీక్షలు ప్రభుత్వ జన రల్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు వైరల్ ఫీవర్‌ను డెంగ్యూగా భావించి ప్రైవేట్ ఆసు పత్రులకు వెళ్లి ఇబ్బం దులు పడుతున్నారని అన్నారు. డెంగ్యూ వ్యాధిని ఎన్ఎస్ఓ పరీక్ష ద్వారా మాత్రమే నిర్దారణ చేయడం జరుగుతుందన్నారు. డెం గ్యూ వ్యాధికి సంబంధించిన అన్ని రకాల మందులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని ప్రజలు బయటి చికిత్సలు చేయించుకొని ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. విష జ్వరాన్ని డెం గ్యూగా భావించరాదని ఎన్ఎస్ఓ టెస్టు అనంతరమే డెంగ్యూ గా నిర్ధారణ చేసుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా అదే చెబు తుందన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మందులతో పాటు 24గంటలు డాక్టర్స్ అందుబాటు లో ఉంటారని అన్నారు. రోగులకు ఆహారంతో పాటు అన్ని రకాల వసతులను కల్పిం చడం జరుగు తుందని ప్రజలు ప్రభుత్వ ఆసుప త్రిలో నాణ్యమైన వైద్యాన్ని పొందా లని అన్నారు. కలెక్టర్ ప్రతివార్డు తిరుగుతూ ప్రతిరోగిని పలకరిస్తూ సమస్యలు తెలుసుకొని డాక్టర్లకు సూచనలు చేశారు. పేదలు వెళ్లే ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టి పెట్టిన కలక్టర్ వారానికి రెండు సార్లు వచ్చి రోగుల సమస్యలు తెలుసుకొని పరిష్కరించడంపట్ల రోగులు ఆనందం వ్యక్తంచేస్తూ కలెక్టర్‌కు ధన్యవాదాలుతెలిపారు. ఆసుపత్రిఇన్చార్జి సూపర్డెంట్ శ్రీకాంత్,జనార్ధన్, మున్సిపల్ కమిషనర్ బీశ్రీనివాస్ ఉన్నారు.



# అన్న ప్రసాదశాల ర్యాంపు ప్రారంభం



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఆర్కే పురం డివిజన్ లోని అష్టలక్ష్మి దేవాలయంలో అన్నపూర్ణ శాల యందు అన్న ప్రసాదశాల ర్యాంపును ముఖ్యఅతిథి కంచి కామకోటి పీఠం ధర్మాధికారి శ్రీమాన్ జై శంకర్ బాలగోపాల్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా హాజరయ్యారు. అష్టలక్ష్మి ఆలయ ట్రస్ట్ మొదటి అంతస్తు ర్యాంపు నిర్మాణం లీలావతి జ్ఞాపకార్థం ఫౌండర్ చైర్మన్ కుటుంబ సభ్యులచే నిర్మాణం చేయబడింది. కార్పొరేటర్లు రాధా ధీరజ్‌రెడ్డి, రంగానర్సింహ గుప్తా, దేవాలయ చైర్మన్ సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గంపజగన్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్, సుధాకర్ గుప్తా, దామోదర్, శ్రవణ్‌కుమార్,శ్రీనివాస్,మాలేఅనిల్,కమిటీ సభ్యులు చిలుకఉపేందర్ రెడ్డి, ఉమాపతి హాజరైనారు.

# దోమల నివారణ అరికట్టవచ్చు



**విశ్వంభర, ఎల్బీనగర్:** అంటువ్యాధులు ప్రబలకుండా ఉండడానికి డెంగ్యూ ,మలేరియా, చికెన్ గున్యా లాంటి వ్యాధులు రాకుండా అరికట్టడానికి హయత్ నగర్ సర్కిల్ పరిధిలో నాగోల్, మన్సూరాబాద్, హయత్ నగర్, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ లలో అత్యవసర చర్యలు చేపట్టడం జరిగిందని, చిన్న జాగ్రత్తలతోనే దోమల నివారణ అరికట్టవచ్చని హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య అన్నారు. బుధవారం నాగోలు విలేజ్ లోను మనుసురాబాద్ వీకర్ సెక్షన్ కాలనీ, భవాని నగర్, హాయత్నగర్ విలేజ్, బి.ఎన్.రెడ్డి నగర్ లోని సచివాలయ నగర్‌లలో ముమ్మర చర్యలు చేపట్టడం జరిగింది అని తెలిపారు.ఎంటమాలోజీ లో పనిచేస్తున్న వర్కర్లందరూ ఇల్లిల్లు తిరిగి వాళ్ల యొక్క నీటి సంపులను చెక్ చేయడం జరిగింది.ఆల్ఫా సైపర్ మాత్రిన్ లిక్విడ్ని గోడలకి స్ప్రే చేయడం ,వాటర్ సంపులో టెమోఫస్ ను వేయడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసి స్టెంట్ ఎంటమాలజిస్ట్ రవీందర్ రెడ్డిలతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# నగర సంకీర్తనలో ఉత్సవ విగ్రహా ఊరేగింపు





**విశ్వంభర, మెట్ పల్లి:** శ్రీ కృష్ణాష్టమి జన్మదినాన్ని పురస్కరించుకొని మెట్ పల్లి పట్టణంలోని మురళీకృష్ణ దేవాలయంలో స్వామివారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించారు. సాయంకాలం కార్యక్రమాల్లో పల్లకి సేవా, నగర సంకీర్తనలో భాగంగా పురవీధులలో ఉత్సవ విగ్రహాన్ని చిన్నారులు కృష్ణ గోపికల అలంకరణలతో ఊరేగించారు. 108 రకాల ప్రసాదాలు స్వామివారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా మాతలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మైలారపు లింబాద్రి మాట్లాడుతూ కృష్ణం వందే జగద్గురుం ఇహ లోకాలకు గురువు అయినా శ్రీకృష్ణ భగవాన్ జన్మదిన వేడుకలను మురళీకృష్ణ ఆలయం ఆధ్వర్యంలో జరపడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని అన్నారు. కృష్ణ బోధ జీవితంలో జయించడం నేర్పిస్తుందని దేవ దేవుని స్మరణతో ఇహ పరలోక శాంతి కలుగుతుందని ప్రతిఒక్కరూ కృష్ణతత్వాన్ని ఆలకించి బోధించాలని తెలిపారు. ప్రతిఒక్కరికి శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. మురళీకృష్ణ ఆలయకమిటీ సత్సంగ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఓఎస్‌డీగా బోనాల కిషన్



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖకు నూతన ఓఎస్‌డీగా బోనాల కిషన్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంతకుముందు మహాదేవపూర్ సీఐగా, డీఎస్పీగా పనిచేశారు. జిల్లాకు చెందిన మారుమూల ప్రాంతాలపై ఆయనకు గట్టి పట్టు ఉండడంతో ఆయనను ఓఎస్‌డీగా నియమించారు.

# అక్రమం సక్రమమవుతుందా..??

## తూతు మంత్రంగా జిహెచ్ఎంసి అధికారులు రేకులు తీసి పక్కకు పెట్టారు అక్రమ

## భవన నిర్మాణంపై అంటి ముట్టనట్టుగా టౌన్ ప్లానింగ్ అధికారుల వ్యవహారం

**అధికార పార్టీ నాయకునిదైతే తూతు మంత్రంగా చర్యలా??**

**ప్రధాన రహదారిపై నిబంధనలను ఉల్లంఘించి నిర్మిస్తున్న భవనం కాంగ్రెస్ పార్టీ నాయకుడిదని తెలుస్తుంది. దీంతో అధికారులు అటువైపు కన్నెత్తి చూసేందుకే ఇన్ని రోజులు జడుచుకున్నారు. స్థానికులు, ఇతర రాజకీయ పార్టీ నాయకులు ఆ భవనంపై ఎన్ని ఫిర్యాదులు చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఏం జరిగిందో తెలియదు గాని బుధవారం ఉదయం హడావుడిగా జిహెచ్ఎంసి అధికారులు చైతన్యపురి పోలీసులు వెంటబెట్టుకొని భవనం దగ్గరికి వచ్చి భవనానికి చిన్న హాని జరగకుండా చూసుకొని, పెంట్ హౌస్ నిర్మించిన రేకుల షెడ్డు మాత్రం భద్రంగా రేకులు తీసి పక్కకు పెట్టిపోయి ఫోటోలు తీసి ఫోజులిచ్చారు. జిహెచ్ఎంసి అధికారులు ఇల్లీగల్ భవనాలు కూలగొట్టారని ఊదరగొట్టారు.**



**విశ్వంభర, ఎల్బీనగర్:** రహదారి పక్కన నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణం చేపడుతున్నట్లు లిఖిత ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు అంటీ ముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. విజయవాడ జాతీయ రహదారి పక్కన యదేచ్ఛగా అక్రమ నిర్మాణం జరుగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు కళ్ళు మూసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఆర్కేపురం డివిజన్ అష్టలక్ష్మి దేవాలయం ఆర్చి పక్కన నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం గురించి స్థానికులు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం టౌన్ ప్లానింగ్ అధికారులు పోలీసు సిబ్బందితో వచ్చి భవనంపైన అదనంగా అక్రమంగా నిర్మాణం చేపట్టిన రేకుల షెడ్డు రేకులను పక్కనపెట్టి చేతులు దులుపుతున్నారు. భవనం రెండు వైపులా రోడ్లను ఆక్రమించి నిర్మాణం పనులు చేపట్టారని ఫిర్యాదు చేసినప్పటికీ కేవలం రేకులతో నిర్మించిన షెడ్డును మాత్రమే తొలగించి చేతులు దులుపు కున్నారని ఫిర్యాదుదారులు అధి కారుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తూతూ మంత్రం గా రేకుల షెడ్డును తొలగించి ఆయారామ్ గయారామ్ అన్నట్లుగా అధికారులు వ్యవహరించారఅని స్థానికులు మండి పడు తు న్నారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్వ యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేయడంతో పాటు ఇటీవల హైడ్రా ద్వారా చర్యలు చేపడుతున్నప్పటికీ స్థాని క టౌన్ ప్లానింగ్ అధికారులు చేతివటానికి అలవాటు పడి అక్రమ భవన నిర్మాణంపై చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహిస్తు న్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సదరు నిర్మాణదారుడు అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన బిల్డర్ కావడం వల్లే అధికారులు చూసి చూడనట్లుగా వదిలేశారనే మరో పనులు కూడా వెలువెత్తు తున్నాయి. జోనల్ కమి షనర్ ఈఅక్రమ భవన నిర్మాణం గురించి విచారణ చేపట్టి స్థానికులు కోరుతున్నారు. భవన నిర్మాణ దారు డికి వత్తాసు పలుకుతున్న స్థానిక టౌన్ ప్లానింగ్ అధికా రులపై కూడా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పోచమ్మ తల్లి భోనాలు



**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం లక్ష్మారెడ్డిపల్లి గ్రామంలో పోచమ్మతల్లి బోనాలఉత్సవం గ్రామస్తులు నిర్వహించారు. పవిత్ర శ్రావణమాసం పురస్కరించుకుని చివరి బుధవారం పోచమ్మ తల్లికి బోనాలతో మొక్కులు సమర్పించుకున్నారు. ఎంతో నియమ నిష్ఠలతో మహిళలు ఉపవాస దీక్షలు చేపట్టి అమ్మవారిని పూజించారు. డప్పు వాయిద్యాల నడుమ, శివ సత్తుల పునకాలతో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పోచమ్మ తల్లికి సమర్పించారు.

# పుస్తె మట్టెలు అందజేత



**విశ్వంభర, తంగళ్ళపల్లి:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో పాడి రైతు చింతపెల్లి సత్యం రావు, కవిత దంపతుల కూతురు అజిత వివాహానికి కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో నేరెళ్ళ రూట్ సూపర్వైజర్ భానుచందర్ పుస్తే మట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా భానుచందర్ మాట్లాడుతూ.. కరీంనగర్ డెయిరీ అనేక సంక్షేమ కార్యక్రమాలు రైతుల కోసం చెపట్టిందని అందులో కళ్యాణమస్తు పథకంలో భాగంగా ఆడబిడ్డ పెళ్ళికి పుస్తే మట్టెలు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ పాల ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షులు మద్దెల సంతోష్, పాడిరైతులు తదితరులు పాల్గొన్నారు.

## చివరికి ధర్మం గెలిచింది

**విశ్వంభర, కొల్లాపూర్ :** భారతరాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత ఎట్టకేలకు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని 166 రోజులు తీహార్ జైల్లో చెయ్యని తప్పుకు శిక్ష అనుభవించి చివరికి ధర్మం కవిత వైపు ఉన్నందుకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై బీఆర్ఎస్ పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు డీకే మాదిగ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజాసేవ చేయడం మరువ

## మాజీ సర్పంచ్ గూడూరు రజిని తిరుపతి



**విశ్వంభర, మెట్‌పల్లి:** మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ గూడూరు రజిని తిరుపతి గ్రామంలో దోమల నివారణకు గ్రామ పంచాయతీ కార్యదర్శి సిహెచ్ నారాయణతో కలసి మాలతిన్, బయోటెక్స్ స్ప్రే గ్రామంలోని ప్రతి వార్డులో చేయించారు. విష జ్వరాలు ప్రబలకుండా ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చికెన్ గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధి లక్షణాలు కనపడిన వెంటనే వైద్యులను సంప్రదించాలని వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మాజీ సర్పంచ్ రజనీ తిరుపతి కోరారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి వికారాబాద్ సీఐ నాగరాజు



**విశ్వంభర, వికారాబాద్:** ద్విచక్ర వాహనదారులు నిబంధనలను పాటిస్తూ వాహనాలను నడపాలని వికారాబాద్ సీఐ నాగరాజు అన్నారు. బుధవారం సీఐ తమ సిబ్బందితో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ద్విచక్ర వాహనదారులను ఆపి తగు సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ కే నారాయణరెడ్డి ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. కొంతమంది లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తున్నారని, వాహనాలకు నంబర్ ప్లేట్స్ ఉండడం లేదన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా డ్రైవింగ్ చేసే వారిపై, సౌండ్ పొల్యూషన్ చేసే వారిపై, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు.

# ప్రతీ నలుగురిలో ఒకరు బ్రెయిన్ స్ట్రోక్

## ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.నిర్మల్ సూర్య

**విశ్వంభర, బషీర్ బాగ్:** జాతీయ ప్రచార కార్యక్రమమైన 'మిషన్ బ్రెయిన్ అటాక్' కు హైదరాబాద్‌లో అపూర్వ స్పందన లభించిందని ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ) అధ్యక్షుడు డాక్టర్ నిర్మల్ సూర్య అన్నారు. ఈ ప్రచార కార్యక్రమం ప్రధానంగా స్ట్రోక్స్ కు సంబంధించి ఎండ్ టు ఎండ్ సంరక్షణపై దృష్టి పెట్టిందని, ఇటీవలే వారణాసిలో ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ (ఐఎస్ఏ)చే ప్రారంభించారని తెలిపారు. స్ట్రోక్ రాకుండా జాగ్రత్తపడడం మొదలుకొని అక్యూట్ మేనేజ్ మెంట్, రిహాబిలిటేషన్ అంశాలపై ఈ కార్యక్రమం ప్రధానంగా దృష్టి పెడుతుందని తెలిపారు. ప్రతీ నలుగురిలో ఒకరు స్ట్రోక్ బారిన పడే అవకాశం ఉందని అంతర్జాతీయ గణాంకాలు వెల్లడిస్తున్నాయని హెచ్చరించారు. స్ట్రోక్ వచ్చేందుకు మూడు ప్రధాన కారణాలున్నాయనీ అవి %-% బ్లడ్ ప్రెషర్, షుగర్, కొలెస్ట్రాల్ తమ ఇంట్లో పెద్ద వారిలో ఎవరికైనా స్ట్రోక్ వచ్చిఉంటే, బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ ఉంటే జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అలాంటి సందర్భాల్లో తక్కువ బరువు ఉండేలా చూసుకోవాలని కొలెస్ట్రాల్‌ను నియంత్రించుకోవాలనీ, ఆల్కహాల్, పొగాకు తీసుకోవడం మానేయాలి అని అన్నారు. అనంతరం ఐఎస్ఏ కార్యదర్శి డాక్టర్ అరవింద్ శర్మ మాట్లాడుతూ మిషన్ బ్రెయిన్ అటాక్ అనేది ఈ తరహాలో నిర్వహించబడుతున్న ఏకైక జాతీయ ప్రచార కార్యక్రమం అని అన్నారు. స్ట్రోక్ నివారణ మొదలుకొని అవగాహన, నిర్వహణ, సంరక్షణ, పునరావాసం దాకా అన్ని అంశాల గురించి ఇది చర్చిస్తుందన్నారు. హైదరాబాద్ నగరం ఈ ప్రచార కార్యక్రమం పట్ల ఎంతో ఉత్సాహంతో, ఆసక్తితో చక్కటీ స్పందన వచ్చిందన్నారు. ఐఎస్ఏ ప్రెసిడెంట్ ఎలక్ట్, ఐఎస్ఏ స్ట్రోక్ సమ్మర్ స్కూల 2024 కార్యనిర్వహణ కార్యదర్శి డాక్టర్ పి. విజయ మాట్లాడుతూ.. ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ మార్గదర్శకత్వంలో తాము స్ట్రోక్ సమ్మర్ స్కూల్ పదో ఎడిషన్ ను హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఈ ప్రతిష్టాత్మక శిక్షణ




కార్యక్రమం ఐఎస్ఏ ఫ్లాగ్ షిప్ కార్యక్రమం ప్రధానంగా స్ట్రోక్ మెడిసిన్ విభాగంలోకి డీఎం, డీఎన్బీ న్యూరాలజీ ట్రైనీలను చేర్చుకునేందుకు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

# దోమల నివారణ అరికట్టవచ్చు

## జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్




**విశ్వంభర, ఎల్బీనగర్:** పరిసరాల పరిశుభ్రత తోనే దోమల నివారణ అరికట్టవచ్చని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్ అన్నారు. బుధవారం జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే సిజినల్ వ్యాధులు (డెంగీ, మలేరియా, చీకున్ గున్య) అవగాహన కలిగి ఉండాలి అని అన్నారు. ప్రతి ఇంటిలో దోమలు పెరిగే ప్రదేశాలు అయినా పూల కుండీలు, కూలర్స్, టైర్, ప్లాస్టిక్ డబ్బాలు, రోలు, సిమెంట్ తొట్టిలు నీరు నిలువ వుండే ప్రదేశాలలో ఎప్పటికప్పుడు జాగ్రత్త పరుచుకోవాలని అన్నారు.ఇంటిలో, ఇంటి పరిసరాల నీటి నిల్వలలో పెరిగే దోమలే చాలా ప్రమాదకరం అని అన్నారు.వారంలో ఒక రోజు డ్రై డేగా పాటించి, నీరు నిలువ ఉన్న పాత్రాలను శుభ్రంగా కడిగాలని సూచించడం జరిగింది.దోమతెరలు, దోమలను పారదోలే రసాయనాలను వాడాలి అవగాహనా కలిపించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఏంటోమలోజిస్ట్ రజని, అసిస్టెంట్ ఏంటోమలోజిస్ట్ రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

# ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



**విశ్వంభర,రామన్నపేట:** ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ ప్రకటించిన 2023-24 విద్యా సంవత్సర ఫలితాల్లో రామన్నపేటకు చెందిన వివేకానంద హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. 4వ తరగతికి చెందిన పున్న హర్షసాయి రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంక్, రూ.700 ల స్కాలర్షిప్ సాధించారు, రెండవ తరగతికి చెందిన గంగపురం అజిత్ రాష్ట్రస్థాయిలో 21వ ర్యాంక్ తోపాటు ఎక్సలెన్స్ మెడల్ అవార్డ్ సాధించగా.., ఒకటవ తరగతికి చెందిన చెన్నోజు ప్రణవి, మూడో తరగతికి చెందిన కన్నెబోయిన అఖిల, నాలుగవ తరగతికి చెందిన రెముడాల హారికకు స్వర్ణ పతకాలు, ఒకటవ తరగతికి చెందిన గోగు హర్షిత, మూడో తరగతికి చెందిన మంద్ర యశస్వినిలకు రజత పతకాలు, ఒకటవ తరగతికి చెందిన కునూరు మహోన్నత్, మూడవ తరగతికి చెందిన సాల్వేరు సాయి లక్ష్మి, సాధనలు కాంస్య పతకాలు సాధించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ పాఠశాల వ్యవస్థాపకులు తిరుగుడు మల్లికార్జున్ మాట్లాడుతూ.., విద్యార్థినీ విద్యార్థులు ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో ముందుకు సాగాలంటే పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షల స్థాయి విషయాలు నేర్చుకోవాలని, మంచి క్రమశిక్షణ వల్ల మంచి నడవడిక వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వెలిమినేటి మల్లేష్, అస్మ, నాగరాజు, ముత్యాలు, ముబీన్, మహేష్, వెంకట్ కాంబ్లీ, విజయ, సుధారాణి, సునీత, శాంతి, భార్గవి, అనిత, తదితర ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నీటిని విడుదల చేయాలి



విశ్వంభర, చివ్వెంల: ఎస్సారెస్పి వరద కాల్వ ద్వారా పంట పొలాలకు సాగునీటిని అందించాలని... కండ్ల ముందే పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని గ్రామీణ పేదల సంఘం జిల్లా అధ్యక్షులు కొనకంచి వీరభద్రయ్య అన్నారు. ఎస్సారెస్పి కాల్వల ద్వారా నీటిని విడుదల చేసి పంట పొలాలకు సాగునీటిని అందించాలని మండలంలోని మొగ్గయ్యగూడెం గ్రామంలో రైతులతో కలిసి ఎస్సారెస్పి కాల్వలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రైతులను మోసం చేస్తుందని మండిపడ్డారు. కాల్వ వస్తుందనే ఆశతో నాట్లు వేశామని ఇప్పుడు నీరు ఇవ్వకుంటే రైతులకు ఎకరాకి రూ. 25 వేల నష్టం వాటిల్లితుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతూ.. శ్రీరాంసాగర్ రిజర్వాయర్ నిండా నీళ్లు నిల్వ ఉన్నా సాగునీరు విడుదల ఎందుకు చేయడం లేదని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సాగుచేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కనికరం చూపిస్తలేరని ఆవేదన వ్యక్తం చేశారు. పంటల కోసం పెట్టిన పెట్టుబడులు భారంగా మారాయన్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి పంట పొలాలలకు సాగు నీరు అందివ్వాలన్నారు. డీఎస్ఓ జిల్లా కార్యదర్శి భాషిపంగు సునీల్, అనంతుల యల్లయ్య, వెంకన్న, ఉప్పలయ్య, వెంకటనర్సు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# భవనానికి శంకుస్థాపన



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలం పట్టణంలోని సేవ భద్రాద్రి కమిటీ నాలుగేళ్ల క్రితం వరద బాధితుల కోసం రూ.40 లక్షల నగదును విరాళాలుగా సేకరించింది. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయం దగ్గర భూమిని భవన నిర్మాణం కోసం దేవదయశాఖ అందించింది. ఆస్థలంలో రూ.40 లక్షలతో వరద బాధితుల కోసం మల్టీపర్పస్ నిర్మాణానికి ముఖ్యఅతిథి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పట్టణ ప్రముఖులు శంకుస్థాపన చేశారు. శివ భద్రాద్రి కమిటీఅధ్యక్షుడు పాకాలదుర్గాప్రసాద్‌తోపాటు కమిటీసభ్యులు,పట్టణప్రముఖులు పాల్గొన్నారు.

# పకడ్బందీ చర్యలు చేపట్టాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** ప్రభుత్వ భూముల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కాటారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, అటవీ, ఐటీఐ, టిజిఐఐసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాటారం డివిజన్ లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు భూమి అవసరం ఉందని, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కాటారంలో ఐటీఐ, టిజి ఐఐసి కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించామని, పనులు ఎందుకు ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూమి లభించడమే కష్టమైన నేపథ్యంలో ఎన్నో ప్రయాసలకు లోనై భూమి కేటాయించామని తక్షణమే పనులు చేపట్టాలని ఆదేశించారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభం కాకపోతే నివేదికలు అందచేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ప్రభుత్వ సర్వే నంబర్స్ భూములు రిజిస్ట్రేషన్ చేయకుండా పటిష్ఠ రక్షణ చర్యలు చేపట్టాలని, రిజిస్ట్రేషన్ శాఖకు లేఖ వ్రాయాలని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ స్థలంలో ఇండ్ల నిర్మాణాలకు ఇంటి నంబర్స్ కేటాయించొద్దని డిపిఓ కు సూచించారు. ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణాలు చేపడితే కూల్చివేతే చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిపిఓ నారాయణరావు, ఆర్డిఓ మంగిలాల్, తహసీల్దార్ నాగరాజు, ఐటీఐ ప్రిన్సిపాల్ భిక్షపతి, టిజిఐఐసి డి ఈ స్మరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారులకు ఇబ్బందులు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు వద్ద పార్కింగ్ లేకపోవడంతో వాహనదారులు రోడ్డపైనే వాహనాలు పెడుతున్నారు. దీంతో ప్రయాణికులు, బ్యాంక్ వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాయిగిరి-మోత్కుర్ మెయిన్ రోడ్డు నుంచి ఆత్మకూరు గ్రామంలోకి వెళ్ళటానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకుకు వచ్చే వినియోగదారుల కోసం పార్కింగ్ ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తప్పుతాయని ప్రజలు సూచిస్తున్నారు.

# ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పూర్తి చేయాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** ఎల్ఆర్ఎస్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లుకు తావులేకుండా నిష్పక్షపాతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం కాటారం మండలం, కొత్తపల్లి గ్రామంలో జరుగుతున్న ఎల్ ఆర్ ఎస్ ప్రక్రియను ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. సర్వే నంబర్ 16, కంభం మధుకర్ స్థలంలో జరుగుతున్న ప్రక్రియ ఆన్లైన్ చేయు విదానాన్ని పరిశీలించారు. గిర్దావర్, ఇరిగేషన్, ఎంపీవోలు నమోదు చేసిన తదుపరి ఆన్లైన్ లో అదనపు కలెక్టర్ పరిశీలనకు వస్తాయని, అదనపు కలెక్టర్ పరిశీలన ఆమోదం తదుపరి కలెక్టర్ ఆమోదించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. స్థలానికి నాలుగు ప్రక్కల హద్దులు ఆన్లైన్ నమోదు చేసిన తదుపరి ఎంత మొత్తం చెల్లించాలో ధర నిర్ణయించబడుతుందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర ప్రకారం చెల్లింపు చేయాల్సి ఉంటుందని, తదుపరి చెల్లింపు ప్రక్రియ జరగగానే ఆన్లైన్ ద్వారానే క్రమ బద్ధీకరణ జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఏర్పాటును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డిఓ మంగిలాల్, డిపిఓ నారాయణ రావు, తహసీల్దార్ నాగరాజు, ఎంపిఓ వీరస్వామి పాల్గొన్నారు.

# వాటర్ ట్యాంక్ నిర్మాణం ఆపండి



**విశ్వంభర,చండూరు:** స్థానిక మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపడుతున్నా వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని ఆపాలి అని భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెవైయం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పేర్ల గణేష్ మాట్లాడుతూ అధికారులకు, నాయకులకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టిన మొదటగా ప్రభుత్వ పాఠశాలే గుర్తు వస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ట్యాంక్ నిర్మాణాన్ని చేపట్టడం వల్ల విద్యార్థులకు,చండూరు యువతకి క్రీడలు ఆడుకోవడానికి గ్రౌండ్ సౌకర్యం ఉండదు అని అన్నారు. ఎలాంటి క్రీడ పోటీలు నిర్వహించలని అనుకున్నా కూడా చండూరు మునిసిపాలిటీ లోని ప్రభుత్వ పాఠశాలలో తప్ప గ్రౌండ్ సౌకర్యం ఎక్కడ లేదని అన్నారు. కావున తక్షణమే ట్యాంక్ నిర్మాణాన్ని వేరే చోట నిర్మాణం చేపట్టాలి అని డిమాండ్ చేసారు. లేనిచో బీజేవైయం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సిరాసవాడ నాగరాజు, వంశి, ఆకాశ్, తిరుమలేశ్ ,రాజు తదితరులు పాల్గొన్నారు.

# డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి: 8 గొర్రెలు మృత్యువాత



**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు మండల పరిధిలోని కోనాపూర్ గేటు వద్ద వరుస గొర్ల కాపరి దన్వాడ మండలానికి చెందిన అంజనేయులు గోర్లనిమెపుతూ వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న డీసీఎం డీకొట్టడంతో గాయపడ్డాడు. ప్రమాదంలో 8 గొర్రెలు చనిపోయాయి. నాగర్‌కర్నూల్ నుండి హైదరాబాద్‌గా వెళ్తున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రమాదాన్ని చూసి స్థానికుల సాయంతో ఆమనగల్ ప్రభుత్వఆసుపత్రికి తీసుకువచ్చారు. రక్తస్రావంకావడంతో ఆవ్యక్తి మార్గమద్యలో చనిపోయినట్లు తెలిపారు. గొర్ల కాపరి చనిపోవడంతో ప్రవీణ్‌కుమార్ దిగ్భ్రాంతివ్యక్తం చేశారు. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైవెంకటేష్ తెలిపారు పోస్టమార్టంమృతిచెందినవ్యక్తినికల్వకుర్తిప్రభుత్వఆసుపత్రికి తరలించారు.

# కాళేశ్వరంలో రాములోరి ఊరేగింపు



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరం యొక్క అనుబంధ ఆలయమైన రామాలయంలో కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారి ఉత్సవమూర్తులకు ఊరేగింపు నిర్వహించారు. తర్వాత ప్రధాన ఆలయం రాజగోపురం ఎదుట ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ మారుతి కార్యనిర్వహణాధికారి, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, వేద పండితులు, అర్చక స్వాములు, సిబ్బంది, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రామాలయంలో హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించారు.

# కలెక్టర్ ఆసుపత్రుల తనిఖీ

**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ వైద్య సేవలకు వచ్చిన ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బుధవారం కాటారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి పరిసరాలు మొత్తం కలియ తిరిగి ఓపీ రిజిస్టర్ ఆసుపత్రిలో సేవలు పొందుతున్న ప్రజలను వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలల్లో మొక్కలు నాటి ఆహ్లాదకరంగా చేయాలన్నారు. జలుబు, దగ్గుతో బాధపడేవారు ఎక్కువగా వస్తున్నారని ఈ రోజు 150 మంది వరకు వైద్య సేవలకు వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. జ్వరాలు నియంత్రణకు ఇంటింటి సర్వే చేయాలని అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. బీపీ, మధుమేహం మందులు అందుబాటులో ఉండాలన్నారు. మహదేవపూర్, పలిమెల, మహాముత్తారం, మల్హార్ మండలాల్లో వైద్యుల నివాస గృహాలు నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలని సూచించారు. కాళేశ్వరంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి భూములు కేటాయించాల్సి ఉన్నట్లు తెలిపారు. అనంతరం బాలాజీ హాస్పిటల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రైవేట్ హాస్పిటల్స్ లో తప్పనిసరిగా వైద్య సేవల ధరల పట్టిక ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ధరల పట్టిక ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చామని ఎందుకు ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యాధికారులు తరచూ ప్రైవేట్ ఆసుపత్రులు తనిఖీలు చేయాలని, ఎక్కడైనా ధరల పట్టిక ఏర్పాటు చేయకపోయినా, వైద్య సేవల్లో నిబంధనలు పాటించకపోయినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, డిపిఓ నారాయణరావు, ఆర్డీవో మంగీలాల్, తహసిల్దార్



నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న స్నేహితులు



**విశ్వంభర, నారాయణపూర్:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన మందుగుల లక్ష్మయ్య కొద్దీ రోజుల క్రితం బైక్ పై వెళుతుండగా యాక్సిడెంట్ జరగడంతో హైదరాబాదులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉన్న విషయాన్ని తెలుసుకొని తోటి స్నేహితులు 91-92 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు వారి కుటుంబాన్ని స్నేహితున్ని పరామర్శించి 15,000 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో చిలువేరు అంజయ్య,దేశగోని కృష్ణ గౌడ్,ఉప్పల శ్రీనివాస్, జక్కడి వెంకట్ రెడ్డి,మహేశ్వరం సంజీవ, రాపర్తి గోపి,దూసరి నారాయణ, గాదరి కిరణ్ కుమార్, కట్ట వెంకయ్య,యూసుఫ్ బాబా పాల్గొన్నారు.

---

# కలెక్టర్ విస్తృత పర్యటన



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం కాటారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. యూత్ ట్రైనింగ్ కేంద్రం, కెజిబివి పాఠశాల, గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో పాఠాలు చదివించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఏదేని అత్యవసర సేవలకు జిల్లా కేంద్రంలోని 100 పడకల ఆసుపత్రికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఆరోగ్యం బాగా లేక ఇండ్లకు వెళ్లిన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని వాకబు చేయాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాల్లో సోలార్ హీటర్లు, ఆర్ ఓ ప్లాంట్స్ ఏర్పాటుకు మండల ప్రత్యేక అధికారుల ద్వారా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. వినియోగానికి పనికిరాకుండా నిరుపయోగంగా ఉన్న వస్తువులను తొలగించాలని ఆదేశించారు. గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలల్లో డార్మెటరి అప్పగించకపోవడం వల్ల విద్యార్థులు ఆరుబయట భోజనం చేయాల్సి వస్తుందని తక్షణమే డార్మెటరి అప్పగించు విదంగా చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ డిడిని ఆదేశించారు. అదేవిధంగా యూత్ ట్రైనింగ్ కేంద్రం నిర్వహణ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భవనం నిర్వహణ లోపం వల్ల నిరుపయోగంగా ఉందని, వినియోగంలోకి తేవాలని వారం రోజుల్లో పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించి ముస్తాబు చేయాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ డిడి ఒక్క సమావేశానికి కూడా రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేజీబివి పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. వంట సామాన్లు భద్రపరచు గదిని పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందించాలని తెలిపారు. నిత్యావసర సరుకులు సకాలంలో సరఫరా జరుగుతుందా లేదా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీఓ నారాయణరావు, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, ఆర్డిఓ మంగిలాల్, తహసీల్దార్ నాగరాజు, కళశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నివారణ చర్యకు నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టి

## స్పెషల్ డ్రైవ్ పనులపై దిశా నిర్ధేశం చేసిన కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ ఐఏఎస్

**విశ్వంభర, కరీంనగర్:** ప్రజల ఆరోగ్య రక్షణే ద్యేయంగా నగరంలో ప్రత్యేక పారిశుధ్య ( స్పెషల్ డ్రైవ్) పనులకు శ్రీకారం చుట్టామని కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ ఐఏఎస్ అన్నారు. కరీంనగర్‌లో బుధవారం రోజు కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ ఐఏఎస్ నగరపాలక సంస్థ పరిదిలోని పలు డివిజన్లలో పలు చోట్ల పర్యటించారు. పారిశుధ్య కార్మీకులు, సిబ్బంది చేస్తున్న స్పెషల్ డ్రైవ్ పరిశుభ్రత పనులను తనిఖీ చేసి పరిశీలించారు. సిబ్బందికి పలు సలహాలు సూచనలతో ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా జ్యోతినగర్ ప్రాంతంలో ఓ షాపు యజమాని చెత్తను రోడ్లు డ్రైనేజీల్లో వేసినందుకు జరిమాన విధించారు. కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ... నగర వ్యాప్తంగా సీజనల్ వ్యాదులు ప్రభలకుండ నగరపాలక సంస్థ ప్రత్యేక పారిశుధ్య పనులు చేస్తున్నట్లు తెలిపారు. డివిజన్ వారిగా రోడ్లు పరిసర ప్రాంతాల్లో చెత్త లేకుండా కార్మీకులు, సిబ్బంది పరిశుభ్రత పనులు చేస్తు చర్యలు తీస్కుంటున్నట్లు తెలిపారు. నగరంలోని అన్ని ఒపెన్ డ్రైనేజీల్లో చెత్త సిల్టును తొలగించడంతో పాటు దోమల లార్వాలు పెరగకుండా స్ప్రే చేస్తున్నట్లు తెలిపారు. పరిస రాలను గృహ యజమానులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచి ంచారు. విజ జ్వరాల బారిన పడకుండా ఉండాలంటే నగరపాలక సంస్థ చేస్తున్న పారిశుధ్య పనులకు తోడుగా మీఇంటి ఆవరణ చుట్టు పరిసరాలను మీరు కూడ శుభ్రం చేస్కోవాలని తెలిపారు. అసిస్టెంట్ కమీషనర్ వేణుమాధవ్, ఎస్సైలు, జవానులు పాల్గొన్నారు.



# ఓపీఎస్ విధానాన్ని పునర్ధరించాలి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆత్మకూర్(ఎం) మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు , జిల్లా కార్యదర్శి దొడ్డి స్వామి , కొణతం శ్రీనివాస్ మాట్లాడుతూ సిపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని పునర్ధరించాలని, పెండింగ్లో ఉన్న నాలుగు డిఎలను వెంటనే విడుదల చేయాలని, పిఆర్సి నివేదికను తెప్పించుకుని, వెంటనే ఫిట్ మెంట్ ప్రకటించాలని, జూలై 2023 నుండి పి ఆర్ సి ని అమలు చేయాలని, ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను విద్యా వాలంటీర్లచే భర్తీ చేయాలని, 10000 పిఎస్హెచ్ఎం పోస్టులను బీఈడి, డిఈడి ఎస్జీటిలచే భర్తీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మిరియాల దామోదర్ , జిల్లా సాంస్కృతిక కమిటీ కన్వీనర్ కట్టా రమేష్ , మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దర్శనం వెంకన్న, జూకంటి కరుణాకర్ పాల్గొన్నారు.

## ఆరోగ్య శిబిరాలను సద్వినియోగపరచుకోవాలి

### ఆమనగల్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి




**విశ్వంభర, ఆమనగల్లు:** గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగపరచుకోవాలని ఆమనగల్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పశువుల లక్ష్మారెడ్డి అన్నారు. వర్షకాలం సీజన్ లో అంటువ్యాధులు వ్యాపిస్తున్నాయని గ్రహించి ప్రజలందరికీ ఉచితంగా వైద్యం అందించాలనే మంచి ఉద్దేశంతో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైందని అన్నారు. తలకొండపల్లి మండలం వెంకట్రావు పేట గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని వెంకటేష్ తో కలిసి ప్రారంభించారు. డాక్టర్ అఖిల్, డాక్టర్ అనిల్, కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో వెంకట్రావుపేట్ గ్రామస్తులకు బిపి, షుగర్, టెస్టులు చేసి సుమారు 236 మందికి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, జలుబు, దగ్గు వైరల్ ఫీవర్ వంటి వ్యాధులు సోకిన వారికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మందులు పంపిణీ చేసి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు నరసింహారెడ్డి, జూలూరు రమేష్, శ్రీనివాస్ రెడ్డి, తిరుపతిరెడ్డి, మోహన్ రెడ్డి, ఓంకారం, గ్రామ మాజీ సర్పంచ్ లు హైమావతి రమేష్ యాదవ్, ఈశ్వర్ నాయక్, లక్ష్మీదేవి, రఘురాములు, కమల్, వెంకటయ్య, కానుగుల దశరథం, గౌడ సంఘం తాలూకా కన్వీనర్ అశోక్ గౌడ్, రాము నాయక్, కళ్యాణ్ కార్, రాజు, జహంగీర్, ప్రసాద్, తిరుపతయ్య, ఐలయ్య, శ్రీనివాస్,విష్ణు,భీమ్లాల్,దశరథం,ఎం.లాల్,శ్రీరామ్ నాయక్, భాస్కర్, చక్రి, సంపత్ కుమార్ పాల్గొన్నారు.

# డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలి

## వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగ చారి




**విశ్వంభర, ఎల్బీనగర్:** బుధవారం వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యాలయం ఎల్బీనగర్‌లో రాయబండి పాండురంగ చారి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వి రాములు, సహాయ కార్యదర్శికొప్పు యాదయ్యలు విలేకరుల సమావేశం నిర్వహించారు. కామారెడ్డి డిక్లేషన్ వెంటనే అమలు చేసి, సమగ్ర కులగలను తక్షణమే ప్రారంభించాలని, చేయని పక్షంలో వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పటాపంచలైతుందని హెచ్చరించారు. బీపీ మండల్ జయంతి రోజున ఆమరణ దీక్ష ప్రారంభమై పోలీసులు అరెస్ట్ లు మీద అరెస్టు చేసుకుంటూ సంచారా ఆమరణ దీక్షగా కొనసాగుతున్నాయని, నాలుగో రోజు కొనసాగుతున్న బత్తుల సిద్దేశ్వరులు, సంజయ్ కుమార్లు గాంధీ హాస్పిటల్ లో దీక్షలు కొనసాగుతుండగా, చాపర్తి కుమార్ గాడ్గేను అర్ధరాత్రి పోలీసుల అరెస్టు చేసి వరంగల్ జిల్లాలోని గీసుకొండ గ్రామంలో దీక్షలు కొనసాగుతున్నాయని, గత పాలకులు చేసిన దుర్మార్గాలు కంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ పాలనతో కొనసాగుతుందని, ఈ మొండి వైఖరిని విడనాడి, కామారెడ్డి డిక్లేషన్ వెంటనే అమలు చేసి, స్థానిక సంస్థల ఎన్నికల ముందే 42 శాతం రిజర్వే షన్లను పెంచి ఎన్నికలకు పోవాలని కోరారు. కుల సంఘాలు, బీసీ సంఘాలు, రాజకీయ పార్టీలు, కలిసొచ్చే ఉద్యమకారులతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పాండురంగ చారి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# రీజినల్ రింగ్ రోడ్‌ను విస్తరించాలి

**విశ్వంభర, పరిగి:** అసెంబ్లీలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి బుధవారం మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి రీజినల్ రింగ్ రోడ్‌ను వికారాబాద్, పరిగి నియోజకవర్గాల మీదుగా వెళ్లేటట్టు రూపకల్పన చేయాలని కోరడం జరిగిందని, దానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు అని తెలిపారు. గత %దీ=రా% ప్రభుత్వం పాలనలో రీజినల్ రింగ్‌రోడ్‌ను వికారాబాద్, పరిగి నియోజక వర్గాల వరకు విస్తరించాలని తాను నిరాహార దీక్ష చేయ డం జరిగిందని తెలిపారు. సెప్టెంబర్ 10,11 తేదీల్లో 800కోట్లతో అప్పుజంక్షన్ నుంచి మన్నెగూడవరకు ఫోర్‌లైన్ రహదారి పనుల ప్రారంభోత్స వానికి, 2500కోట్లతో పూడూరు నేవీ రాడార్ స్టేషన్ శంకుస్థాపనకి సీఎం రేవంత్ రెడ్డి జిల్లాకు రానున్నారని దానిపై రెండు మూడు రోజుల్లో స్పష్టత ఇస్తామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో వున్న గండీడ్, మహ్మదాబాద్ మండలాలను జిల్లాలో కలపాలని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.




# క్రీడల్లోనూ రాణించాలి



**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా, ఘట్కేసర్ మండలం చౌదరిగూడా గ్రామంలో స్పోర్ట్స్ మీట్ నిర్వాహకులు, సెయింట్ పాల్స్ స్కూల్ చైర్మన్ జి.దేవదానం, కరస్పాండెంట్ జి.హెబ్సిబా రాణి విద్యార్థులకు ఆటల పోటీలు బుధవారం నిర్వహించారు. పిల్లలకు చదువుతోపాటు, ఆటల్లో అవగాహన కలిగే విధంగా, మానసిక ఒత్తిడి నుండి దూరం చేయడానికి, ఈ పోటీలు నిర్వహించిన సెయింట్ పాల్ స్కూల్ యజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ఆటల పోటీల్లో ఘట్కేసర్ ఉమ్మడి మండలం నుంచి 10 స్కూల్స్ ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఈరోజుల్లో కార్పొరేట్ స్కూళ్లలో చదువు మీద పిల్లలు, మానసిక ఒత్తిళ్లకు గురవుతున్న రోజుల్లో ఇలాంటి ఆలోచనలతో ముందుకు వచ్చి ఈ పోటీలు నిర్వహిస్తున్న వారికి ధన్యవాదాలు తెలుపుతూ.. కార్యక్రమాలు ప్రతి సంవత్సరం నిర్వహించాలని అన్నారు. పద్మశ్రీ హై స్కూల్ కర స్పాండెంట్, మేడ్చల్ జిల్లా టిఆర్ఎస్ఎంఏ అధ్యక్షుడు జె. నాగరాజు, సాయి వాణి గ్రామర్ స్కూల్ కరస్పాండెంట్, ఘట్కేసర్ టిఆర్ఎస్ఎంఏ అధ్యక్షుడు పి.అంజన్‌రెడ్డి, న్యూవిజన్ స్కూల్ కరస్పాం డెంట్, టిఆర్ఎస్ఏంఏ ప్రధాన కార్యదర్శి ఎన్. కృష్ణమూర్తి, శ్రీ చైతన్య టెక్నో స్కూల్ కరస్పాండెంట్, టిఆర్ఎస్ఎంఏ కోశాధికారి రాజశేఖర్, గ్రీన్ ఫీల్డ్ స్కూల్ కరస్పాండెంట్, టిఆర్ఎస్ఎంఏ సలహాదారు పిఎల్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

# చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పై దాడి



**విశ్వంభర , చేవెళ్ల నియోజకవర్గం:** ఎమ్మెల్యే కాలే యాదయ్య పై కాంగ్రెస్ కు చెందిన వర్గీయులు కోడిగుడ్ల తో దాడి చేశారు. షాబాద్ ఎంపీడీఓ కార్యాలయంలో కల్యాణ లక్ష్మీ చెక్కులను లబ్దిదారులకు అందజేయడానికి వచ్చిన ఎమ్మెల్యే కాలే యాదయ్య ను కాంగ్రెస్ వర్గీయులు అడ్డుకొని దాడి చేశారు. చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బీమ్ భరత్‌కి చెందిన వర్గీయులుగా పోలీసులు గుర్తించారు. పార్టీ మారినందుకే తనపై ఇలా చేసామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జికి ఇన్ఫర్మేషన్ లేకుండా ఇక్కడికి ఎలా వస్తాడు. పది సంవత్సరాల నుండి షాబాద్ ప్రాంతానికి ఎమ్మెల్యే కాలే యాదయ్య అభివృద్ధి చేసింది ఏమీ లేదనీ దుయ్యబట్టారు. బిఆర్ఎస్ పార్టీలో ఉండి విచ్చలవిడిగా ఆస్తులు సంపాదించుకొని. ఆ ఆస్తులను కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీలో చేరారని మండి పడ్డారు. ఎమ్మెల్యే అనుచరులకు నామినేట్ పోస్టులను ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు.

## రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భాస్కర్ ఎన్నిక



**విశ్వంభర, వరంగల్:** నేషనల్ హ్యూమన్ రైట్స్ చిల్డ్రన్ అండ్ ఉమెన్ ఏంపవర్మెంట్ ఆర్గనైజేషన్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా గన్నారపు భాస్కర్ ఎన్నికైనట్లుగా ఆర్గనైజేషన్ ఫౌండర్, చైర్మన్ మహ్మద్ మోయినొద్దీన్ తెలిపారు. చైర్మన్ మోయినొద్దీన్ మాట్లాడుతూ గన్నారపు భాస్కర్ ప్రస్తుత సమాజం పట్ల, మానవ హక్కులపట్ల అవగాహన కలిగిన వ్యక్తిగా గుర్తించి అతనికి ఈబాధ్యతలు ఇవ్వడం జరిగిందన్నారు. గన్నారపు భాస్కర్ మాట్లాడుతూ.. చైర్మన్ మోయినొద్దీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి పట్ల బాధ్యత వహిస్తూ సమాజంలో ఎవరి హక్కులకు భంగం కలిగినా ముందుండి సమస్యను శాశ్వతంగా పరిష్కరించుటకు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర స్థాయిలో పదవితో బాధ్యత పెరిగిందన్నారు. నాకు సహకరించిన సభ్యులు అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

# వివాహ కార్యక్రమాల్లో బూడిద భిక్షమయ్యగౌడ్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ బుధవారం వివిధ వివాహ కార్యక్రమాల్లో పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం వెనకడుగు వేయొద్దు

## పేద,మధ్య తరగతి ప్రజలకు ప్రత్యామ్నాయం చూపాలి: సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో:** రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా విషయంలో వెనకడుగు వేయొద్దని,బాడా బాబులను చూసి భయపడకుండా అడుగు ముందుకు వేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి సూచించారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ ముందుగా పేదవారికి, మధ్య తరగతి ప్రజలకు పైసా పైసా కూడా పెట్టుకుని స్థలాలు అపార్ట్‌మెంట్లు కొనుక్కున్న వారికి ప్రత్యామ్నాయ మార్గం చూపిన తర్వాతే వారి ఇళ్లను కూల్చాలన్నారు. నాగార్జున విషయంలో 2014లోనే ఈ అంశంపై కోర్ట్ ఆర్డర్స్ ఉన్నప్పటికీ పదేళ్లుగా ఎన్ కన్వెన్షన్ పై వస్తున్న ఆదాయాన్ని వారు అనుభవిస్తున్నారని తెలిపారు. ఎన్ కన్వెన్షన్ ఒక్కటే కాకుండా ఎవరైతే బఫర్ జోన్ లో కట్టడాలు చేపట్టిన బడాబాబులందరూ కచ్చితంగా చెరువు పునర్నిర్మాణానికి ఇప్పటివరకు వారికి వచ్చిన ఆదాయంలో ప్రభుత్వానికి కొంత చెల్లించవలసిన అవసరం ఉందన్నారు, బఫర్ జోన్ లో ఎటువంటి కట్టడాలకు అనుమతులు లేకున్నా వాటికి పర్మిషన్లు ఇచ్చిన అధికారులు ఆ శాఖ బాధ్యులైన మంత్రులను కూడా వదిలిపెట్టకుండా కచ్చితంగా కేసులు పెట్టాలని డిమాండ్ చేసారు.ఎమ్మెల్సీ కవిత బెయిల్ అంశాన్ని రాజకీయం చేస్తున్నారని, ఆడబిడ్డ అని కూడా చూడకుండా కక్ష సాధింపుతో వెంటపడి, వేధింపులకు గురిచేయడం తగదని కూనంనేని అన్నారు. కవితపై వచ్చిన ఆరోపణల విషయంలో కోర్టు నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా తప్పు చేస్తే, ప్రజల సమస్యలను పరిష్కరించుకుంటే కమ్యూనిస్టు పార్టీ రోడ్లపైకి వచ్చి పోరాటం చేస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం ఉంటే భావసారూప్యత కలిగిన పార్టీలతో కలిసి పోటీ చేస్తామని, లేదంటే కమ్యూనిస్టు పార్టీకి బలమున్న ప్రతిచోట సొంతంగా నే పోటీ చేస్తామని కూనంనేని సాంబశివరావు ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మిత్రధర్మాన్ని పాటించి కమ్యూనిస్టు పార్టీకి హామీ ఇచ్చిన పదవులు ఇవ్వాలని కూనంనేని మరో ప్రశ్నకు జవాబు ఇచ్చారుఅప్పటి మంత్రులు, అధికారులపై కేసులు పెట్టాలి బఫర్ జోన్ ఎలాంటి కట్టడాలకు అనుమతులు ఇవ్వబోరని, అయినప్పటికీ వాటికి అనుమతులు ఇచ్చిన అధికారులు, ఆ శాఖలకు బాధ్యులైన మంత్రులను కూడా వదిలిపెట్టకుండా కచ్చితంగా కేసులు పెట్టాలని సాంబ శివరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. తెలంగాణ విముక్తి దినోత్సవం సందర్భంగా అమరవీరులను స్మరిస్తూ సెప్టెంబర్ 11 నుండి 17 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతు రుణమాఫీపై స్పష్ట త లేదని, ఇప్పటి వరకు ప్రభుత్వం ఎంతవరకు రుణమాఫీ చేసింది, ఇంకా ఎంత మందికి చేయాల్సి ఉన్నదో అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇంత వరకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ జరిగిందని వ్యవసాయ శాఖ బాధ్యులు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారని, ప్రభుత్వ లక్షం ప్రకారం రూ.31 వేల కోట్లు కాకుండా, పాత లెక్కల ప్రకారం రూ.40 వేల కోట్లు అవసరం అవుతుందన్నారు. సీపీఐ జాతీయ నాయకులు పల్లా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్ళపల్లి శ్రీనివాస్, బాల మల్లేశ్ పాల్గొన్నారు.




# గంజాయి రహిత సమాజానికి కృషి చేద్దాం

## ప్రజల భాగస్వామ్యంతోనే గంజాయి నిర్మూలన: ఎంపీడీవో సుజాత



**విశ్వంభర, చింతపల్లి:** ప్రజల భాగస్వామ్యంతోనే గంజాయి నిర్మూలన సాధ్యం అని, గంజాయి రహిత సమాజానికి కృషి చేద్దామని ఎంపీడీవో సి.సుజాత అన్నారు. కలెక్టర్ ఆదేశనుసారం గంజాయి నిర్మూలనపై ఎంపీడీవో సుజాత ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ శాఖలతో కలిసి బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ, మానవహారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాంపల్లి సర్కిల్ సీఐ నవీన్ కుమార్, చింతపల్లి ఎస్ఐ యాదయ్య హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిని నిర్మూలించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందన్నారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి సారించాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించినా, సాగు, రవాణా చేసినా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. గంజాయి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని పేర్కొన్నారు. గంజాయి రహిత జిల్లాగా కృషి చేసేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని పేర్కొన్నారు. యువతే దేశ భవిష్యత్తు అని, మత్తు మహమ్మారిలో పడి యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. చేయి చేయి కలుపుదాం మత్తును నిర్మూలిద్దామనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకొని మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఎవరైనా గంజాయిని, డ్రగ్స్ ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, జాగ్రత్తగా ఉండి సమాచారం అందించాలని వారు కోరారు. గంజాయిరహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుటకు కృషిచేయాలన్నారు. ప్రభుత్వశాఖలఅధికారులు పాల్గొన్నారు.

# పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌ని సందర్శించిన రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు



**విశ్వంభర, ఘట్కేసర్ :** మేడ్చల్ జిల్లా, పోచారం మున్సిపల్, ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ను బుధవారం రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు సందర్శించారు. భద్రతల పరిరక్షణలో భాగంగా వివిధ పోలీసు స్టేషన్లలో అధికారులు, సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలు, స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. సమస్యాత్మక ప్రాంతాలలో సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ చక్రపాణి, పోచారం ఐటికారిడార్ సీఐ బి. రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రుణమాఫీ కోసం గ్రామాల్లో సర్వే



**విశ్వంభర, చింతపల్లి:** రేషన్ కార్డు లేక పంట రుణం మాఫీ కానీ రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి శ్రావణ కుమారి తెలిపారు. మండల పరిధిలోని వర్కాల గ్రామంలో బుధవారం రైతు రుణమాఫీ కుటుంబ నిర్ధారణసర్వే షెడ్యూల్ సదస్సును నిర్వహించారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ కొరకు కుటుంబ సభ్యుల నిర్ధారణ యాప్ ద్వారా వివరాలు నమోదు చేయబడతాయని ఆమె తెలిపారు. ఆయా గ్రామాల్లో నిర్దేశించిన తేదీల్లో రైతు కుటుంబ సభ్యులందరీ ఆధార్ కార్డుల వివరాలు వ్యవసాయ అధికారులకు అందించాలని ఆమె సూచించారు. మండలంలో బుధవారం నుంచి సెప్టెంబర్ 19వ తేదీ వరకు ఆయా గ్రామాల వారీగా రైతు రుణమాఫీ సర్వే చేయబడుతుందని తెలిపారు. అదేవిధంగా చింతపల్లి మండలంలోని రైతులు వేరే మండల పరిధిలోని బ్యాంకులలో పంట రుణం తీసుకున్న మండలాధికారులకు సంప్రదించాలన్నారు. ఫ్యామిలీ గ్రూపింగ్ కోసం వచ్చే రైతులు ఫ్యామిలీ మెంబర్స్ అందరు ఆధార్ కార్డ్స్ తీస్కుని రావాలని సూచించారు. రేషన్ కార్డు లేక రుణమాఫీ కానీ రైతులందరూ గ్రామాల్లో నిర్దేశించిన తేదీల్లో వ్యవసాయ అధికారులను కలవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నరసింహ, మౌనిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పూసల సంఘం పోచమ్మ బోనాలు



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు మండల కేంద్రంలో పూసల సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘ సేవకులు మెడికల్ పాపిశెట్టి రాము హాజరై బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పూసల వెంకటేష్, సత్యం, భాస్కర్, అంజి, మోహన్, రాము, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

## తెలంగాణ సోషల్ వెల్ఫేర్ సంస్థ సెక్రెటరీ అలుగు వర్షిని



**విశ్వంభర, వికారాబాద్ :** పిల్లలు బాగా చదువు కొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ సంస్థ సెక్రటరీ అలుగు వర్షిణి అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా కొత్త గడి ప్రభుత్వ సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాల వసతి గృహాన్ని కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని వంటగది, స్టోర్ రూమ్, పిల్లల విశ్రాంతి గదులను, హాజరు రిజిస్టర్, స్టాక్ నిల్వలు పరిశీలించారు. వంటగదిని పరిశీలించి పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా.. అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా భోజనం తిని బాగుందని ప్రశంసశించారు. తెలుగు అకాడమీ ఇంటర్మీడియట్ టెక్స్ట్ బుక్స్ పంపిణీని పర్యవేచ్చించారు. పిల్లల గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పిల్లల డార్మిటరీ రూమ్ లను పరిశీలించి, మంచాలు రెండు భాగాలుగా చేసి పిల్లలకు గాలి, వెలుతురు వచ్చే టట్లు ఏర్పాటు చేయాలన్నారు.విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ విద్య అత్యంత శక్తివంతమైన ఆయుధమని దానికి ప్రపంచాన్ని మార్చే శక్తి ఉందని విద్యార్థులు బాగా చదివి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. సెప్టిక్ ట్యాంక్ క్లియరెన్స్ కోసం బడ్జెట్ అంచనా రిపోర్ట్ పంపించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీఓ సాయిలత, అడిషనల్ సెక్రటరీ హనుమంతు నాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



**విశ్వంభర, వనపర్తి:** వనపర్తి డిపో చెందిన TS32T5577 ఆర్టీసీ బస్సు వనపర్తి వెళ్తుండగా వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామం స్టేజి వద్ద పాము రెడ్డి పల్లి గ్రామానికి చెందిన బోయ అశోక్, బోయ చందు TS07EF454528 ద్విచక్ర వాహనంపై ఆర్టీసీ బస్సును ఢీ కొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. అతివేగంతో వెళ్తున్న ద్విచక్రవాహనం వల్లే ప్రమాదం జరిగిందని అక్కడున్న ప్రజలు అంటున్నారు.

# రాష్ట్ర సేవాలాల్ సేన ప్రమాణ స్వీకారం



**విశ్వంభర, జనగాం:** జనగాం జిల్లా కేంద్రంలోని కెమిస్ట్రీ భవన్‌లో రాష్ట్ర సేవాలాల్ సేన ప్రమాణ స్వీకార సన్మాన మహోత్సవ సంకల్ప సభ ను జనగాం జిల్లా అధ్యక్షుడు శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరిజనుల ముద్దుబిడ్డ రంగారెడ్డి జిల్లా కర్తాల్ మండలానికి చెందిన జర్పుల లక్పతి నాయక్ సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శిగా ప్రమాణస్వీకారం చేశారు. జాతీయ అధ్యక్షులు చిన్న బాబు నాయక్, రాష్ట్ర అధ్యక్షులు ఆంగోత్ రాంబాబు, సేవాలాల్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి నాయక్, సంస్కృతి అధ్యక్షుడు భీమ నాయక్, నరేష్ నాయక్ పాల్గొన్నారు.

# నాగార్జున సాగర్‌కు భారీగా వరద

## 16 గేట్లు ఎత్తిన అధికారులు

**విశ్వంభర, నాగార్జున సాగర్:** నాగార్జునసాగర్ జలాశయానికి నీటిప్రవాహం కొనసాగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి సాగర్ కు వరద వస్తుండటంతో అధికారులు డ్యామ్ 16 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయానికి 1,78,983 క్యూసెక్కుల ఇన్, ఔట్ఫ్లో ఉంది. నాగార్జునసాగర్ ప్రస్తుత, పూర్తి నీటిమట్టం 590 అడుగులుగా ఉండగా.. జలాశయం ప్రస్తుత, పూర్తి నీటినిల్వ 312.50 టీఎంసీలుగా ఉంది

# కాంగ్రెస్ ప్రజలను మభ్యపెడుతుంది



**విశ్వంభర, మేడ్చల్:** కాంగ్రెస్ ప్రభుత్వం పూటకు ఒక మాట మాట్లాడుతూ ప్రజలను మభ్యపెడుతుందని, వాక్స్ బోర్డు సమస్యపై ఇచ్చిన హామీనీ ఎందుకు ముఖ్యమంత్రి దృష్టికి కాంగ్రెస్ నాయకులు ఎందుకు తీసుకెళ్లలేదు అని బిజెపి నాయకులు ప్రశ్నించారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్19వ డివిజన్ కార్పొరేటర్, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి పవన్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు గోనే శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం బోడుప్పల్ లోని 7 వేల కుటుంబాలను, జనాలను మోసం చేస్తున్నారంటూ ఆరోపించారు. 2003 అసెంబ్లీ ఎన్నికల్లో జవహార్ నగర్ ఎన్నికల సభలో నాటి పీసీసీ అధ్యక్షుడు, నేటి ముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తే బోడుప్పల్లో ఏడు వేల కుటుంబాలు ఎదుర్కొంటున్న వక్ఫ్ బోర్డ్ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా.. ఇప్పటివరకు ఎలాంటి సమస్య తీర్చలేదు ఎందుకని వారు ప్రశ్నించారు. వాక్ బోర్డ్ సమస్యను పరిష్కరించేందుకు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కానీ కల్లబొల్లి కథలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని, ఇక మీ పాచికలు పారవని జనాలు మీకు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. వక్ఫ్ బోర్డ్ విషయంపై కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా వ్యవహరిస్తుందో మాకు వివరించాలని బిజెపి పార్టీ శ్రేణులు డిమాండ్ చేశారు. అధికారం మీ చేతిలో పెట్టుకొని పరిష్కరించే సత్తా మీలో ఉన్నప్పటికీ కూడా పరిష్కరించకుండా ప్రజలను మభ్యపెడుతున్నారా అని బిజెపి నాయకులు ఎద్దేవా చేశారు. పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టిన వెంటనే వ్యతిరేకించింది కాంగ్రెస్ పార్టీ నాయకులేకదా అని గుర్తుచేశారు.వక్ఫ్ బోర్డు సమస్య కోసం ఏర్పాటు చేసిన బోడుప్పల్ జేఏసీ ఊసరవెల్లి కంటే ఎక్కువ రంగులు మారుస్తూ పరిష్కారం దిశగా కాకుండా గోడమీద పిల్లిలా వ్యవహరిస్తున్నారన్నారు. బిజెపి సీనియర్ నాయకులు, మహిళ నాయకులు పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల మండల కేంద్రంలోని సాయి మందిరంలో శ్రీ లలిత పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమ నిర్వాహకులు దేవాలయాన్ని పచ్చటి తోరణాలు, పూల పందిరులతో ఘనంగా శోభాయమానంగా అలంకరించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా తొలిరోజు బుధవారం ఉదయం గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. ప్రముఖ అన్నమాచార్య సంకీర్తనాచార్యులు, రాష్ట్రపతి సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ దీక్షితుల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నమాచార్య సంకీర్తన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం దీక్షితుల సుబ్రహ్మణ్యంని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు, కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జ్ఞాన ప్రసూనాంబ శర్మ రాఘవేందర్, మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, స్త్రీ శక్తి లలితాంబిక భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి బాధ్యతలు చేపట్టిన బోనాల కిషన్ బుధవారం జిల్లా ఎస్పీ కిరణ్ ఖరేను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. బాధ్యతలు స్వీకరించిన బోనాల కిషన్‌కు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



# వారిది జిన్నా ఆత్మ

## కాంగ్రెస్, ఎస్పీపై భగ్గుమన్న యోగి ఆదిత్యానాథ్

**లక్నో:** కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ లక్ష్యంగా యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎస్పీ చీఫ్‌కు మన ఆడబిడ్డల భద్రత గురించి ప్రశ్నించే నైతిక హక్కు లేదని దుయ్యబట్టారు. కోల్‌కతాలో యువ వైద్యురాలిపై దురదృష్టకర ఘటన జరిగితే దేశమంతా గళం విప్పారని, కానీ ఎస్పీ చీఫ్ నిస్సిగ్గుగా నిందితుడిని సమర్థించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, ఎస్పీలది జిన్నా ఆత్మ అని ఆరోపించారు.జిన్నా దేశాన్ని విడదీస్తే కాంగ్రెస్, ఎస్పీలు ఇవాళ అదే పనిచేస్తున్నాయని మండిపడ్డారు. కాగా, కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో ట్రైనీ వైద్యురాలి హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా దుమారం రేపింది. ఈ హేయమైన ఘటనపై విచారం వ్యక్తం చేస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కోల్‌కతా ఘటనపై దేశం దిగ్భ్రాంతికి లోనయిందని, ఈ ఘటన గురించి వినగానే తాను కంపించిపోయానని అన్నారు.

మహిళలపై ఈ తరహా నేరాలు పెరిగిపోవడం తనను తీవ్రంగా కలిచివేసిందని అన్నారు. విద్యార్థినులు, డాక్టర్లు, పౌరులు కోల్‌కతాలో నిరసనలు కొనసాగుతుండగానే మహిళలపై నేరాలు పెరుగుతుండటం ఆందోళనకరమని చెప్పారు. చిన్నారులు సైతం బాధితుల్లో ఉండటం దిగ్భ్రాంతికరమని అన్నారు. కూతుళ్లు, అక్కాచెల్లెళ్లపై ఇలాంటి వేధింపులు జరగడం ఏ నాగరిక సమాజం అనుమతించబోదని ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు.

# డీఎంకే ఎంపీకి షాక్ ఇచ్చిన ఈడీ రూ.908కోట్ల భారీ జరిమానా..!



**చెన్నై:** తమిళనాడుకు చెందిన అధికార పార్టీకి ఎంపీకి ఈడీ భారీ షాక్ ఇచ్చింది. ఆయన, కుటుంబీకులకు భారీగా జరిమానా విధించింది. విదేశీ మారకద్రవ్య నిబంధనలను ఉల్లంఘించిన కేసులో డీఎంకే ఎంపీ ఎస్ జగత్రక్షకన్ ఆయన కుటుంబ సభ్యులకు రూ.908కోట్ల జరిమానా విధించినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బుధవారం తెలిపింది. విదేశీ మారకద్రవ్య నిర్వహణ చట్టం నిబంధనల ఉల్లంఘన కేసులో ఈ భారీ జరిమానా విధించినట్లు ఈడీ స్పష్టం చేసింది. ఇక ఫెమా చట్టంలోని 37ఏ సెక్షన్ ప్రకారం 2020 సెప్టెంబర్‌లో సీజ్ చేసిన రూ.89.19 కోట్ల మొత్తాన్ని జప్తు చేసినట్లు ఈడీ తెలిపింది.

ఫెమాలో చట్టంలోని సెక్షన్ 37ఏ ప్రకారం 2020లో సీజ్ చేసిన రూ.89.19 కోట్లను జప్తు చేయాలని.. రూ.908 కోట్లు జరిమానా విధించాలని ఆదేశించింది. ఆగస్ట్ 26న వెల్లడించిన తీర్పు ప్రకారం ఈ జరిమానా విధించినట్లు ఈడీ తెలిపింది. జగత్రక్షకన్ అరక్కోణం లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా కొనసాగుతున్నారు. 2021 డిసెంబర్ 1న, డీఎంకే ఎంపీ జగత్రక్షకన్, ఆయన కుటుంబ సభ్యులు సంబంధిత కంపెనీపై ఫెమాలోని సెక్షన్ 16 కింద నిబంధనలను ఉల్లంఘించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఫెమా నిబంధనలను ఉల్లంఘించి 2017లో సింగపూర్‌లోని షెల్ కంపెనీలో రూ.42 కోట్ల పెట్టుబడి పెట్టారని విచారణలో తేలింది. ఈ క్రమంలో ఈడీ చర్యలకు ఉపక్రమించింది.

# 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర

**దిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన గురువారం జరిగిన కేంద్ర క్యాబినెట్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తెలుగు రాష్ట్రాలు సహా దేశవ్యాప్తంగా 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలకు కేంద్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. ఏపీ, తెలంగాణ, బిహార్, పంజాబ్‌లో 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలను అభివృద్ధి చేస్తారు. తెలంగాణలోని జహీరాబాద్‌లో 3245 ఎకరాల్లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీని అభివృద్ధి చేస్తారు. ఏపీలోని ఓర్వకల్లు, కొప్పర్తిలో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు కొలువుతీరనున్నాయి.

ఓర్వకల్లులో 2621 ఎకరాల్లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ఏర్పాటు కానుంది. ఇక క్యాబినెట్ భేటీ అనంతరం కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద దేశవ్యాప్తంగా 12 ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలకు క్యాబినెట్ ఆమోద ముద్ర వేసిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ. 28602 కోట్లను వెచ్చించనుంది. ఈ ప్రాజెక్టుల ద్వారా ఏకంగా రూ. 1.5 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించవచ్చని కేంద్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ ప్రాజెక్టుతో పది లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు, 30 లక్షల పరోక్ష ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని అశ్వనీ వైష్ణవ్ పేర్కొన్నారు. ఈ కారిడార్లలో ప్లగ్ అండ్ ప్లే, వాక్ టూ వర్క్ కాన్సెప్ట్ పై దృష్టి సారిస్తున్నామని తెలిపారు. మరోవైపు పోలవరం నిధులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందని పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఏపీ అభివృద్ధికి కేంద్రం కట్టుబడిఉందనేందుకు ఈ నిర్ణయమే ఓ సంకేతమని ఆయన పేర్కొన్నారు. ఇక కూటమిలోకి చేరికలపై రామ్మోహన్ కీలక వ్యాఖ్యలు చేశారు. కూటమిలోకి ఎవరు వచ్చినా పదవికి రాజీనామా చేసి రావాలని చెప్పారు.

# రైల్వే అంశాలు రాజకీయాలకు అతీతం

### అశ్వినీ వైష్ణవ్



**దిల్లీ:** ఇటీవల వరుసగా చోటుచేసుకున్న రైల్వే ప్రమాదాలపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందించారు. రైల్వేలను రాజకీయాలకు అతీతంగా ఉంచాలన్నారు. కొన్ని ఘటనల్లో కలవరపెట్టే అంశాలు వెలుగులోకి వచ్చాయని వెల్లడించారు. బుధవారం ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడారు.'రైల్వే ప్రమాదాలు అనేది చాలా సున్నితమైన విషయం. కొన్ని ఘటనల్లో కలవరపెట్టే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. అటువంటి అంశాలను తీవ్రంగా పరిగణించాలి. అన్ని ఘటనలపై రైల్వేశాఖ విచారణ చేస్తోంది. అదేవిధంగా రైల్వే అంశాలను రాజకీయాలకు అతీతంగా ఉంచాలి. దేశ జీవనాధారానికి ఏదైన ప్రతికూలతలు ఉంటే అందరం కలిసి నిలబడాలి. రైల్వే సమర్థవంతంగా పనిచేసేందుకు కృషి చేయాలి' అని ఆయన పేర్కొన్నారు.ఇటీవల అహ్మదాబాద్ వెళ్తున్న సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైలు కాన్పూర్ భీమ్సేన్ రైల్వే స్టేషన్ల వద్ద తక్కువ వేగంతో వెళ్తున్నప్పుడు 20 పెట్టెలు పట్టాలు తప్పాయి. అయితే పట్టాలపై ఉన్న పెద్ద బండరాయి వంటిదాన్ని రైలు ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. ఇక, మధ్యప్రదేశ్లోని జబల్పూర్ డివిజన్లోని రైల్వే స్టేషన్కు సమీపంలో రైలు ఇనుప రాడ్డును ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదాలపై విచారణ కొనసాగుతోంది.

## శివాజీ విగ్రహం కూలిన ఘటనకు

# షిండే సర్కార్ బాధ్యత వహించాలి

### శరద్ పవార్



**ముంబయి:** మహారాష్ట్రలోని సింధ్‌దుర్గ్‌లో శివాజీ మహరాజ్ విగ్రహం నేలకూలిన ఘటన దుమారం రేపుతోంది. విగ్రహం కూలిన ఘటనపై విపక్ష నేతలు ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. ఈ ఘటనలో రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పించుకోలేదని ఎన్సీపీఎస్పీపీ చీఫ్ శరద్ పవార్ అన్నారు. ఎక్కడైనా విగ్రహ నిర్మాణం చేపడితే రాష్ట్ర ప్రభుత్వ అధికారుల నుంచి నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.ఈ ఘటనకు షిండే సర్కార్ పూర్తి బాధ్యత వహించాలని పేర్కొన్నారు. కాగా, ఛత్రపతి శివాజీ విగ్రహం కూలిన ఘటనపై ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వాన్ని శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే తప్పుపట్టారు. రాష్ట్రంలో మహిళలపై వేధింపుల ఘటనలపై కూడా షిండే సర్కార్‌పై ఠాక్రే విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో మహిళలపై వేధింపులు, అవినీతి వ్యవహారాలు అదుపు తప్పాయని ఆరోపించారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహం ఎలా కుప్పకూలిందో రెండ్రోజుల కిందట ప్రజలు చూశారని, దీనిపై పాలకులు ఎలాంటి ప్రకటనలు చేస్తున్నారో గమనిస్తున్నారని అన్నారు.బలమైన గాలుల కారణంగా విగ్రహం నేలకొరిగిందని వారు చెబుతున్నారని, ఇది ఎలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. గాలులు ఉధృతంగా వీచడంతో విగ్రహం కూలి దెబ్బతిన్నదని మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే చెబుతున్నారని అన్నారు. మహారాష్ట్రలోని సింధుదుర్గ్‌లో 35 అడుగుల శివాజీ విగ్రహం నేలకూలడం రాష్ట్రంలో రాజకీయ దుమారం రేపుతోంది. ఈ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని విపక్షాలు భగ్గుమన్నాయి.

# గుజరాత్ ను ముంచెత్తుతున్న వర్షా లు..

## 26కు చేరిన మరణాలు



**అహ్మదాబాద్:** గుజరాత్ ను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. గడిచిన మూడు రోజులుగా కురుస్తోన్న వర్షాలకు అనేక ప్రాంతాలు వరదల్లో చిక్కుకుపోయాయి. తాజాగా మోర్బీ జిల్లాలోని ధావనా గ్రామంలో వరద నీటిలో ఓ ట్రాక్టర్ కొట్టుకుపోయింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో మూడు రోజులుగా వర్షాలతో చోటుచేసుకున్న ఘటనల్లో మృతుల సంఖ్య 26కు చేరింది. వడోదరలో వర్షం తెరిపిచ్చినప్పటికీ విశ్వామిత్ర నది పొంగి పొర్లుతుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రభావిత ప్రాంతాల నుంచి 17 వేల మంది సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరదల నేపథ్యంలో ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్కు ప్రధాని మోదీ ఫోన్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీసిన ప్రధాని మోదీ.. ప్రకృతి విపత్తును ఎదుర్కోవడంలో రాష్ట్రానికి అవసరమైన సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. సౌరాష్ట్రలోని దేవభూమి ద్వారకా, జామ్నగర్, రాజ్కోట్, పోరుబందర్లలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. 12 గంటల వ్యవధిలోనే 5 నుంచి 20సెం.మీ వర్షపాతం నమోదైంది. దేవభూమి ద్వారకాలో బుధవారం అత్యధికంగా 18 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

# మీడియా మైక్ లాక్కున్న నారాయణ్ రాణే

## ఆదిత్య ఠాక్రే మద్దతుదారులకు వార్నింగ్





**ముంబయి:** మహారాష్ట్ర మాజీ సీఎం, బీజేపీ ఎంపీ నారాయణ్ రాణే ఆగ్రహంతో ఊగిపోయారు. మీడియా ప్రతినిధి నుంచి మైక్ లాక్కున్నారు. అలాగే ఆదిత్య ఠాక్రే మద్దతుదారులకు ఆయన వార్నింగ్ ఇచ్చారు. ఈ వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సింధుదుర్గ్ జిల్లా మాల్వాన్‌లోని రాజ్‌కోట్ కోటలో ఏర్పాటు చేసిన భారీ ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం కూలిన ప్రదేశాన్ని నారాయణ్ రాణే బుధవారం సందర్శించారు. అదే సమయంలో శివసేన (యూబీటీ) ఎమ్మెల్యే ఆదిత్య ఠాక్రే కూడా అక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా రాణే, ఆదిత్య ఠాక్రే మద్దతుదారులు వ్యతిరేక నినాదాలు చేసుకుని ఘర్షణకు దిగారు. ఈ నేపథ్యంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితికి దారి తీసింది.కాగా, ఈ గందరగోళాన్ని ఆపాలని పోలీసులతో రాణే అన్నారు. తనకు అనుమతి ఇచ్చిన సమయంలోనే ఆదిత్య ఠాక్రేకు ఎలా అనుమతి ఇచ్చారని పోలీస్ అధికారులను ఆయన ప్రశ్నించారు. అలాగే దమ్ముంటే తనపై దాడి చేయాలని ఆదిత్య మద్దతుదారులకు సవాల్ చేశారు. అలా చేస్తే తాను ప్రతీకారం తీర్చుకుంటానని, ఎవరినీ విడిచిపెట్టబోనని బెదిరించారు. ఆదిత్య ఠాక్రే మద్దతుదారులను గదిలో బంధించి చంపేస్తానని రాణే వార్నింగ్ ఇచ్చారు. అలాగే తన సందర్శనను ప్రశ్నించిన మీడియా ప్రతినిధి నుంచి మైక్ లాక్కొనేందుకు ఆయన ప్రయత్నించారు. ఈ వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# రేపిస్టులకు మరణశిక్ష.. 10 రోజుల్లో బిల్లు

### మమతా బెనర్జీ



**కోల్‌కతా:** కోల్‌కతాలో వైద్యురాలి అత్యాచారం ఘటన నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రేపిస్టులకు కఠినమైన శిక్షను విధించాలని సీఎం మమతా బెనర్జీ తెలిపారు. దీని కోసం వచ్చే వారం అసెంబ్లీ సమావేశాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆ సమావేశాల్లో బిల్లును పాస్ చేస్తామని, రేపిస్టులకు మరణశిక్ష పడేలా ఆ బిల్లును రూపొందిస్తున్నట్లు దీదీ తెలిపారు. ఆ బిల్లును గవర్నర్‌కు పంపిస్తామని, ఒకవేళ గవర్నర్ బిల్లును ఆమోదించకుంటే, అప్పుడు తాము రాజ్‌భవన్ ఎదుట ధర్నా చేయనున్నట్లు మమతా బెనర్జీ వెల్లడించారు. ఇలాంటి బిల్లును గవర్నర్ పాస్ చేయాల్సిందే అని, ఇలాంటి వాటి నుంచి తప్పించుకోలేరని ఆమె చెప్పారు.ట్రైనీ వైద్యురాలి రేప్, మర్డర్ కేసును .. ప్రస్తుతం సీబీఐ విచారిస్తున్నది. అయితే ఆ కేసును సీబీఐ టేకోవర్ చేసుకుని 16 రోజులు అవుతోందని, న్యాయం జరగలేదని మమతా బెనర్జీ ఆరోపించారు. తృణమూల్ పార్టీ స్టూడెంట్ వింగ్ వ్యవస్థాపక వేడుకలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. కేసును ఛేధించేందుకు అయిదు రోజుల సమయం అడిగానని,కానీ ఆ కేసును సీబీఐకి అప్పగించినట్లు చెప్పారు. న్యాయం కావాలని వాళ్లకు లేదని, కేసును జాప్యం చేయాలని చూస్తున్నారని, ఇప్పటికే 16 రోజులైందని, ఇక న్యాయం ఎక్కడ ఉందని ఆమె అడిగారు.

# 30న బీజేపీలో చేరుతున్నా : చంపై సోరెన్




**రాంచీ:** బీజేపీలో చేరికపై జార్ఖండ్ మాజీ సీఎం చంపై సోరెన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తదుపరి కార్యాచరణపై తాము ఇంకా చర్చించలేదని, తాను ఈ నెల 30న బీజేపీలో చేరుతున్నానని చెప్పారు. చంపై సోరెన్ బుధవారం రాంచీలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. పార్టీ తనకు ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వర్తిస్తానని అన్నారు.గిరిజనుల సంక్షేమంతో పాటు జార్ఖండ్ ప్రజల అభివృద్ధికి పాటుపడతామని చెప్పారు. బంగ్లాదేశ్ చొరబాట్లతో ప్రమాదంలో పడిన గిరిజనులకు బాసటగా నిలుస్తామని స్పష్టం చేశారు. తాను ఎంతో కష్టపడి ఈస్థాయికి చేరుకున్నానని, జార్ఖండ్ అభివృద్ధితో పాటు గిరిజనుల ఉనికిని కాపాడేందుకే తాను కాషాయ పార్టీలో చేరుతున్నానని చంపై సోరెన్ వెల్లడించారు. కాగా, చంపై సోరెన్ బీజేపీలో చేరికపై జార్ఖండ్ బీజేపీ చీఫ్ బాబూలాల్ మరాండీ స్పందించారు.

చంపై సోరెన్‌పై జార్ఖండ్ సర్కార్ నిఘా వేయడం సరైంది కాదని దుయ్యబట్టారు. మాజీ సీఎంపై గూఢచర్యం ప్రయోగించి ఉండాల్సింది కాదని అన్నారు. హనీ ట్రాప్‌నకు కూడా సన్నాహాలు జరిగాయని తమకు సమాచారం అందిందని, ఈ వ్యవహారం అంతటిపై సిట్టింగ్ హైకోర్టు జడ్జిచే విచారణ జరిపించాలని బాబూలాల్ మరాండీ డిమాండ్ చేశారు. చంపై సోరెన్‌కు బీజేపీలో సముచిత స్థానం లభిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.



# కంగనా దిష్టి బొమ్మతో రైతుల నిరసన

**లక్నో:** నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, రైతుల నిరసనపై చేసిన వ్యాఖ్యలపై రైతు సంఘాలు మండిపడ్డాయి. ఆమె దిష్టి బొమ్మతో నిరసన చేసేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు ఆ దిష్టి బొమ్మను లాక్కోవడంతో ఇరు వర్గాల మధ్య పెనుగులాట జరిగింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్‌లో ఈ సంఘటన జరిగింది. రైతులపై కంగనా రనౌత్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా భారతీయ కిసాన్ యూనియన్ (లోఖిత్) జాయింట్ కిసాన్ మోర్చా సభ్యులు ఆమె దిష్టి బొమ్మతో నిరసన తెలిపి దహనం చేసేందుకు ప్రయత్నించారు. అయితే కారు నుంచి బయటకు తీసిన దిష్టి బొమ్మను పోలీసులు లాక్కున్నారు. ఈ సందర్భంగా నిరసనకారులు, పోలీసుల మధ్య పెనుగులాట జరిగింది.

కాగా, పోలీసుల తీరుపై రైతు నాయకులు మండిపడ్డారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు లాక్కొన్న కంగనా దిష్టి బొమ్మను తిరిగి ఇవ్వాలని పట్టుబట్టారు. అలాగే రైతులకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన ఆమెపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మరో దిష్టి బొమ్మతో నిరసన కొనసాగించారు. ఈ నేపథ్యంలో హాపూర్‌లోని ఢిల్లీలక్నో రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మరోవైపు దిష్టి బొమ్మ కోసం రైతులు, పోలీసుల మధ్య జరిగిన పెనుగులాట వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# యుద్ధాలతో పోలిస్తే.. రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మరణాలు: గడ్కరీ




**దిల్లీ:** యుద్ధాలు, ఉగ్రవాదం, నక్సలిజం ఘటనల్లో మరణాల కంటే రోడ్డు ప్రమాదాల్లోనే మృతుల సంఖ్య ఎక్కువగా ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. దేశంలో ఏటా లక్షల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్న ఆయన.. రోడ్డు ఇంజినీరింగ్లో లోపాల కారణంగానూ అనేక యాక్సిడెంట్లు జరుగుతున్నాయన్నారు. ఫిక్కీ రోడ్ సేఫ్టీ అవార్డ్స్, కాంక్లేవ్ 2024లో పాల్గొన్న గడ్కరీ ఈ విధంగా వ్యాఖ్యానించారు."యుద్ధాలు, ఉగ్రవాదం, నక్సలిజం ఘటనల్లో కంటే రోడ్డు ప్రమాదాల్లోనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలో ఏటా 5 లక్షల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. 1.5 లక్షల మంది మరణిస్తున్నారు. మూడు లక్షల మంది గాయపడుతున్నారు. తద్వారా దేశ జీడీపీకి 3శాతం నష్టం వాటిల్లుతోంది. రోడ్డు ప్రమాదాలకు డ్రైవర్లను బలిపశువులను చేస్తారు.. కానీ, రోడ్డు ఇంజినీరింగ్ లోనూ (డీపీఆర్) లోపాలున్నాయి" అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.దేశంలోని అన్ని హైవేలకు సేఫ్టీ ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించాలంటే.. లైనులో వెళ్లే క్రమశిక్షణ పాటించాలన్నారు. అంబులెన్సులు, వాటి డ్రైవర్లకు ప్రత్యేక కోడ్లను ఇచ్చేందుకు తమ మంత్రిత్వశాఖ సిద్ధమవుతోందని అన్నారు. రోడ్డు ప్రమాదాల సమయంలో బాధితులను రక్షించేందుకు వేగంగా స్పందించడంతోపాటు.. కట్టర్ల వంటి అధునాతన పనిముట్లను వాడకంలో వారికి శిక్షణ ఇస్తామన్నారు.

# మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ సభ్యత్వాన్ని సస్పెండ్ చేసిన ఐఎంఏ



**దిల్లీ:** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కీలక నిర్ణయం తీసుకున్నది. కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్ ఘోష్ సభ్యత్వాన్ని సస్పెండ్ చేసింది. ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్యపై వైద్యుల సంఘం క్రమశిక్షణా కమిటీ సిఫార్సు మేరకు ఈ చర్యలు చేపట్టింది. బాధితురాలి తల్లిదండ్రుల మనోవేదనను అర్థం చేసుకోలేకపోవడం, సమస్యను సముచితంగా ఎదుర్కోలేకపోవడం, పరిస్థితి పట్ల సానుభూతి, సున్నితత్వం లేకపోవడం వల్ల మీకు వ్యతిరేకంగా ఈ చర్య చేపట్టినట్లు సస్పెన్షన్ ఆర్డర్‌లో పేర్కొంది. కాగా, బెంగాల్ శాఖతో పాటు కొన్ని వైద్యుల సంఘాలు ఘోష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినట్లు ఐఎంఏ తెలిపింది. 'ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యత్వం నుంచి మిమ్మల్ని తక్షణమే సస్పెండ్ చేయాలని ఐఎంఏ ప్రధాన కార్యాలయం క్రమశిక్షణా కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించింది' అని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

మరోవైపు ఆగస్ట్ 9న ఆర్జీ కర్ ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలి హత్యాచారం కేసులో సందీప్ ఘోష్ తీవ్ర ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ఆగస్టు 12న ప్రిన్సిపాల్ పదవికి ఆయన రాజీనామా చేశారు. అయితే వెంటనే మరో మెడికల్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా ఆయన నియమితులయ్యారు. దీంతో సందీప్ ఘోష్‌పై పలు అనుమానాలు రేకెత్తాయి. వైద్యురాలి హత్యాచార కేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ ఆయనను అరెస్ట్ చేయడంతో పాటు పాలిగ్రాఫ్ టెస్ట్ నిర్వహించింది. అలాగే ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో సందీప్ ఘోష్ ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై కూడా సీబీఐ దర్యాప్తు చేస్తున్నది.

# రివర్స్ టెండరింగ్ విధానం రద్దు

**విశ్వంభర, అమరావతి:** ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కొనసాగింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన రివర్స్ టెండరింగ్ విధానాన్ని మంత్రివర్గం రద్దు చేసింది. పాత విధానంలోనే టెండర్లు పిలిచే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అబ్కారీ శాఖ పునర్ వ్యవస్థీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ క్రమంలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) రద్దుకు ఆమోదం తెలిపింది.

పట్టాదారు పాసు పుస్తకాలపై జగన్ ఫొటో తొలగించి సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అంగీకారం తెలిపింది. పోలవరం ఎడమ కాలువ పనుల పునరుద్ధరణకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఈ పనుల్లో ప్రస్తుత కాంట్రాక్టున్న సంస్థనే కొనసాగించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివాదాల్లోని భూముల రిజిస్ట్రేషన్ నిలిపివేతకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది.ప్రభుత్వ చిహ్నంతో కొత్తగా 21.86 లక్షల పాస్ పుస్తకాలను ఇచ్చేందుకు కేబినెట్ నిర్ణయించింది. అలాగే గత ప్రభుత్వం 77 లక్షల సర్వేరాళ్లపై ముద్రించిన జగన్ బొమ్మలను చెరిపివేసి వినియోగించుకునేందుకు కూడా ఆమోదం తెలిపింది. రాష్ట్ర మున్సిపల్ శాఖలో 269 సూపర్ న్యూమరీ పోస్టుల భర్తీకి ఏపీ కేబినెట్ పచ్చజెండా ఊపింది. అలాగే రాష్ట్రంలో కొత్తగా 2774 రేషన్ షాపుల ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. కొత్తగా ఏర్పాటు చేసే రేషన్ షాపుల్లో






ఈపీవోస్ మెషిన్లు ఏర్పాటు చేయాలని భావించింది. ఈ ఈపీఓస్ మెషిన్ల కొనుగోలుకు రూ.11.51 కోట్ల నిధులు అవసరమవుతాయని అంచనా వేసింది. కొత్త మద్యం పాలసీని తీసుకొచ్చే అంశాపైనా కేబినెట్ ముందుకు ప్రతిపాదనలు సెబ్‌ను రద్దు చేసి ఎక్సైజ్ శాఖ పునర్వ్యవస్థీకరణ చేయాలని నిర్ణయించింది. ఉచిత ఇసుక విధానాన్ని సులభతరం చేసేందుకు తీసుకునే నిర్ణయాలపైనా కేబినెట్‌లో చర్చించారు. 22 ఏ భూముల వివాదంపై రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని నిర్ణయించింది. అలాగే వివాదాస్పద భూముల రిజిస్ట్రేషన్ల నిలిపివేతకు ఆమోదం తెలిపింది.

రాష్ట్ర కేబినెట్ భేటీలో పలువురు కూటమి ఎమ్మెల్యేల తీరుపై సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. కొంతమంది ఎమ్మెల్యేల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని మండిపడ్డారు. ఈ విషయంలో మంత్రులు ఎమ్మెల్యేలను గైడ్ చేయాలని చంద్రబాబు సూచించారు. ఇద్దరు ,ముగ్గురు ఎమ్మెల్యేలతో మంచిపేరు దెబ్బ తింటోందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. కొందరు ఎమ్మెల్యేల ప్రవర్తన అందరికి చెడ్డపేరు తెస్తోందన్నారు. ఇకనైనా ఆ ఎమ్మెల్యేలు పద్ధతి మార్చుకోవాలని సూచించారు.అయితే ఈ ఎమ్మెల్యేలు ఎవరన్న దానిపై మాత్రం వివరాలు వెల్లడికాలేదు.

మరోవైపు ప్రభుత్వంలో కీలక మైన సమాచారం బయటకు పొక్కడంపైనా కేబినెట్లో సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందులోనూ శ్వేత పత్రాల్లో సమాచారం, ఓటాన్ అకౌంట్ వివరాలు, ఇతర కీలకమైన నిర్ణయాలు బయటకు ఎలా వెళ్లాయయనని బాబు విస్మయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖల్లో వైసీపీ వేగులు ఉన్నారన్న అంశం కేబినెట్ భేటీలో ప్రస్తావనకు వచ్చింది. దీనిపై మంత్రులు కూడా తమ అభిప్రాయాలు చెప్పారు. ఇందులో ప్రభుత్వ శాఖల్లో ప్రక్షాళన అవసరమని కొందరు మంత్రులు సీఎంకు సూచించారు.



## భారీగా గంజాయి పట్టివేత

**విశ్వంభర, హైదరాబాద్ :** అత్తాపూర్ మొగల్ కా నాలా, ధూల్ పేట్ ప్రాంతంలో రూ. 46 లక్షల విలువ చేసే హషీష్ అయిల్, గంజాయిని (Ganja)పట్టుకున్నట్లు ఎక్సైజ్, ఎన్ఫోర్స్‌మెంట్ జాయిట్ కమిషనర్ ఖురేషి తెలిపారు. ఎక్సైజ్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఏపీలోని కడపకు చెందిన సాధిక్ వలీ, రంపచోడ వరానికి చెందిన హరికుమార్, సత్యనారాయణ అనే ముగ్గురు హైదారాబాద్‌కు 4.2కిలోల హషీష్ అయిల్‌ను సరఫరా చేస్తుండగా ఉండగా మొగల్‌కా నాలా వద్ద పట్టుకున్నామని పేర్కొన్నారు. వారిని విచారిస్తున్న క్రమంలో రాజమండ్రిలో మరింతగా గంజాయి ఉన్నట్లు ఇచ్చిన సమాచారం మేరకు ప్రత్యేకంగా ఓ బృందాన్ని పంపించి అక్కడి నుంచి 70.15 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. హషీష్, గంజాయి విలువ రూ. 46 లక్షల మేర ఉంటుందని అంచనా వేశారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

### హైడ్రా కమిషనర్ రంగనాథ్

## రాంనగర్ లో ఆకస్మిక పర్యటన

### నాలాలపై అక్రమ నిర్మాణాల పరిశీలన

**విశ్వంభర; హైదరాబాద్:** హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం సాయంత్రం నగరంలోని ముషీరాబాద్ నియోజకవర్గంలో ఆకస్మికంగా పర్యటించారు. రాంనగర్ చౌరస్తాలోని మణెమ్మ గల్లీలో నాలాపై అక్రమ నిర్మాణాలు చేపట్టారని స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులతో కలిసి పరిశీలించారు. మణెమ్మ గల్లీలో రోడ్డు ఇరుకుగా మారిందని, నాలా, రోడ్డును ఆక్రమించారని స్థానికులు ఫిర్యాదు చేశారు. వర్షం వచ్చిన ప్రతి సారి ఇళ్లలోకి వరదనీరు చేరి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని మహిళలు మొరపెట్టుకున్నారు. నాలా ఆక్రమణ. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారి వివరాలు, సబంధిత స్థల పత్రాలను పరిశీలించాలని జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఒకవైపు హైడ్రా అక్రమ నిర్మాణాలపై విరుచుకుపడుతున్న నేపథ్యంలో హైడ్రా కమిషనర్ నేరుగా రాంనగర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఫిర్యాదుల స్వీకరణకు స్పెషల్ టోల్ ఫ్రీ నంబర్**

ఎవరైనా వ్యక్తులు సంస్థలు చెరువులు, పార్కు స్థలాలు, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే 18005990099 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు సమర్పించవచ్చునని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

## ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అమలు చేయాలి

### మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ డిమాండ్




**విశ్వంభర, హైదరాబాద్:** ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెరపైకి తెచ్చిన పెన్షన్ స్కీం కాకుండా ఇదివరకే కొనసాగించిన పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఐఎన్‌టీయూసీ గుర్తింపు పొందిన మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ డిమాండ్ చేశారు. ఓల్డ్ పెన్షన్ స్కీమ్ స్థానంలో యూనిఫైడ్ పెన్షన్ స్కీంను కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ ఆమోదించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన వెల్లడించారు. యూపీఎస్ లో కేంద్ర మంత్రివర్గం ఆమోదించడానికి నిరసిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ మాట్లాడుతూ ఉద్యోగుల నుంచి ఎలాంటి అభిప్రాయాలను సేకరించకుండా కేంద్రం బలవంతంగా యుపిఎస్ ను అమలు చేసేందుకు సిద్ధమైందని, దీనికి వ్యతిరేకంగా మున్ముందు మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షులు జి శ్రీనివాస్, జనరల్ సెక్రెటరీ ఎం రామకృష్ణ, కోశాధికారి రమేష్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ కే శివకుమార్, ఉపాధ్యక్షులు ఏం మోజెస్,మహిళా విభాగం నాయకురాలు ఎల్ మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల

## సమస్యల పరిష్కారానికి కృషి

### - ఎమ్మెల్యే తలసాని




**విశ్వంభర, హైదరాబాద్ :** ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రవీంద్ర భారతిలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నామమాత్రపు ఫీజులతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు సేవలు అందిస్తున్న ఆర్ ఎస్ ఎం ఎ పనితీరు అభినందనీయమన్నారు.ప్రభుత్వ గుర్తింపు పొందిన యాజమాన్యాలు అనేకమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నాయని ప్రశంసించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాలలో సైతం ప్రతిభ చాటాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు.చదువుతో పాటు అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. కాగా, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి.

## దళితులు ఆలయంలోకి ప్రవేశించకుండా అడ్డగింత

### సిద్దిపేట జిల్లాలో ఘటన...కేసు నమోదు

**విశ్వంభర, సిద్దిపేట:** గ్రామ దేవతలకు బోనాలు సమర్పించేందుకు కొందరు దళితులు ఆలయానికి వెళ్లగా, ఇతర కులస్తులు అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్ధిపేట జిల్లా మర్కుక్ మండలంలోని శివారు వెంకటాపూర్‌లో నూతనంగా దుర్గమ్మ ఆలయాన్ని నిర్మించారు. దుర్గామాత ఉత్సవాల్లో భాగంగా బోనాలు చేయడానికి దళితులు ఆలయానికి వెళ్లారు. అక్కడున్న కొందరు వ్యక్తులు దళితులు బోనాలు చేయకూడదని, ఆలయంలోకి ప్రవేశం లేదని అడ్డుకున్నారు. దీంతో తమకు ఆలయ ప్రవేశాన్ని నిరాకరించారని, దళితులమంటూ వివక్ష చూపారని కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు కులవివక్ష చూపిన కొందరిపై కేసు నమోదు చేశామని, గ్రామ పెద్దలకు, ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చామని రూరల్ సీఐ మహేందర్ రెడ్డితెలిపారు.

### పోలవరం ప్రాజెక్టుకు రూ.12,127 కోట్లు ఇచ్చేందుకు

# కేంద్రం అంగీకారం

- కేంద్రం ఇవ్వలేదని ఎప్పుడూ పోలవరం పనులు ఆపలేదు
- కొత్త దయాఫ్రమ్ వాల్ నిర్మిస్తాం..: సీఎం చంద్రబాబు
- ఏపీలో మూడు కారిడార్లు..



విశ్వంభర, అమరావతి: పోలవరం ప్రాజెక్టు. పరిశ్రమలకు సంబంధించి రెండు నోట్స్ను కేంద్రం క్లియర్ చేసింది. కేంద్రం చర్యలతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న నమ్మకం కలుగుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "పోలవరం ప్రాజెక్టుకు రూ.12,127 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించింది. పోలవరాన్ని 2027 మార్చిలోగా పూర్తి చేసేందుకు షెడ్యూల్ ఏర్పాటు చేశారు. పోలవరం విషయంలో ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్కు అభినందనలు. పోలవరానికి కేంద్రం పెండింగ్ నిధులు ఇవ్వాలి. కేంద్రం ఇవ్వలేదని ఎప్పుడూ పోలవరం పనులు ఆపలేదు.

కొత్త దయాఫ్రమ్ వాల్ నిర్మిస్తాం..

2019లో పోలవరం ప్రాజెక్టుకు శనిగ్రహం ఆవరించింది. రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం పనులకు గ్రహణం పట్టింది. 2021 నాటికి పోలవరం పూర్తి చేసి ఉండాలి. వైకాపా హయాంలో కేంద్రం రూ.8వేల కోట్లు ఇచ్చింది, పీపీపీ లేఖ కూడా రాసింది. ఐదేళ్లుగా పురుషోత్తమపట్నం, పట్టిసీమను ఉపయోగించుకోలేదు. ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి మళ్లీ పోలవరాన్ని ట్రాక్లో పెట్టగలిగాం. ప్రాజెక్టు పూర్తవుతుందనే నమ్మకం కలిగింది. చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్న కేంద్రానికి ధన్యావాదాలు. పోలవరం చాలా సున్నితమైన ప్రాజెక్టు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. గోదాట్లో మునిగిన పోలవరం ఇప్పుడు మళ్ళీ గట్టెక్కింది. ఇప్పుడు కొత్త దయాఫ్రమ్ వాల్ నిర్మించడమే మేలని నిపుణులు తేల్చారు. రూ.992 కోట్లతో కొత్త దయాఫ్రమ్ వాల్ నిర్మిస్తాం. 41.15 మీటర్ల ఎత్తుతో మొదటి దశ ప్రాజెక్టు 2027 నాటికి పూర్తి చేయాలన్నదే మా లక్ష్యం.

ఏపీలో మూడు కారిడార్లు..

దేశంలో మొత్తం 12 పారిశ్రామిక కారిడార్లు నిర్మిస్తుంటే ఏపీలో మూడు కారిడార్లు ఉన్నాయి. వీటిపై మొత్తం రూ.28వేల కోట్ల వ్యయం చేయాలని నిర్ణయించారు. కడప జిల్లా కొప్పర్తి, కర్నూలు జిల్లా ఓర్వకల్లులో పారిశ్రామిక హబ్లు వస్తున్నాయి. కృష్ణపట్నానికి కూడా అనుమతిచ్చారు. నక్కపల్లికి ఫార్మా క్లస్టర్ కూడా వస్తోంది. ఇవన్నీ రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి కారణమవుతాయి. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రానికి మంచి రోజు" అని చంద్రబాబు అన్నారు.



## 12 ఏళ్ల ఛత్తీస్‌గఢ్ బాలుడికి అరుదైన ఇన్ఫెక్షన్

### విమానంలో తీసుకొచ్చి ప్రాణాలు కాపాడిన కిమ్స్ వైద్యులు

**విశ్వంభర, హైదరాబాద్:** ఛత్తీస్‌గఢ్‌లో ఓ బాలుడు తీవ్ర అనారోగ్యంతో ప్రాణాపాయ స్థితికి చేరగా కిమ్స్ కడల్స్ ఆసుపత్రి వైద్యులు విమానంలో హైదరాబాద్‌కు తీసుకొచ్చి కాపాడారు. రాయ్‌పూర్ ప్రాంతానికి చెందిన ఈ 12 ఏళ్ల బాలుడికి ఇన్ఫెక్షన్ కారణంగా తీవ్రంగా జ్వరం, ఫిట్స్, మెదడులో ప్రెషర్ తగ్గిపోవడం లాంటి సమస్యలు తలెత్తి గుర్తుపట్టలేని పరిస్థితికి చేరాడు. పరిస్థితి విషమించడంతో ఛత్తీస్‌గఢ్ వైద్యులు సికింద్రాబాద్‌లోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రికి సమాచారం ఇచ్చారు. హైదరాబాద్ నుంచి కిమ్స్ కడల్స్ ఆస్పత్రికి చెందిన వైద్యులు చార్టర్డ్ విమానంలో రాయ్‌పూర్ వెళ్లి అక్కడి నుంచి బాబును హైదరాబాద్‌కు తీసుకొచ్చి చికిత్స అందించారు. దీనికి సంబంధించిన వివరాలను కిమ్స్ కడల్స్ ఆస్పత్రి కొండాపూర్‌కి చెందిన పీడియాట్రిక్స్ విభాగం క్లినికల్ డైరెక్టర్, డాక్టర్ పరాగ్ శంకర్‌రావు డెకాటే తెలిపారు. బాబుకు తీవ్రమైన జ్వరం, ఫిట్స్, మెదడులో ప్రెషర్ తగ్గిపోవడం లాంటి సమస్యలు వచ్చాయని తెలిపారు. దాంతో ఛత్తీస్‌గఢ్ వైద్యులు మెరుగైన చికిత్స కోసం తమను సంప్రదించారని అన్నారు. వెంటనే తాము రాయ్‌పూర్ వెళ్లేలోపు అతడికి ఫిట్స్ పెరగడం, బీపీ తగ్గిపోవడం, బాగా మత్తుగా ఉండిపోయి, ఊపిరి కూడా అందని పరిస్థితి వచ్చిందన్నారు. హైదరాబాద్ నుంచి వెళ్లగానే ముందుగా ఆ బాబుకు వెంటిలేటర్ పెట్టి, పరిస్థితిని కొంత మెరుగుపరిచామని పేర్కొన్నారు.

మెదడులో ప్రెషర్, ఫిట్స్ సమస్యలు తగ్గించేందుకు ముందు కొన్ని మందులు ఇచ్చామని తర్వాత అక్కడి నుంచి విమానంలో హైదరాబాద్‌కు తీసుకొచ్చామని తెలిపారు. ఇలా విమానంలో తీసుకురావడానికి తమ పీడియాట్రిక్ ఐసీయూ కన్సల్టెంట్ డాక్టర్ తరుణ్ సాయపడ్డారని తెలిపారు. ఆ బాలుడు కిమ్స్ ఆస్పత్రిలో 9 రోజులు ఉన్నాడని మధ్యలో బ్రెయిన్ ప్రెషర్ పెరిగి, ఫిట్స్ వచ్చాయని అన్నింటినీ తగిన మందులతో నయం చేశామని పేర్కొన్నారు. దేశంలోని ఏ ప్రాంతంలో ఎంత సంక్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్నవారికైనా చికిత్స చేయగల సామర్థ్యం కిమ్స్ కడల్స్ ఆస్పత్రికి ఉందని డాక్టర్ అవినాష్, డాక్టర్ కళ్యాణ్ (పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్) తెలిపారు. ఇక్కడ చాలా అత్యాధునిక వైద్య సదుపాయాలు ఉన్నాయని చెప్పారు.

# నేడు శ్రీగిరిలో స్వర్ణ రథోత్సవం



**విశ్వంభర, శ్రీశైలం :** శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా శ్రీశైల భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఈ నెల 29న స్వర్ణ రథోత్సవం జరుగనున్నది. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో పెద్దిరాజు ఆలయానికి చెందిన వివిధ విభాగాల అధికారులు, ప్రధాన అర్చకులతో సమీక్ష నిర్వహించారు. స్వర్ణ రథోత్సవం, సామూహిక వరలక్ష్మీవ్రతం ఏర్పాట్లు, భద్రా చర్యలతో పాటు వినాయక నవరాత్రి వేడుకల నేపథ్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. 29న ఆరుద్రా నక్షత్రం సందర్భంగా స్వర్ణరథోత్సవం జరుగుతుందని.. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఉత్సవంలో కోలాటం, చెక్కభజనలు వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని పీఆర్ఓను ఆదేశించారు. రథానికి పుష్పాలంకరణ చేయాలని ఉద్యానవన విభాగాన్ని ఆదేశించారు. పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని చెప్పారు. 30న జరుగనున్న వరలక్ష్మీ వ్రతం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ప్రత్యేకంగా చెంచు మహిళలు పాల్గొనేందుకు వీల్పించామని చెప్పారు. ఈ మేరకు గిరిజనాభివృద్ధి సంస్థ సహాయ సహకారాలు తీసుకోవాలని సూచించారు. చెంచులతో పాటు సాధారణ భక్తులను అనుమతించనున్నట్లు పేర్కొన్నారు. వ్రతంలో పాల్గొన్న వారికి అన్నప్రసాదం అందించనున్నట్లు తెలిపారు. వ్రతం సమయంలో తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. అలాగే, భద్రతపై ఈవో కీలక సూచనలు చేశారు. నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తున్నారని.. ఈ క్రమంలో భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

దేవాదాయ చట్టం మేరకు నిషేధిత వస్తువులు, మత్తు పానియాలు అనుమతించకుండా టోల్‌గేట్ వద్ద పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ మేరకు పోలీసులు సహకరించాలని సీఐకి విజ్ఞప్తి చేశారు. క్షేత్ర పరిధిలో పొగ తాగడం, మాంసాహారం, మద్యాన్ని నిషేధించామని.. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోంటామని బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, రద్దీ క్రమబద్ధీకరణ, క్యూలైన్ల నిర్వహణ, ప్రసాదాల కౌంటర్ల రద్దీ నియంత్రణకు కీలక సూచనలు చేశారు. వినాయకచవితి పర్వదినం మూడోరోజు నుంచే భక్తులు కృష్ణానదిలో వినాయక నిమజ్జనం చేసేందుకు వస్తుండడంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

## ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : ఎమ్మెల్యే మాగంటి



**విశ్వంభర, వెంగళరావునగర్ :** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొటోకాల్‌ను విస్మరిస్తుందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ విమర్శించారు. ప్రొటోకాల్‌కు తిలోదకాలు ఇవ్వడంపై అసెంబ్లీ స్పీకర్‌కు తాను ఫిర్యాదు చేశామని అన్నారు. బుధవారం శ్రీనగర్ కాలనీ డివిజన్ నవోదయ కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ విషయంలో హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం బేఖాతరు చేస్తుందని ఆరోపించారు.గతంలో తమ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులను పంపిణీ చేసేవారమని పేర్కొన్నారు. డివిజన్ వారీగా సభలు పెట్టి లబ్ధిదారులకు చెక్కులతో పాటు బహుమతులను తాను ఇచ్చానని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు ఈ చెక్కులను ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లోనే ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించినట్లు అధికారులు అంటున్నారని తెలిపారు.

పేద ప్రజలు ప్రభుత్వ కార్యాయలయాల చుట్టూ తిరగాలంటే రవాణా ఖర్చులవుతాయన్నారు. ఖైరతాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి లబ్ధిదారుల నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.10 వేలు అధికారులు లంచాలు వసూలు చేస్తున్నట్లు ప్రజలు తన దృష్టికి తెచ్చారని.. అవినీతికి తావులేకుండా గతంలోనే మాదిరిగానే ఇంటింటికీ వెళ్లి లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు.

## జూనియర్ కాలేజీల్లో 2,280 తాత్కాలిక ఉద్యోగాల భర్తీకి అనుమతి

**విశ్వంభర, హైదరాబాద్:** జూనియర్ కాలేజీల్లో 2,280 తాత్కాలిక ఉద్యోగాల భర్తీకి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు జూనియర్ కళాశాలల్లో 1654 అతిథి, 449 కాంట్రాక్టు, 96 పార్ట్ టైమ్, 78 అవుట్ సోర్సింగ్, 3 మినిమమ్ టైమ్ స్కేల్ అధ్యాపకుల భర్తీకి అనుమతిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఏడాది మార్చి 31 వరకు కాలేజీల్లో బోధించేందుకు ఇంటర్ కమిషనరేట్ ఈ తాత్కాలిక నియామకాలు చేపట్టనుంది.

## ములుగు జిల్లాలో ఓ గ్రామాన్ని దత్తత తీసుకుంటా

### రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

### ఉమ్మడి వరంగల్ జిల్లాలో గవర్నర్ పర్యటన

**విశ్వంభర ,ములుగు :** ములుగు జిల్లాలో ఒక గ్రామాన్ని త్వరలోనే దత్తత తీసుకుంటానని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం సాయంత్రం గోవిందరావుపేట మండలం బుస్సాపురం గ్రామంలోని పర్యాటక ప్రాంతమైన లక్నవరానికి చేరుకొని బస చేశారు. బుధవారం ఉదయం అల్పాహారం అనంతరం మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంతో కలిసి సరస్సులో గవర్నర్ స్పీడ్ బోటు షికారు చేస్తూ లక్నవరం అందాలను తిలకించారు. తాను ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని గవర్నర్ వెల్లడించారు. అనంతరం సీతక్క మాట్లా డుతూ జిల్లాలో ఓ గ్రామాన్ని దత్తత తీసుకుంటామని గవర్నర్ హామీ ఇవ్వడం చాలా అభినంద నీయమని అన్నారు. గవర్నర్ పర్యటనకు సహకరించిన కలెక్టర్, పోలీసులు, ప్రజలకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తిరుగు ప్రయాణంలో గవర్నర్ ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానాను సందర్శించి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అదేవిధంగా విషపురుగు కాటుకు గురైన కానిస్టేబుల్‌ను పరా మర్శించారు. గవర్నర్ వెంట టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డి, ఎస్పీ డాక్టర్ పి. శబరీష్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్, అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, శ్రీజ, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డితో పాటు పలు శాఖల అధికారులు ఉన్నారు.



# ఇంటర్నేషనల్ క్రికెట్‌కు డేవిడ్ మలన్ వీడ్కోలు!



**లండన్:** ఇంగ్లండ్ క్రికెటర్ డేవిడ్ మలన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 2017లో సౌతాఫ్రికాతో జరిగిన టీ20తో ఇంటర్నేషనల్ క్రికెట్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. టీ20ల్లో అద్భుత ప్రదర్శనతో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్‌గా నిలిచాడు ఈ ఎడమచేతివాటం బ్యాటర్. 2022లో ఇంగ్లండ్ టీ20 ప్రపంచ కప్‌ను నెగ్గడంలో మలన్ కీలకపాత్ర పోషించాడు. ఇంగ్లండ్ తరఫున 62 టీ20లు ఆడిన మలన్.. 16 హాఫ్ సెంచరీలు, ఒక సెంచరీ నమోదు చేశాడు. 2022 టీ20 వరల్డ్‌కప్ తర్వాత మలన్ కేవలం 15 ఇన్నింగ్స్‌లలో ఐదు సెంచరీలతో వన్డే క్రికెట్‌లోనూ సత్తా చాటాడు. ఇంగ్లండ్ తరఫున 30 వన్డేలు, 22 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు.2023లో ప్రపంచకప్‌లో కనిపించాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే, టీ20 సిరీస్‌లో సీనియర్ ఆటగాడికి చోటు దక్కలేదు. ఈ క్రమంలోనే క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అయితే, ఇంటర్నేషనల్ క్రికెట్‌కు గుడ్ బై చెప్పినా.. ఫ్రాంచైజీ క్రికెట్‌పై దృష్టి సారించనున్నట్లు తెలుస్తున్నది. ఇటీవల ముగిసిన ది హండ్రెడ్ 2024 టైటిల్ గెలిచిన ఓవల్ ఇన్విన్సిబుల్స్ జట్టులో డేవిడ్ మలన్ సభ్యుడిగా ఉన్నాడు. దక్షిణాఫ్రికా టీ20 క్రికెట్ లీగ్ ఎస్ఏ20లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టు ఈ ఏడాది ట్రోఫీని సాధించడంలో మలన్ కీలకపాత్ర పోషించాడు. ఐపీఎల్‌లో పంజాబ్ జట్టు తరఫున 2021 కేవలం ఒకే మ్యాచ్ ఆడాడు.








# ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల

**టాప్-10లో ముగ్గురు టీమిండియా క్రికెటర్లు**

**విశ్వంభర (క్రీడా విభాగం):** అంతర్జాతీయ క్రికెట్ నియంత్రణ మండలి బుధవారం టెస్ట్ ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. టాప్-10లో ముగ్గురు భార బ్యాటర్లు చోటు దక్కించుకున్నారు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ 751 పాయింట్లతో ఆరోస్థానంలో నిలువగా.. యువ సంచలనం యశస్వీ జైస్వాల్ ఏడో ర్యాంక్‌కు చేరుకున్నాడు. సీనియర్ ఆటగాడు విరాట్ కోహ్లీ రెండుస్థానాలు మెరుగుపరుచుకొని ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. పాకిస్థాన్ కెప్టెన్ బాబర్ ఆజామ్ ఆరుస్థానాలు దిగజారుడు. ఇంతకుముందు మూడోస్థానంలో ఉండగా.. తాజాగా తొమ్మిదో స్థానానికి చేరుకున్నాడు. ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టుల్లో విఫలంకావడంతో ర్యాంకుపై సైతం ప్రభావం పడింది. బంగ్లాతో సిరీస్‌లో రాణించిన మరో పాక్ బ్యాటర్ రిజర్వాన్ ఏడు స్థానాలు మెరుగుపరుచుకొని టాప్-10లో చోటు దక్కించుకున్నాడు. ఇక ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్ 881 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. కివీస్ ఆటగాళ్లు కేన్ విలియమన్, డారిల్ మిచెల్ రెండు, మూడోస్థానాల్లో ఉన్నారు. శ్రీలంతో జరిగిన టెస్టులో అద్భుత ప్రదర్శన చేసిన యువ బ్యాటర్ హ్యారీ బ్రూక్ నాలుగో స్థానానికి చేరుకున్నాడు.

# టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యత ఇస్తా: ఐసీసీ ఛైర్మన్ జైషా



**న్యూఢిల్లీ:** ఐసీసీ కొత్త ఛైర్మన్‌గా జైషా ఎన్నికైన విషయం తెలిసిందే. తన పదవీకాలంలో టెస్టు క్రికెట్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు షా తెలిపారు. క్రికెట్ పురోగతికి అడ్డుగా నిలిచిన అన్ని అవరోధాలను తొలగించనున్నట్లు ఆయన చెప్పారు. డిసెంబర్ ఒకటో తేదీన గ్రేగ్ బార్క్లే నుంచి ఐసీసీ ఛైర్మెన్ బాధ్యతలను జే షా స్వీకరించనున్నారు. రెండేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగుతారు.టీ20 క్రికెట్ సహజంగా ఉత్సామభరితమైన ఫార్మాట్ అని, కానీ దానికి సమానంగా టెస్టు క్రికెట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎందుకంటే క్రికెట్‌కు అదే మూలాధారమైందని షా తెలిపారు. బీసీసీఐ కార్యదర్శి షా.. దీనిపై మంగళవారం ఓ స్టేట్మెంట్ రిలీజ్ చేశారు. లాంగెస్ట్ ఫార్మాట్ క్రికెట్ ఆడేదిశగా క్రికెటర్లను మళ్లించాలని, ఆ దిశగా తమ ప్రయత్నాలు ఉంటాయన్నారు. ట్యాలెంట్ ప్లేయర్ల కోసం ప్రత్యేక ప్రోగ్రామ్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ఆట ప్రమాణాన్ని పెంచేందుకు అన్ని ప్రయత్నాలు చేయనున్నట్లు షా హామీ ఇచ్చారు. చాలా కీలకమైన బాధ్యతను అప్పగించారని, మీ ఆశయాలకు తగినట్లు, అందమైన క్రికెట్ ఆటకు అంకిత అవుతానని షా తెలిపారు. అక్టోబర్‌లో జరిగే బీసీసీఐ బోర్డు మీటింగ్‌లో ఆయన తన కార్యదర్శి పోస్టును వదులుకునే అవకాశాలు ఉన్నాయి.ఐసీసీ ఛైర్మెన్‌గా ఎన్నికైన అయిదు భారతీయుడిగా నిలిచాడతను. గతంలో జగన్‌మోహన్ దాల్మియా, శరద్ పవార్, ఎన్ శ్రీనివాస్, శశాంక్ మనోహర్.. ఆ హై ప్రొఫైల్ జాబ్ చేశారు.

# సుదీర్ఘ టెన్నిస్ మ్యాచ్‌లో ఇవాన్స్ విజయం

**5 గంటల 35 నిమిషాలు సాగిన పోరాటం**

**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో.. బ్రిటన్‌కు చెందిన డేనియల్ ఇవాన్స్ స్టన్నింగ్ విక్టరీ కొట్టాడు. అయిదు గంటల 35 నిమిషాల పాటు ఆ మ్యాచ్ సాగింది. యూఎస్ గ్రాండ్‌స్లామ్ చరిత్రలోనే ఇది అతి సుదీర్ఘ మ్యాచ్‌గా నిలిచింది. 6-7 (6/8), 7-6 (7/2), 7-6 (7/4), 4-6, 6-4 స్కోరుతో ఇవాన్స్ విజయం నమోదు చేశాడు. రష్యాకు చెందిన కారెన్ ఖచానోవ్‌పై అతను విక్టరీ సాధించాడు. ఇది చాలా సుదీర్ఘమైన పోరాటమని ఇవాన్స్ తెలిపాడు. మ్యాచ్ ఆద్యాంతం అద్భుతంగా ఆడానని పేర్కొన్నాడు. చివరి సెట్‌లో ఓ దశలో 0-4తో వెనుబడి ఉన్న ఇవాన్స్ అనూహ్య రీతిలో విజృంభించాడు. ఆ సెట్‌లో నాలుగు బ్రేక్ పాయింట్లు సాధించిన ఇవాన్స్ జోరును ప్రత్యర్థి అడ్డుకోలేకపోయాడు. ఆర్థిర్ ఆషే స్టేడియంలో ఉన్న ప్రేక్షకులు మ్యాచ్‌ను ఫుల్ ఎంజాయ్ చేశారు. ప్రతి పాయింట్ కోసం చాలా కష్టపడాల్సి వచ్చిందన్నాడు. ప్రతి సెట్ గంట సమయం దాటింది. మూడవ సెట్ మాత్రం అత్యధికంగా 72 నిమిషాలు తీసుకున్నది.



# రిలయన్స్- డిస్నీ డీల్ కు సీసీఐ గ్రీన్ సిగ్నల్

**దిల్లీ:** మీడియాలో అతిపెద్ద విలీనం విషయంలో మరో ముందడుగు పడింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, వాల్ట్ డిస్నీ మధ్య కుదిరిన మీడియా వ్యాపార విలీనానికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోద ముద్ర వేసింది. విలీనానికి సంబంధించి ఆరు నెలల క్రితమే ఇరు సంస్థలు ప్రకటన చేయగా.. తాజాగా సీసీఐ ఆమోదం ముద్ర వేసింది. చిన్నపాటి మార్పులతో డీలక్కు ఆమోదం తెలిపినట్లు సీసీఐ ఎక్స్ పోస్ట్ చేసింది."రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, వయాకామ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, డిజిటల్ 18 మీడియా లిమిటెడ్, స్టార్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, స్టార్ టెలివిజన్ ప్రొడక్షన్స్ లిమిటెడ్ వంటి సంస్థలకు సంబంధిత ప్రతిపాదిత విలీన ప్రక్రియ స్వచ్ఛంద సవరణకు లోబడి ఆమోదం పొందింది " అని సీసీఐ పేర్కొంది. అయితే, ఆ సవరణలు ఏంటనేవి మాత్రం సీసీఐ వెల్లడించలేదు. విలీనం వల్ల పోటీపరంగా ఇబ్బందులు తలెత్తొచ్చని సీసీఐ ఆందోళన వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చిన కొద్దిరోజులకే ఆమోదం లభించడం గమనార్హం.

# ఆల్‌టైమ్ హైకి నిఫ్టీ.. స్వల్ప లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**విశ్వంభర (బిజినెస్):** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం స్వల్ప లాభాల్లో ముగిశాయి. ట్రేడింగ్‌లో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ తొలిసారిగా గరిష్ఠానికి చేరింది. అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాల మధ్య బెంచ్ మార్క్ సూచీలు ఉదయం ఫ్లాట్‌గా మొదలయ్యాయి. ఆ తర్వాత సూచీలు కోలుకొని లాభాల్లో పయనించాయి. ఆ తర్వాత సూచీలు అమ్మకాల ఒత్తిడికి గురవడంతో చివరలో స్వల్ప లాభాలతోనే సరిపెట్టుకున్నాయి. కిత్రం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,779.84 పాయింట్ల వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 82,039.26 పాయింట్ల గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. కనిష్ఠంగా 81,578.32కి తగ్గింది. చివరకు 73.80 పాయింట్ల లాభంతో 81,785.56 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 25,030.80 పాయింట్ల వద్ద మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికే 25,129.60 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. చివరకు 34.60 పాయింట్లు పెరిగి.. 25,052.35 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మా స్టాక్స్ రాణించాయి. నిఫ్టీలో ఎల్‌టీఐఎండ్‌ట్రీ, విప్రో, దివిస్ ల్యాబ్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ అత్యధికంగా లాభపడ్డాయి. మారుతీ సుజుకీ, నెస్లే ఇండియా, ఏషియన్ పెయింట్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, బ్రిటానియా ఇండస్ట్రీస్ నష్టపోయాయి. సెక్టార్లలో, ఐటీ, ఫార్మా, హెల్త్‌కేర్ ఒక్కొక్కటి ఒకశాతం కంటే ఎక్కువ పెరిగాయి. టెలికాం ఇండెక్స్ 0.5 శాతం, మీడియా ఇండెక్స్ 1.4 శాతం, ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంక్ 0.4 శాతం చొప్పున పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్‌తో సహా విస్తృత సూచీలు రికార్డు స్థాయిని తాకినప్పటికీ చివరకు ఫ్లాట్‌గా ముగిశాయి.






# ఎయిరిండియా కీలక నిర్ణయం.. ప్రాంతీయ భాషల్లోనూ కస్టమర్ కేర్ సేవలు

**విశ్వంభర (బిజినెస్):** దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ ఎయిరిండియా కీలక నిర్ణయం తీసుకుంది. తన కస్టమర్ కేర్ సర్వీసులను మరింత విస్తృతం చేసింది. ఇప్పటివరకు హిందీ, ఇంగ్లిష్ భాషలకే పరిమితమైన తన కస్టమర్ కేర్ సేవలను ఇక నుంచి ప్రాంతీయ భాషల్లోనూ అందించాలని నిర్ణయించింది. ఆ మేరకు తెలుగుతో పాటు ఏడు ప్రాంతీయ భాషల్లోకి కస్టమర్ కేర్ సేవలను అందుబాటులోకి తెచ్చింది.తెలుగుతోపాటు తమిళం, పంజాబీ, మరాఠీ, మలయాళం, కన్నడ, బెంగాలీలో ఎయిరిండియా కస్టమర్ కేర్ సేవలు అందుబాటులో ఉంటాయి. కస్టమర్ల మొబైల్ నెట్‌వర్క్ ఆధారంగా ఐవీఆర్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్) సిస్టం వారి భాష ప్రాధాన్యతను ఆటోమేటిక్‌గా గుర్తిస్తుందని ఎయిరిండియా పేర్కొంది. 'భారతీయ భాషలలో బహుభాషా సపోర్టును తీసుకురావడం అనేది మా ప్రయాణంలో ఒక కీలకమైన మైలురాయి అని చెప్పాలి. ఈ ప్రాంతీయ భాషలను మా కస్టమర్ సపోర్ట్ సర్వీసుల్లో చేర్చడం ద్వారా మేము మా పరిధిని విస్తరించడమే కాకుండా మా కస్టమర్లతో సంబంధాన్ని కూడా బలోపేతం చేసుకున్నట్లయ్యింది. ఎయిరిండియాతో ప్రయాణికులందరినీ కలుపుకుపోయేలా చూస్తాం' అని ఎయిరిండియా చీఫ్ కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్ రాజేష్ డోగ్రా తెలిపారు. ఇక ఇటీవల ఎయిరిండియా ఐదు కాంటాక్ట్ సెంటర్లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వీటి ద్వారా తరచూ ప్రయాణించే వారికి, ప్రీమియం కస్టమర్లకు అన్ని వేళలా కస్టమర్ కేర్ సర్వీసులు అందిస్తామని ఎయిరిండియా తెలిపింది.

# గూగుల్ తో కలిసి పనిచేయనున్న ఏథర్ ఎనర్జీ

**విశ్వంభర (బిజినెస్):**

ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల కోసం ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్ల డేటాను అందించడానికి ఏథర్ ఎనర్జీ.. గూగుల్‌తో కలిసి పనిచేయనున్నట్లు బుధవారం ప్రకటించింది. వినియోగదారులు గూగుల్ మ్యాప్స్ ద్వారా 'ఏథర్ గ్రిడ్' ఫాస్ట్ ఛార్జర్లను గుర్తించవచ్చు. ఈ సహకారం వల్ల లైట్ ఎలక్ట్రిక్ కంబైన్డ్ ఛార్జింగ్ సిస్టమ్ - ఎల్ఈసీసీఎస్ (అధికారిక భారతీయ ఈవీ ఛార్జింగ్ కనెక్టర్ స్టాండర్డ్) ఉన్న ఈవీ వినియోగదారులు తమ ద్విచక్ర వాహనాల కోసం 'ఏథర్ గ్రిడ్' ఫాస్ట్ ఛార్జర్లను గూగుల్లో పూర్తి లైవ్ స్టేటస్ అప్డేట్లతో కనుగొనడానికి అనుమతిస్తుంది. కొత్త ఛార్జర్ను ఇన్స్టాల్ చేసినప్పుడల్లా, అది గూగుల్ మ్యాప్స్ కూడా లిస్ట్ అవుతుంది. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల కోసం ఏథర్ గ్రిడ్కు సంబంధించిన ఫాస్ట్ ఛార్జింగ్ నెట్వర్క్.. దేశీయంగా అభివృద్ధి చేసిన ఎల్ఈసీసీఎస్ పై ఆధారపడి ఉంది. దీన్ని 'బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్' దేశవ్యాప్తంగా ఆమోదించిందని ఏథర్ ఎనర్జీ తెలిపింది. 2024, మార్చి 30 నాటికి 1,973 ఫాస్ట్ ఛార్జర్లు ఇప్పటికే వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని ఏథర్ ఎనర్జీ తెలిపింది.



# పేమెంట్ సర్వీసెస్ లో పెట్టుబడులు.. పేటీఎంకు కేంద్రం ఓకే

దిల్లీ: తమ అనుబంధ సంస్థ అయిన పేటీఎం పేమెంట్స్ సర్వీసెస్ లిమిటెడ్లో పెట్టుబడులు పెట్టేందుకు వన్97 కమ్యూనికేషన్స్కు (పేటీఎం మాతృ సంస్థ) ప్రభుత్వం నుంచి ఆమోద ముద్ర లభించింది. పేమెంట్ అగ్రిగేటర్ లైసెన్స్ కోసం మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ప్రస్తుత భాగస్వాములకు మాత్రం పేమెంట్ అగ్రిగేషన్ సర్వీసులు అందించేందుకు అనుమతిచ్చింది. ఈ విషయాన్ని తన రెగ్యులేటరీ ఫైలింగ్లో వని7 కమ్యూనికేషన్స్ పేర్కొంది. పేమెంట్ అగ్రిగేటర్ లైసెన్స్ కోసం పేటీఎం దరఖాస్తు చేసుకోగా.. ఆర్బీఐ 2022 నవంబర్లో తిరస్కరించింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను అందుకు కారణంగా చూపింది. భారత్ సరిహద్దులు పంచుకున్న దేశాల నుంచి వచ్చే పెట్టుబడులకు ప్రభుత్వం ఆమోదం తప్పనిసరి. అప్లికేషన్ తిరస్కరణ సమయంలో చైనాకు చెందిన అలీబాబా గ్రూప్.. పేటీఎంలో అతిపెద్ద వాటాదారుగా ఉంది. దీంతో అప్పట్లో పెట్టుబడులను తిరస్కరించింది. ఒకే సంస్థ పేమెంట్ అగ్రిగేటర్, ఇ-కామర్స్ మార్కెట్ ప్లేస్ కలిగి ఉండకూడదని ఆర్బీఐ పేమెంట్ అగ్రిగేటర్ మార్గదర్శకాలు పేర్కొంటున్నాయి. ఇవన్నీ పేమెంట్ అగ్రిగేటర్ లైసెన్స్కు పొందే విషయంలో పేటీఎంకు అడ్డంకిగా మారాయి.

# హిందీపరిశ్రమలో టాలెంట్‌కు స్థానం లేదు

## అలాంటి వారిని తీసి పక్కన పెడతారు ● నటి కంగనా రనౌత్ సంచలన వ్యాఖ్యలు



హిందీ చిత్ర పరిశ్రమలో టాలెంట్‌ను ఎంకరేజ్ చేయరని అంటూ బాలీవుడ్ నటి కంగనా రనౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. టాలెంట్ ఉన్నవారికి ఇక్కడ ఎలాంటి గుర్తింపు లభించదని ఆరోపించారు. ప్రోత్సహించే వారు కూడా ఉండరన్నారు. నా దృష్టిలో బాలీవుడ్ ఒక నిస్సహాయ ప్రదేశం. ఈ పరిశ్రమకు చెందిన కొంతమంది ప్రముఖ వ్యక్తులు మనకు ఎలాంటి సాయం చేయరు. టాలెంట్‌ని చూసి వారు అసూయ పడతారు. ఎవరైనా టాలెంట్ ఉన్న వ్యక్తులు తమ దృష్టిలో పడితే తప్పకుండా వారి కెరీర్ నాశనం చేయడానికి చూస్తారు. పీఆర్‌లను నియమించి వారిపై దారుణంగా అవాస్తవాలు ప్రచారం చేయిస్తారు. ఇండస్ట్రీ వారిని బహిష్కరించేలా పరిస్థితులు సృష్టిస్తారు‘ అని కంగనా రనౌత్ ఆరోపించారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. తాను అదే విధమైన పరిస్థితులు ఎదుర్కొన్నానని చెప్పారు. తనను బహిష్కరించారని పేర్కొన్నారు. ‘నా వరకూ నేను మంచి వ్యక్తిని. నా చుట్టూ ఉన్న వారితో మర్యాద పూర్వకంగా నడుచుకుంటా. ఎన్నికల్లోనూ విజయం సాధించా. ఇండస్ట్రీ నుంచి ఎంతో ప్రేమాభిమానం పొందా. దీనిని బట్టి చూస్తే నాతో కొంతమందికి మాత్రమే సమస్య ఉంది. ఆ సమస్య నాలో ఉందా? లేదా వారిలో ఉందా? అనేది వారు కూడా ఒక్కసారి ఆలోచిస్తే మంచిది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ రాజకీయ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'ఎమర్జెన్సీ' ఆమె స్వీయ దర్శకత్వంలో తెరకెక్కింది. సెప్టెంబర్ 6న ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఆమె తాజాగా పలు ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్నారు. తన కెరీర్, బాలీవుడ్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో బాలీవుడ్‌లో తనపై కుట్ర జరిగిందని చెప్పారు. తన సినిమాల్లో యాక్ట్ చేయొద్దని చాలా మందికి చెప్పారని ఆరోపించారు.

# స్పెషల్ సాంగ్‌లో శ్రియా శరణ్



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. ఈ స్టార్ కాంపౌండ్ నుంచి ఇప్పటికే కంగువ విడుదలకు ముస్తాబుతోంది. ఈ సినిమా విడుదల కాకముందే సూర్య 44 కు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు సూర్య. స్టార్ డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ పూజాహెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. తొలి షెడ్యూల్‌లో భాగంగా అండమాన్ లోని పోర్ట్ బెయిర్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తోపాటు సూర్య, పూజాహెగ్డేపై వచ్చే సాంగ్స్‌ను చిత్రీకరించి నట్టు ఇప్పటికే వార్తలు వచ్చాయి. తాజాగా మరో ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ మూవీలో సీనియర్ హీరోయిన్ శ్రియా శరణ్ స్పెషల్ సాంగ్‌లో మెరువనుంది. ఊటీ షెడ్యూల్‌లో ఈ పాటను చిత్రీకరించనున్నారట మేకర్స్. ప్రస్తుతం సినిమా షూటింగ్ ఇడుక్కి పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్నట్టు సమాచారం. ఈ చిత్రంలో పాపులర్ మలయాళ నటుడు జోజు జార్జ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీకి సంతోష్ నారాయణన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. పీరియాడిక్ వార్ అండ్ లవ్ నేపథ్యంలో వస్తోన్న సూర్య 44కు తిరు, 24, పేటా ఫేం సినిమాటోగ్రఫర్ డీవోపీగా పనిచేస్తున్నాడు. సూర్య హోంబ్యానర్ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పై తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని మేకర్స్ 2025 పొంగళ్ కానుకగా రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్.

# నిజాలు బయటపెట్టినందుకు వేధింపులు

## మళయాల నటి మిను వెల్లడి



మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళల స్థితిగతులపై జస్టిస్ హేమ కమిటీ సమర్పించిన నివేదికలో పలు దిగ్భ్రాంతికర విషయాలు వెలుగుచూశాయి. ఇప్పటి వరకు లైంగిక వేధింపుల ఆరోపణలకు సంబంధించి 17 కేసులు నమోదయ్యాయి. ఇదిలా ఉండగా.. గతంలో ఎదురైన చేదు అనుభవాన్ని బయటపెట్టినందుకు తనకు సోషల్ మీడియా వేదికగా బెదిరింపు సందేశాలు వస్తున్నాయని ఓ నటి తెలిపారు. ప్రముఖ నటుడు జయసూర్యతోపాటు ముఖేశ్, మణియన్‌పిళ్ల రాజు, ఇడవేల బాబు వల్ల తాను ఇబ్బందులు ఎదుర్కొన్నా నంటూ నటి మిను మునీర్ ఇటీవల ఆరోపించిన సంగతి తెలిసిందే. అయితే ఈ విషయం బయపెట్టిన దగ్గరి నుంచి తనకు బెదిరింపు సందేశాలు వస్తున్నాయని ఆమె తెలిపారు. దానికి సంబంధించిన స్క్రీన్ షాట్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ విషయం మరో చర్చనీయాంశంగా మారింది. 2013లో ఒక ప్రాజెక్ట్ కోసం వర్క్ చేస్తున్నప్పుడు ముఖేశ్, మణియన్‌పిళ్ల రాజు, ఇడవేల బాబు, జయసూర్యలు అసభ్య పదజాలంతో తనను దూషించినట్లు మిను ఇటీవల ఆరోపించారు. అన్నింటినీ తట్టుకొని సినిమా కోసం వర్క్ చేయాలని నిర్ణయించుకున్నప్పటికీ వారి వేధింపులు మితిమీరాయని వాపోయారు. ఈ సంఘటన వల్ల తాను మానసికంగా ఎంతో కుంగిపోయానన్నారు. మరోవైపు అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ అధ్యక్ష పదవికి ప్రముఖ నటుడు మోహన్‌లాల్ రాజీనామా చేశారు. ఆయనతో పాటు 17 మంది సభ్యులున్న మొత్తం పాలక మండలి పదవుల నుంచి వైదొలిగింది. ఈ మేరకు 'అమ్మ ' సంఘం మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. కమిటీలోని కొంతమంది సభ్యులపైనా లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చాయి. దీంతో నైతిక బాధ్యతగా వీరంతా రాజీనామా చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# విమెన్ ఇన్ సినిమా కలెక్టివ్ సభ్యులు అభినందనీయులు

హేమ కమిటీ రిపోర్ట్ బయట పెట్టిన అంశాలపై బాలీవుడ్ నటి స్వరా భాస్కర్ కీలక వ్యాఖ్యలు చేశారు. నివేదికలో వెల్లడించిన షాకింగ్ విషయాలపై ఆమె విచారం వ్యక్తం చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టారు. కమిటీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన విమెన్ ఇన్ సినిమా కలెక్టివ్ సభ్యులను ఆమె ప్రశంసించారు. వారి వల్లే ఈ కమిటీ ఏర్పడిందని, మలయాళ సినీ ఇండస్ట్రీలో మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు బయటపడ్డాయని తెలిపారు. ‘హేమ కమిటీ నివేదికలోని పలు విషయాలు చదివి నేను షాకయ్యా. మహిళలు ఎదుర్కొంటున్న పరిస్థితులు చూసి నా హృదయం ముక్కలైంది. ఇలాంటి పరిస్థితులు అన్ని రంగాల్లోనూ ఉన్నాయి. సినిమా పరిశ్రమలో పురుషాధిక్యత ఎక్కువ. ఇది రిస్క్‌తో కూడుకున్నది కూడా. సినిమా ప్రారంభం నుంచి విడుదలయ్యే వరకూ ఎంతో డబ్బు ఖర్చు పెడుతుంటారు. ఈ క్రమంలో ఎవరైనా మహిళలు ఇలాంటి సంఘటనల గురించి పెదవి విప్పినా పెద్దగా పట్టించుకోరు. ఇండస్ట్రీలో ఉన్న అగ్ర నటులు, నిర్మాతలు, దర్శకులను అందరూ దేవుళ్లుగా భావిస్తారు. వాళ్లు ఏం చేసినా చెల్లుబాటు అవుతుంది. వారు ఏదైనా అఘాయిత్యానికి పాల్పడితే.. అక్కడ ఎటువంటి నియమాలు వర్తించవు. ఎవరైనా దాని గురించి బయటకు వచ్చి గట్టిగా తమ స్వరాన్ని వినిపిస్తే .. వారిని ట్రబుల్ మేకర్స్ అని ముద్ర వేసేస్తారు. అన్ని పరిశ్రమల్లోనూ మహిళలకు ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు.మలయాళ సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు వర్కింగ్ కండీషన్లు, రెమ్యూనరేషన్, సాంకేతిక రంగంలో మహిళల భాగస్వామ్యం తదితర అంశాలను అధ్యయనం చేసిన కమిటీ.. కాస్టింగ్ కౌచ్ మొదలు వివక్ష వరకు మాలీవుడ్‌లో మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంది. ప్రస్తుతం ఈ నివేదిక చర్చనీయాంశంగా మారింది. పలు చిత్ర పరిశ్రమ?కు చెందిన నటీనటులు తమ అభిప్రాయాలను తెలియజేస్తున్నారు.

# ఇండియాలోనే బిగ్గెస్ట్ సూపర్ స్టార్

## ప్రభాస్‌పై విక్రమ్ ప్రశంసల వర్షం



ప్రపంచస్థాయిలో అభిమానులను సొంతం చేసుకున్న స్టార్ హీరో ప్రభాస్ ప్రస్తుతం వరుస విజయాలను అందుకుంటూ రికార్డులు సొంతం చేసుకుంటున్నారు. తాజాగా ప్రభాస్ గురించి కోలీవుడ్ స్టార్ హీరో విక్రమ్ ఆసక్తికర కామెంట్స్ చేశారు.'ప్రభాస్ ఇప్పుడు ఇండియాలోనే బిగ్గెస్ట్ సూపర్ స్టార్. అతడిని తెలుగు హీరో అనడం సరికాదు’ అని విక్రమ్ అన్నారు. మాళవిక మాట్లాడుతూ.. ప్రభాస్‌తో కలిసి నటించే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. భాషపరంగా సినిమా సరిహద్దులను తొలగించారని ప్రశంసించారు. ఆయన నటించిన సినిమాలపై ప్రేక్షకులు చూపే అభిమానం చూస్తే ఆశ్చర్యమేస్తుందని చెప్పారు. ఈ ఏడాది 'కల్కి 2898 ఏడీ’తో భారీ విజయాన్ని అందుకున్న ప్రభాస్.. ప్రస్తుతం వరుస పాన్ ఇండియా సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'రాజాసాబ్’. వచ్చే ఏడాది ఏప్రిల్ 10న ఇది ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. తాజాగా దీని షూటింగ్ అప్‌డేట్‌పై నిర్మాత క్లారిటీ ఇచ్చారు. 'ప్రభాస్ పాత్ర చిత్రీకరణ పూర్తయింది. సినిమా షూటింగ్ కూడా కంప్లీటైంది’ అని ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్‌కు నిర్మాత శ్రీనివాస కుమార్ (ఎస్‌కెఎన్) రిప్లై ఇచ్చారు. 'ప్రభాస్ పాత్ర పూర్తయితే సినిమా షూటింగ్ అంతా కంప్లీట్ అయినట్లు కాదు కదా!’ అని పేర్కొన్నారు. ప్రస్తుతం దీని చిత్రీకరణ శరవేగంగా జరుగుతోందన్నారు. రొమాంటిక్ హారర్ కామెడీ నేపథ్యంలో సిద్ధమవుతోన్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మాళవిక మోహనన్‌తో పాటు నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలుగా కనిపించనున్నారు.

# ధైర్యంగా ముందుకు వచ్చిన మహిళలకు అండగా నిలవండి

## సినీనటి ఖుష్బూ పిలుపు



హేమ కమిటీ రిపోర్ట్ ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు సినీ నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ. ప్రతి పరిశ్రమలోనూ ఇలాంటి పరిస్థితులే ఉన్నాయంటూ తాజాగా ఆమె ఎక్స్ లో పోస్ట్ పెట్టారు. ‘మన చిత్ర పరిశ్రమలో మహిళలు ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవడం బాధాకరం. వీటిపై ధైర్యంగా ముందుకు వచ్చిన మహిళలను మెచ్చుకోవాలి. వేధింపులను బయట పెట్టడానికి హేమ కమిటీ రిపోర్ట్ ఎంతో ఉపయోగపడింది. కెరీర్‌లో రాణించాలనుకుంటే వేధింపులు లేదా కమిట్‌మెంట్ ఇవ్వాలని కోరడం లాంటి పరిస్థితులు మహిళలకు అన్ని రంగాల్లోనూ ఎదురవుతున్నాయి. పురుషులకూ ఇలాంటి పరిస్థితులు ఉండొచ్చు. కానీ ఎక్కువగా వేధింపులు ఎదుర్కొనేది స్త్రీలే. ఈ విషయంపై నా కుమార్తెలతోనూ సవివరంగా చర్చించాను. మీరు ఎప్పుడు మాట్లాడారనేది విషయం కాదు. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ధైర్యంగా వచ్చి చెప్పాలి. ఘటన జరిగిన వెంటనే మాట్లాడితే దర్యాప్తునకు సహాయ పడుతుంది. బాధితులకు మన సపోర్ట్ ఎంతో అవసరం. వారి బాధను మనం వినాలి. మానసికంగా వారికి ధైర్యం చెప్పాలి. సమస్య ఎదురైనప్పుడే వారెందుకు మాట్లాడలేదని చాలామంది ప్రశ్నిస్తున్నారు. బయటకు వచ్చి చెప్పే ధైర్యం అందరికీ ఉండదు కదా. తండ్రి వేధింపుల గురించి బయటకు వచ్చి మాట్లాడటానికి ఎందుకు అంత సమయం తీసుకున్నావు? అని చాలామంది గతంలో నన్ను అడిగారు. నిజమే.. నేను ముందే మాట్లాడాల్సింది. ఆ ఘటన కెరీర్ విషయంలో జరిగింది కాదు. నన్ను రక్షించాల్సిన వ్యక్తి నుంచే నేను వేధింపులు ఎదుర్కొన్నా. చాలామంది మహిళలకు కుటుంబం నుంచి సరైన మద్దతు లేదనే విషయాన్ని అందరూ అర్థం చేసుకోవాలి. చిన్న గ్రామాలకు చెందిన ఎంతోమంది అమ్మాయిలు ఎన్నో ఆశలతో ఇక్కడికి వస్తారు. వారి ఆశలను ఆదిలోనే తుంచేస్తున్నారు. పురుషులందరికీ నేను చెప్పేది ఒక్కటే.. బాధిత మహిళలకు అండగా నిలవండి. మహిళలపై జరుగుతున్న ఈ సంఘటనలపై మీరు కూడా స్పందించాలి. మీ ప్రేమ, మద్దతును వారికి అందజేయండి. గుర్తుంచుకోండి, అందరూ కలిసి ఈ గాయాలు మానేలా చేయగలం. ఈ నివేదిక మనందరిలో మార్పు తీసుకురావాలి‘ అని ఖుష్బూ తెలిపారు. ‘తన భార్యాపిల్లల్ని చిత్రహింసలు పెట్టడం, కన్న కూతురిపై లైంగిక వేధింపులకు పాల్పడడాన్ని జన్మహక్కుగా భావించే వ్యక్తి వల్ల నా తల్లి వైవాహిక బంధంలో ఇబ్బందులు పడింది. ఎనిమిదేళ్ల వయసులోనే నేను లైంగిక వేధింపులు ఎదుర్కొన్నా. ఈ విషయాన్ని చెబితే మా అమ్మ నమ్ముతుందో లేదోనని ఎంతో భయపడ్డాను. ఎందుకంటే.. ఏం జరిగినా తన భర్త దేవుడని నమ్మే మనస్తత్వం ఆమెది. 15 ఏళ్ల వయసులో ఆయనకు ఎదురుతిరగడం మొదలుపెట్టాను. నాకు 16 ఏళ్లు రాకముందే ఆయన మమ్మల్ని వదిలివెళ్లి పోయాడు. ఆ సమయంలో మేము ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నాం‘ అని గతంలో ఖుష్బూ తాను ఎదుర్కొన్న వేధింపుల గురించి తెలియజేశారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com